13-12Pg1exHMNWJQEV 1 ONG_13-12Pg1exHMNWJQEV.qxd 13/Dec/25 12:14 AM Page 1

మాస్టర్ గతి మారింది కొత్త బొమ్మ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు

మీ నమ్మకమే మా తరగని సంపద
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

: fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-12-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 312 పేజీలు: 12 వెల: 6.50

## గాఢ నిద్రలో 'ఘాట్' విషాదం



శుక్రవారం మారేడుమిల్లి ఘాట్‌లో బస్సు పల్టీకొట్టిన దృశ్యం

# యాత్రికుల బస్సు పల్టీ

### 9 మంది అక్కడికక్కడే మృతి

### 21 మందికి గాయాలు

బాధితులంతా చిత్తూరు, బెంగళూరు, హైదరాబాద్ వాసులు

చింతూరు సమీపంలోని 'చైనావాల్' వద్ద దుర్ఘటన

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు

మృతుల కుటుంబాలకు రూ. 7లక్షలు, గాయపడిన వారికి 2.5 లక్షల పరిహారం

**చింతూరు డిశంబరు 12 ప్రభాతవార్త:** అల్లూరి జిల్లా చింతూరు-మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో శుక్రవారం తెల్లవారుజామున 37 మంది యాత్రికులతో కూడిన ప్రవేటు బస్సు ఘోర ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో 9మంది యాత్రికులు ప్రమాద స్దలంలోనే ప్రాణాలు కోల్పోగా 21 మంది గాయాలతో బయటపడ్డారు. చిత్తూరుకు చెందిన యాత్రికుల బస్సు ఎపి 39, యుయం6543 మారేడుమిల్లి మీదుగా భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దర్శనానికి వెళ్తున్న బస్సు ఘాట్ రోడ్డులో అదుపు తప్పి పల్టీలు కొట్టింది. చింతూరుకు 21 కిలోమీటర్ల దూరంలోని చైనా వాల్ అని పిలువబడే ప్రాంతంలో బస్సు అదుపుతప్పి పైఘాట్ రోడ్డునుండి క్రిందఘాట్‌రోడ్డు వైపు మూడు పల్టీలు >>2



శుక్రవారం విశాఖలో కాగ్నిజెంట్ కార్యాలయానికి భూమిపూజ చేస్తున్న సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, ఎంపి భరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు

# ఐటి కేంద్రంగా విశాఖ

స్టార్టప్ కంపెనీలకు భారీ ప్రోత్సాహం

135 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా విశాఖ ఎకనమిక్ రీజియన్

కాగ్నిజెంట్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

25 వేల ఉద్యోగాలు కల్పిస్తామన్న సిఇఒ

**విశాఖపట్నం, డిసెంబరు 12 ప్రభాతవార్త:** విశాఖలో ఐటీ ఎకో సిస్టం ఏర్పడుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల విశాఖ ఐటీ కేంద్రంగా అవతరిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. విశాఖపట్నంలోని కాపులుప్పాడ ఐటీ హిల్స్‌లో ప్రముఖ ఐటీ సంస్థ కాగ్నిజెంట్ కొత్త క్యాంపస్ నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం శంకుస్థాపన చేశారు. 25 వేల మంది ఉద్యోగులు పనిచేసేలా అత్యాధునిక వసతులతో క్యాంపస్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. మొత్తం రూ.1,583 కోట్ల పెట్టుబడితో 2033 నాటికి 3దశల్లో కాగ్నిజెంట్ టెక్నాలజీస్ క్యాంపస్ పూర్తికానుంది. 2026 నాటికి మొదటి దశ నిర్మాణాన్ని కాగ్నిజెంట్ పూర్తి చేసుకోనుంది. అప్పటివరకు తాత్కాలిక కార్యాలయంలో కాగ్నిజెంట్ కార్యకాలపాలు కొనసాగనున్నాయి. >>2

## జల సంరక్షణలో రాష్ట్రం టాప్

**విజయవాడ,డిసెంబరు 12,ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రామాల్లో జల సంరక్షణకు సంబంధించి 'జల సంచాయ్-జన భాగిదారి' కార్యక్రమం అమల్లో జాతీయ స్థాయిలో ఏపీ మొదటి స్థానంలో నిల్చింది. మిగతా రాష్ట్రాల కంటే అత్యధికంగా ఈఏడాది 4,20,146 పనులు ప్రారంభించి, ఇప్పటి వరకు 2,99,114 పూర్తి చేసింది. మిగతా 1,21,032 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. కార్యక్రమం అమలును సమీక్షించిన >>2



కుక్కల దాడిలో గాయపడిన బాలుడు

## చిన్నారిపై కుక్కల దాడి

### పరిస్థితి విషమం

### ఆత్మకూరులో దారుణం

**ఆత్మకూరు, డిసెంబరు 12 ప్రభాతవార్త:** పట్టణంలోని ఇస్లాం పేటలో నివాసముంటున్న అర్షియా పై శుక్రవారం కుక్కల దాడి చేసి తీవ్ర గాయాల పాలు కావడంతో ప్రాణపాయ స్థితిలో ఉన్న ఆ చిన్నారిని వెంటనే ఆత్మకూరు ప్రభుత్వం వైద్యశాలకు తరలించారు కుక్కలదాడిలో తీవ్ర గాయాలైన చిన్నారికి శరీరంలో దవడ, చెవితోపాటు పలుచోట్ల తీవ్ర రక్తస్రావంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు వైద్యశాలకు వెళ్లినట్లు సమాచారం. ఆత్మకూరు పురపాలక సంఘంలో వీధి కుక్కలు, ఆవులతోపాటు >>2

## చిన్న మున్సిపాలిటీలకు 5కోట్ల రుణం

**విజయవాడ,డిసెంబరు 12,ప్రభాతవార్త ప్రతినిధి:** జనాభా లక్ష కంటే తక్కువ కలిగిన పురపాలక సంఘాలకు ఆర్థిక సంస్థల నుంచి ప్రభుత్వం రూ.5కోట్ల చొప్పున రుణం అందించనుంది. క్రెడ్ ఎన్‌హాన్స్‌మెంట్ స్కీం (సీఈఎస్) కింద పదిపురపాలక సంఘాలను ప్రయోగాత్మకంగా ఎంపిక చేసింది. బ్యాంకులు అందించిన రుణాన్ని ఆయా పట్టణాల్లోని ఖాళీ స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు, మార్కెట్‌లు, ఇతర వాణిజ్య సంబంధిత కార్యకలాపాల కోసం వినియోగించుకోవాలి. చిన్న పురపాలక సంఘాల ఆర్థిక పరిపుష్టికి దోహదం చేసేలా ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించాయి. చిన్న పురపాలక సంఘాలకు ఆస్తి పనన్ను, పన్నేతర ఆదాయం తక్కువగా ఉన్నందున వాటి నిర్వహణ కష్టమవుతోంది. నిధుల కొరతతో అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నారు. >>2

# మీ విజయం స్ఫూర్తిదాయకం

## ప్రపంచకప్ విజేతలైన అంధమహిళల క్రికెట్ జట్టుతో డి.సిఎం పవన్

### ఒక్కో క్రికెటర్‌కు రూ.5 లక్షల నగదు, వారి కోచ్‌లకు రూ.రెండు లక్షల నజరానా

**విజయవాడ,డిసెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంపట్ల అభిమానం, స్వాభిమానమే మన ఆటగాళ్ళకు విశ్వవ్యాప్త గుర్తింపు తీసుకుని వస్తుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. క్రీడల్లో రాణించడానికి శారీరక వైకల్యం, అంధత్వం, లింగవివక్ష అడ్డంకి కావు అన్నారు. ఎవ్వరైన ఒక నిర్ణయంతో అడుగులు ముందుకు వేస్తే అది మన చుట్టూ ఉండే సమాజానికి మంచి చేసేదిగా ఉండాలన్నారు. మనకు తెలియకుండానే మన పక్కవారు మన ఎదుగుల కోరుకుంటారని, మన రంగాల్లో గెలుపు సాధిస్తే ఒక్క కుటుంబమే కాదు ప్రపంచం హర్షిస్తుందన్నారు. డీ సీఎం తన క్యాంపు కార్యాలయంలో క్రికెటర్లు, శిక్షకులు, సహాయక సిబ్బంది ఈ భేటీ అయ్యారు ప్రపంచ కప్ సాధించిన క్రికెటర్లను అభినందించారు. ఒక్కో క్రికెటర్‌కు రూ. 5లక్షల చొప్పున చెక్ ప్రదానం చేశారు. శిక్షకులకు రూ. 2 లక్షలు చొప్పున చెక్కులు అందించారు. ప్రతి మహిళ క్రికెటర్ కీ పట్టు చీర, శాలువాతోపాటు జ్ఞాపిక, కొండపల్లి బొమ్మలు, అరకు కాఫీతో కూడిన బహుమతులను అందించి సత్కరించారు. మహిళా అంధ క్రికెటర్లు సాధించిన విజయం దేశానికే గర్వకారణమని పవన్ కళ్యాణ్ కొనియాడారు. అంధ క్రికెటర్ల ప్రాక్టీస్ కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని, అన్ని విధాలా అండగా నిలవాలని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు స్వయంగా విజ్ఞప్తి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని, మహిళా క్రికెటర్లు తెలిపిన అంశాలను గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. ప్రపంచ కప్ గెలిచిన జట్టులో ఉన్న ఆంధ్ర ప్రదేశ్ క్రీడాకారిణులు దీపిక (జట్టు కెప్టన్), పాంగి కరుణా కుమారి ఉండటం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా జట్టు కెప్టన్ దీపిక తమ గ్రామ సమస్యలు తెలిపారు. ఆమె శ్రీ సత్య సాయి జిల్లా హేమావత్ పంచాయతీ తంబలహట్టి తండాకు చెందినవారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం కావాలని దీపిక విజ్ఞప్తి చేశారు. ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకి చెందిన క్రికెటర్ కరుణకుమారికి చేసిన విజ్ఞప్తులపైనా తక్షణ మే చర్యలు ప్రారంభించాలన్నారు.



ప్రపంచ కప్ విజేతగా నిలిచిన భారత మహిళల అంధుల క్రికెట్ జట్టుతో డిసిఎం పవన్

## 18, 19న సిఎం ఢిల్లీ పర్యటన

**విజయవాడ,డిసెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి ఢిల్లీ పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 18, 19 తేదీల్లో ఆయన హస్తినలో పర్యటించి, రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై కేంద్ర ప్రభుత్వపెద్దలతో చర్చలు జరపనున్నారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా సాగే ఈ పర్యటనకు రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది. షెడ్యూల్ ప్రకారం, డిసెంబర్ 18వ తేదీసాయంత్రం 6 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడ నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళతారు. అదేరోజు రాత్రి కేంద్రంలోని కొందరు కీలక నేతలు, ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక 19వ తేదీన రోజంతా ఆయన ఢిల్లీలోనేఉంటారు. పార్లమెంట్ హౌస్‌లో పలువురు కేంద్రమంత్రులతో వరుస భేటీలు జరపనున్నారు. ఈ సమావేశాల్లో ప్రధానంగా రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అభివృద్ధి పనులకు అవసరమైన అనుమతులపై దృష్టి సారించనున్నారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి అందాల్సిన సహాయం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై స్పష్టత కోరనున్నారు. దీంతో పలు పెండింగ్ అంశాలు కొలిక్కి వస్తాయని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్ లోపల పనులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

# వెలిగొండ వచ్చే యేడాది పూర్తి

### పనుల రోజువారీ లక్ష్యాలు పెంచాం

### రాష్ట్రజలవనరుల మంత్రి నిమ్మల

**దోర్నాల, డిసెంబరు 12 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులు మీదుగా భూమి పూజ చేసుకున్న వెలిగొండ ప్రాజెక్ట్ పనులు 2026కి పూర్తి చేయాలని పట్టుదలతో పని చేస్తున్నట్లు రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. శుక్రవారం ఈ ప్రాజెక్టుకు సంబంధించి టన్నెల్‌లో 18 కి.మీ లోపలి వరకు ఆయన ప్రయాణించి, క్లిష్టమైన లైనింగ్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో కలసి ప్రాజెక్టు పనుల పురోగతిపై ఇరిగేషన్ అధికారులు, ఏజెన్సీలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు పరిధిలో ఇప్పుడు జరుగుతున్న పనులతో పాటు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ వరకు పూర్తి చేయడానికి మరో మూడు నుంచి నాలుగు వేల కోట్లు అవసరమవుతాయని మంత్రి స్పష్టం చేశారు. ఇన్ని పనులు ఉండగా ఈ ప్రాజెక్టు పూర్తయిపోయిందని జగన్మోహన్ రెడ్డి జాతికి అంకితం చేయడం ఎంత విడ్డూరమో ఆలోచించాలన్నారు. రాష్ట్ర చరిత్రలో దగాకి మోసానికి జగన్ బ్రాండ్ అంబాసిడర్‌గా మంత్రి నిమ్మల ఎద్దేవా చేశారు. వెలిగొండ ప్రాజెక్టులో జగన్ చేసిన తప్పిదాలు మోసం, దగా, జిల్లా రైతులకు తెలియాలనే రైతులతో కలసి సమీక్ష నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హెడ్ రెగ్యులేటర్‌లో 2200 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తి చేశామని ఆయన స్పష్టం చేశారు. 18నెలల కాలంలోనే టన్నెల్స్‌లో క్లిష్టమైన 3 కి.మీ లైనింగ్ పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. >>2

# జనగణనకు 11,718 కోట్లు

2027లో రెండు విడతలుగా లెక్కింపు

కులగణనకూడా అప్పుడే

ఉపాధి హామీ పథకం పేరు పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజనగా మార్పు

కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్



**న్యూఢిల్లీ, డిసెంబరు 12:** దేశవ్యాప్తంగా 2027లో చేపట్టనున్న జనగణనకు డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. జనాభా లెక్కల సేకరణతోపాటు కులగణనను కూడా చేపట్టనున్నారు. రెండు విడతల్లో జరుగనున్న జన, కులగణన కోసం కేటాయించిన రూ.11,718 కోట్ల బడ్జెట్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యతన సమావేశమైన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కేబినెట్ భేటీ వివరాలను కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. 2027 మార్చి 1ని రిఫరెన్స్ తేదీగా నిర్ణయించింది. భారతదేశంలో 150 ఏళ్లకు పైగా జనాభా లెక్కల సేకరణ జరుగుతోంది. అందుకు సంబంధించిన రికార్డులు అన్నీ మన వద్ద ఉన్నాయని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. దానికి కొనసాగింపుగా 2027 జనగణన చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కాగా జనగణనతోపాటే కులగణనను కూడా కేంద్రం చేపట్టనుందని మంత్రి తెలిపారు. అయితే వ్యక్తుల కులం వివరాలు దాచి ఉంచుకునే అవకాశం పౌరులకు కల్పిస్తున్నామని ఆయన చెప్పారు. డిజిటల్ డాటాలో పౌరులు తమ వ్యక్తిగత వివరాలను హైడ్ చేసుకుంటే ఎవరికీ కనిపించవని, కేవలం ప్రాథమిక సమాచారం మాత్రమే కనిపిస్తుందని స్పష్టంచేశారు. ఇక బీమా రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల బిల్లుకు కూడా కేబినెట్ పచ్చజెండా ఊపింది. ప్రస్తుతం సాధారణ, జీవిత, ఆరోగ్య బీమాలో 74 శాతం వరకు ఎఫ్‌డీఐలను అనుమతిస్తున్నారు. తాజా నిర్ణయంతో బీమా రంగంలోకి వందశాతం ఎఫ్‌డిఐలు రానున్నాయి. పౌర అణు విద్యుత్ రంగంలో ప్రైవేటు భాగస్వామ్యానికి ఉద్దేశించిన బిల్లుకు కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. బొగ్గు గనుల్లో సంస్కరణలకు >>2



# పరకామణి చోరీపై ముమ్మర దర్యాప్తు

### హైకోర్టు ఆదేశాలతో సిఐడి, ఎసిబి రంగంలోకి

### ఇప్పటికే లభించిన సమాచారంతో ఆస్తుల చిట్టా గుట్టురట్టు!

**తిరుమల,డిసెంబరు 12ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పరకామణి చోరీ కేసులో ఇప్పటికే ముమ్మరంగా దర్యాప్తుచేపట్టి, కీలక నివేదికలు హైకోర్టుకు సమర్పించిన సిఐడికి మరోసారి నిందితుడు రవికుమార్ ఆస్తులపై సమగ్రవివరాలతో విచారణ చేయాలని ఆదేశించడంతో రంగంలోకి దిగుతున్నారు. సిఐడి ,ఏసిబి అధికారులు సంయుక్తంగా నేడు(శనివారం)తిరుపతికి చేరుకునే అవకాశం ఉంది. రెండు శాఖల >>2

13-12pg2exHMNWJQEV 2_13-12pg2exHMNWJQEV.qxd 13/Dec/25 12:16 AM Page 1



# యాత్రికుల బస్సు పల్టీ

>> కొట్టింది. యాత్రికులు అందరు గాఢ నిద్రలో ఉండటంతో చాలా మంది నిద్రలోనే ప్రాణాలు కోల్పోయారు.కారు చీకటి,ఎముకలు కొరికే చలి.ఫోన్ సిగ్నల్ పనిచేయని ప్రాంతం.ఎక్కడ ఏమి ఉందో కనిపించని కారు చీకటి.ఒళ్లంతా రక్తం,ఒకరి మీద ఒకరు పడిపోయి,ఏం జరిగిందో అర్ధం కాక కేకలు వేసుకుంటూ కొందరు గాయాలతో బస్సుఅద్దాలను పగలగొట్టి రోడ్డు మీదకు చేరుకోని ఆహాకారాలు చేశారు.వారు చేసిన ఆహాకారాలు ఆ దేవుడికే తెలియాలి.అటువంటి హృదయ విధారక ఘటన.అదే సమయంలో ఒక గంట తరువాత అటుగా వచ్చిన వాహన దారులు ప్రమాదాన్ని పసిగట్టి సిగ్నల్ ప్రాంతానికి వచ్చి చింతూరు పోలీసులకు సమాచారం అందించారు.అప్పటికే సమయం ఉదయం 5గంటలు దాటింది.ప్రమాదం జరిగి సుమారు 2గంటల తరువాత కాని విషయం బాహ్య ప్రపంచానికి తెలియలేదు.విషయం తెలుసుకున్న చింతూరు పోలీసులు స్పందించి 108కు సమాచారం అందించటంతో తమ బలగాలతో హుటా హుటినా ప్రమాద స్థలానికి చేరుకోని సహాయక చర్యలను ముమ్మరం చేశారు. క్షత గాత్రులను చింతూరుకు తరలించారు.చింతూరు ఏరియా ఆసుపత్రి మొత్తం క్షతగాత్రులతో నిండిపోయింది.ఆప్తులను,కుటుంబ సభ్యులను కోల్పోయిన భాధితుల రోదన వర్ణనాతీతం.చింతూరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి శుభం నోక్వాల్,చింతూరు ఎయస్‌పి బోడ్డు హేమంత్ ఘటన స్థలానికి చేరుకోని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించటానికి కృషిచేశారు.ఘటన స్థలంలోని మృతదేహాలను అంబులెన్స్‌లో చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.ఈ వార్త మీడియాలో చక్కర్లు కొట్టడంతో ఎపి ప్రభుత్వం వెంటనే స్పందించి ఉన్నతాధికారులను ,ముగ్గురు మంత్రులను,యంయల్ఎ,ట్రైబల్ కమీషన్‌ను ఘటన స్థలానికి పంపటంతో పాటు క్షతగాత్రులను పరమర్శించి ,వారికి అవసరమైన మెరుగైన వైద్యం అందించటానికి పూర్తి స్థాయిలో చర్యలు చెపట్టాలని ఆదేశించింది.బస్సు ప్రమాదం పట్ల ప్రధాన మంత్రి నరేంద్రమోడి విచారం వ్యక్తం చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాడు ఆదేశాల మేరకు మంత్రులు ,ఉన్నతాధికారులు ఘటన స్థలాన్ని సందర్శించి భాధితులను పరమర్శించటంతో పాటు వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టారు. జిల్లా మంత్రి గుమ్మడి సంధ్యారాణి,రాష్ట్ర హోమ్ మంత్రి వంగలపూడి అనిత,రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిలు ఘటన స్థలాన్ని సందర్శించి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.అనంతరం చింతూరు ఏరియా ఆసుపత్రికి చేరుకోని క్షత గాత్రులను పరమర్శించి అండగా ఉంటామని,మెరుగైన వైద్యసేవలు అందిస్తామని,చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయలంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు.మీడియాతో హోమ్ మంత్రి,రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ॥5లక్షలు,గాయపడ్డవారికి రూ॥2లక్షలు ఎక్స్‌గ్రేషియా అందజేస్తామని,కేంద్రం తరపున మృతుల కుటుంబాలకు మరో రూ॥2లక్షలు,క్షతగాత్రులకు కేంద్ర తరపున రూ॥50వేలు అందజేస్తామని ప్రకటించారు.మృతదేహాలకు పంచనమా నిర్వహించి ఐదు అంబులెన్స్‌ల్లో మృతదేహాలను వారి స్వగ్రామాలకు తరలిస్తామని, గాయపడ్డవారికి వారి పరిస్థితి నిలకడగా ఉంటంతో చిత్తూరుకు తరలించి అక్కడి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మెరుగైన వైద్యసేవలు అందేలా చూడటంతో పాటు వారి వారి కుటుంబాలను కలిపేలా ప్రభుత్వం భాద్యత తీసుకుంటుందని, ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని,మంచు కారణంగా ప్రమాదాలు జరుగుతున్న రీత్య రాత్రి 10గం॥ల తరువాత ఘాట్ రోడ్డులో తెల్లవారు ఉదయం వరకు వాహనాలు నిలిపివేస్తామని తెలిపారు. ప్రభుత్వం, అదికారులు, వైద్యాధికారులు, స్థానికులు, మీడియా స్పందించిన తీరు పట్ల క్షతగాత్రులు హర్షం వ్యక్తం చేశారు.బాధితులను వారి సొంత జిల్లా చిత్తూరుకు తరలించటానికి అవసరమైన అన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులకు ఆదేశాలు జారిచేశారు.



శుక్రవారం క్షతగాత్రులను ఆసుపత్రిలో పరామర్శిస్తున్న మంత్రులు అనిత, రాంప్రసాద్‌రెడ్డి, గుమ్మడి సంధ్యారాణి

ఘటనకు సంబంధించి భాధితులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 6వ తేదిన చిత్తూరునుండి 32 మంది యాత్రికులు, ఇద్దరు డ్రైవర్లు,ఇద్దరు వంటవాళ్లు, ఒక ఆర్గనైజర్‌తో కలిపి మొత్తం 37 మందితో బస్సు బయలు దేరింది. చిత్తూరునుండి బయలుదేరిన యూత్రికుల బస్సు అమరవతి, కోట్టప్పకొండ, మంగళగిరి, బెజవాడ కనకదుర్గమ్మ, ద్వారకా తిరుమల, భీమ వరం, పాలకొల్లు, అంతర్వేధి, ద్రాక్షరామం, సామర్లకోట, పిఠాపురం, అన్న వరం, సింహాచలం, అరసవెల్లి, శ్రీకూర్మం,అరకులోయ వరకు దర్శనాలు పూర్తి చేసుకోని శుక్రవారం ఉదయం భద్రాచలం చేరుకోని భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామిని దర్శనం చేసుకోని శ్రీశైలం మీదుగా మళ్ళి చిత్తూరుకు తిరుగు ప్రయాణం కావాల్సి ఉంది.ఈ నేపథ్యంలోనే అరకు నుండి రాత్రి 11గంట ప్రాంతంలో మారేడుమిల్లి చేరుకున్న వీరి బస్సు మార్గ మద్యలో వంటలు చేసుకోని తిని తెల్లవారుజామున భద్రాచలంకు బయలుదేరారు.అల్ప ఉష్ణోగ్రతలకారణంగా విపరీతమైన మంచు కురుస్తుంది.మరో ఆరు కిలోమీటర్లు వాళ్ళు ప్రయాణం పూర్తి చేస్తె ప్రమాదకరమై మలుపులు, ఘాట్ రోడ్డు దాటవచ్చు.అంతలోనే మృత్యువు ప్రమాదం రూపంలో పొంచి ఉండి చైనావాల్ మలుపుకు పై మలుపు నుండి బస్సు అదుపు తప్పి కొండమీద నుండి పల్టీలు కొట్టుకుంటూ జారి పోయింది.అదృష్టం బాగుండి ఒక చెట్టు బస్సును ఆపివేయటంతో 9మంది ప్రాణాలు కోల్పోయి పెనుప్రమాదం తప్పింది.అదే చెట్టు బస్సును ఆపి ఉండకుంటె మృతుల సంఖ్యను ఊహిం చలేం. ఘటన స్థలాన్ని చూస్తె ఒళ్లు జలదరిస్తుంది.అటువంటి ప్రమాదంలో మిగిలిన వారు గాయాలతో బయట పడటం అదృష్టమే.

**మృతుల వివరాలు:**1.సైలా రాణి(64) తెనాలి, 2.శ్యామల(50) తిరుపతి. 3.పి.సునంధా(50) పలమనేరు, 4.శిశంకర్‌రెడ్డి (52),. 5.యస్.వి. నాగేశ్వర రావు(50) చిత్తూరు.,6.కావేరి క్రిష్ణ(55) రామలయం నగర్ బెంగుళూరు,. 7.శ్రీకళ(62) గిరింపేట .చిత్తూరు,.8.దొరబబాబు(55) మురుగంపేట, చిత్తూరు,. 9.క్రిష్ణ కుమారి (50) కె.ఆర్.పురం బెంగళూరు.

**క్షతగాత్రుల వివరాలు:**1.వై.వెంకటనర్సింహారెడ్డి.2.పాపర రమేష్‌బాబు. 3.యస్.కె.ముంతాజ్‌బేగం. 4.రాషిరెడ్డి మధుమతి. 5.బోజ్జ పద్మజా. 6.పి.మధు శ్రీను.7.టి.చంద్రగోపాల్‌రెడ్డి. 8.పోకల ప్రసాద్.9. అషరఫ్ 10.స్మర్ణలత.11.టి.గోపి రెడ్డి.12.టి.రమణమ్మ.13.పి.విజయమ్మ. 14.కె.రామ స్వామిపిళ్ళై. 15.కె.రుక్మిణిపిళ్ళై.16.కె.ఉషారాణి.17.కల్లూరిప్రత్యుష. 18.యస్. అమ్ములాబాయ్.19. వై.వెంకట నర్సింహారెడ్డి.20.పాపర జహరీ. 21.కె.నళిని,. 22.బి.భారతమ్మ,.23.సిహెచ్ చందర్‌రెడ్డి.24.టి.గోపిరెడ్డి. 25.వి.కుమారి. 26.యం.సునీత రామచంద్రం,.27.టి.వెంకటలక్ష్మి. 28.వజ్రం.

# బస్సు ప్రమాదంపై సిఎం, డిసిఎం దిగ్భ్రాంతి

**విజయవాడ,డిసెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం తులసిపాకలు ఘాట్ రోడ్‌లో జరిగిన బస్సు ప్రమాదంపై సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎంవో కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. భద్రాచలం నుంచి అన్నవరానికి వెళుతున్న యాత్రికుల ప్రైవేటు బస్సు లోయలో పడిన ఘటనలో పలువురు మృతి చెందడంపై చంద్రబాబు విచారాన్ని వ్యక్తం చేశారు. బస్సు ప్రమాదం, క్షతగాత్రులకు అందుతున్న సాయంపై అధికారులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. బస్సులో మొత్తం 37 మంది ప్రయాణికులు ఉన్నారని, పలువురు మృతి చెందగా, గాయపడిన వారిని చింతూరు ఆసుపత్రికి తరలించామని అధికారులు తెలిపారు.ఉన్నతాధికారులు తక్షణం ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టాలని సిఎం ఆదేశించారు. అన్నిశాఖలు సమన్వయంతో పనిచేసి బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని సిఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. బస్సు లోయలో పడిన దుర్ఘటనలో తొమ్మిది మంది దుర్మరణం పాలయ్యారని తెలిసి చింతిస్తున్నానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.ఈ ఘటనపై ఎక్స్‌వేదికగా ఆయన స్పందిస్తూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియ చేస్తున్నాను. ఈ దుర్ఘటనలో 22 మంది గాయపడ్డారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం తగిన విధంగా ఆదుకుంటుందని పవన్ తెలిపారు.

## జనగణనకు రూ.11,718 కోట్లు

>> కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. అదేవిధంగా మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును 'పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజన'గా మారుస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. పనిదినాల సంఖ్యను 100 నుంచి 120 రోజులకు, ఒక రోజుకు ఇచ్చే కనీస వేతనాన్ని రూ.240లకు పెంచింది. అలాగే భారత్-ఒమన్ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది.

**కొబ్బరికి మద్దతు ధర పెంపు**

కొబ్బరి కనీస మద్దతు ధర పెంపును ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదించింది. ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ మిల్లింగ్ కొబ్బరికి క్వింటాల్‌కు రూ.12,027గా నిర్ణయించింది. బాల్ కొబ్బరిని క్వింటాల్‌కు రూ.12,500గా మద్దతు ధర నిర్ణయించారు. ఇది గత సీజన్‌తో పోలిస్తే మిల్లింగ్ కొబ్బరికి క్వింటాల్‌కు రూ.445,బాల్ కొబ్బరికి క్వింటాల్‌కు రూ.400 పెంచారు. కేంద్ర ప్రభుత్వం తాజా నిర్ణయంతో కొబ్బరి రైతులకు లాభదాయకమైన రాబడి పెరగడంతోపాటు, కొబ్బరి ఆధారిత ఉత్పత్తులకు పెరుగుతున్న దేశీయ, అంతర్జాతీయ డిమాండ్ నేపథ్యంలో సాగును విస్తరించడానికి, ఇది దోహదపడుతుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరించారు.

## రాష్ట్రం టాప్


>> కేంద్ర ప్రభుత్వం మొదటి పది రాష్ట్రాలను ఎంపిక చేసింది. వాటిలో ఏపీ మొదటి స్థానంలో నిలిచినట్లు రాష్ట్ర పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు గురువారం వెల్లడించారు. భూగర్భ జలాల పెంపుదల కోసం గ్రామాల్లో పలు కార్యక్రమాలు చేపట్టినట్లు వారు వివరించారు. బీహార్,గుజరాత్‌లు వరుసగా రెండు,మూడు స్థానాల్లో నిలిచినట్లు చెప్పారు. కాగా,గ్రామ,స్వరాజ్‌అభియాన్ కార్యక్రమం అమల్లోనూ జాతీయస్థాయిలో ఏపీ మొదటి స్థానంలో నిలిచినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

## రాష్ట్రంలో పెరుగున్న చలి తీవ్రత

**విజయవాడ,డిసెంబరు 12,పభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రజలను చలి గజగజలాడిస్తోంది. ఏజెన్సీతోపాటు మైదాన ప్రాంతాల్లోనూ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. బుధవారం రాత్రి రాష్ట్రంలోనే అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో కనిష్ట ఉష్ణోగ్రత 3.2 డిగ్రీలుగా నమోదైంది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఇదే అత్యల్పం.మరో వైపు అల్లూరి సీతారామరాజు జిల్లా దుంబ్రిగుడలో 3.6,అరకులోయ-3.9, ముంచంగిపుట్టు-4.4,హుకుంపేట-5.4,చింతపల్లి-6.5,పాడేలు-6.7,పెదబయలులో 7.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి 'డాక్టర్ ఆళ్ళ అప్పలస్వామి' తెలిపారు. ఉష్ణోగ్రతలు క్షీణిస్తుండటంతో పంట పొలాల వద్ద మంచుగడ్డలు పరుచుకొని తెల్లటి పొరలు ఏర్పడుతున్నాయి. ఒడిశా,తెలంగాణ,కర్ణాటక తదితర రాష్ట్రాల్లో చలిగాలులు వీచే అవకాశముందని భారత వాతావరణ విభాగం పేర్కొంది. వీటి ప్రభావంతో రాబోయే రోజుల్లో రాష్ట్రంలో చలి తీవ్రత పెరగనుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.ఇక చలి తీవ్రత కోస్తాంధ్రలోను అధికంగా ఎన్టీఆర్ జిల్లాలో 9 నుంచి 11 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతున్నట్లు సమాచారం.

# వెలిగొండ వచ్చే యేడాది పూర్తి

>> ప్రస్తుతం 4 గ్యాంట్రీలతో రోజుకు 12 మీటర్ల లైనింగ్ పనులు చేస్తుండగా, గ్యాంట్రీల సంఖ్యను పెంచి లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయాలని ఏజెన్సీని ఆదేశించామని ఆయన అన్నారు. ఫీడర్ కెనాల్‌లో 45వేల క్యూబిక్ మీటర్ల హార్డ్ రాక్ పనులు చేయాల్సి ఉండగా ఇప్పటికే 28వేల క్యూబిక్ మీటర్లు పనులు పూర్తి చేసినట్లు వివరించారు. ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం రూ.456 కోట్లతో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ డిసెంబర్‌లోనే పనులు మొదలుపెట్టి, సీజన్ వచ్చేలోపు పూర్తి చేయాలని ఏజెన్సీని ఆదేశించామన్నారు. తీగలేరు కెనాల్ కు సంబందించి 600మీటర్ల టన్నెల్ లైనింగ్ చేసి, గేట్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నల్లమల సాగర్ ముంపుతో 9.6 కి.మీ పర్మినెంట్ డైవర్షన్ రోడ్డు నిర్మాణ పనులు మొదలు పెట్టామన్నారు. మొంథా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న ఫీడర్ కెనాల్ గండ్లు పూడ్చి, జంట సొరంగాల్లో డీవాటరింగ్ పనులను పూర్తి చేసి, లైనింగ్ పనులు కొత్త లక్ష్యాలు నిర్దేశించి వేగంగా చూస్తున్నామన్నారు. కూటమి హయాంలో పనుల పురోగతి ఇలా ఉండగా వెలిగొండ ప్రాజెక్టు కు ఉత్తుత్తి ప్రారంభం చేసి, జాతికి అంకితం చేసిన జగన్ చరిత్రహీనుడుగా మిగిలిపోయాడన్నారు .ఆర్ధిక పరిస్థితి సహకరించకపోయినా, జగన్ విధ్వంసం చేసిన ఇరిగేషన్ రంగాన్ని చంద్రబాబు గాడిలో పెట్టారని ఆయన సోదాహరణంగా చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టును ప్రాధాన్యత ప్రాజెక్టుగా గుర్తించి, పూర్తి చేయాలని సిఎం చంద్రబాబు అనుక్షణం మమ్మల్ని ప్రోత్సహిస్తూ పరుగులు పెట్టిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ముందు నిర్ణయించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని మంత్రి రామానాయుడు చెప్పారు. 2026 నాటికి వెలిగొండ పూర్తి చేసి నల్లమల సాగర్‌ను కృష్ణాజలాలతో నింపుతామని ఆయన స్పష్టం చేశారు.



అండమాన్‌లో శుక్రవారం వినాయక్ దామోదర్ సావర్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన కేంద్రహోంమంత్రి అమిత్‌షా, మోహన్ భగవత్ తదితరులు

# గ్లోబల్ ఎకనమిక్ హబ్‌గా విశాఖ రీజియన్

## 7 గ్రోత్ డ్రైవర్స్, 10పాలసీలతో విఇఆర్ అభివృద్ధి ప్రణాళికలు

## 2032కల్లా 135 బిలియన్ డాలర్ల ఎకానమీ, 30 లక్షల ఉద్యోగాలు లక్ష్యం

## విఇఆర్ అభివృద్ధి సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**విశాఖపట్నం, డిసెంబరు 12 ప్రభాతవార్త:** సమగ్ర ప్రణాళికతో విశాఖ ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్) ను గ్లోబల్ ఎకనమిక్ హబ్ చేయడమే లక్ష్యంగా కార్యాచరణ అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు అధికారులకు ఆదేశించారు. పరిశ్రమలు, ఐటీ, టూరిజం, అర్బన్ డెవలప్‌మెంట్, గ్రీన్ ఎనర్జీ, మౌలిక వసతులు.. ఇలా అన్ని విధాలా విశాఖ రీజియన్ అభివృద్ధి కావాలని నిర్దేశించారు. విశాఖను మురికి వాడలు లేని నగరంగా తీర్చిదిద్దాలని, వీఈఆర్ అభివృద్ధికి అవసరమైన భూ సేకరణను వివాదాలు లేకుండా జరపాలని అధికారులకు సీఎం సూచించారు. విశాఖ, అమరావతి, తిరుపతి ఇలా 3ఎకనమిక్ రీజియన్లుగా మొత్తం రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. విశాఖ ఎకనమిక్ రీజియన్ అభివృద్ధిపై తొలిసారి విశాఖలో శుక్రవారం మంత్రులు, ఉన్నతాధికారులు, జిల్లాల కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులతో సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో విశాఖ ఎకనమిక్ రీజియన్ సమగ్ర అభివృద్ధి, రోడ్లు, రైలు మార్గాలు, పోర్టులు, లాజిస్టిక్స్ ఇతర రంగాలకు సంబంధించి 49 ప్రాజెక్టులపై అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. 2024లో 52 బిలియన్ డాలర్ల జీడీపీతో ఉన్న వీఈఆర్‌ను 2032 నాటికి 125 నుంచి 135 బిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. 7 గ్రోత్ డ్రైవర్స్, 10 పాలసీలతో వీఈఆర్ అభివృద్ధి చేద్దామని, దీంతో 30 లక్షల ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. వీఈఆర్ మాస్టర్ ప్లాన్ సమర్థంగా అమలు చేస్తే 2047 నాటికి 750 నుంచి 800 బిలియన్ డాలర్ల ఎకానమీకి చేరుకోవచ్చన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం రానున్న 3నెలల్లో ఏం చేయాలనే దానిపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. విశాఖలో అంతర్జాతీయ ప్రమాణాలతో కన్వెన్షన్ సెంటర్ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.'విఇఆర్ కోసం వాణిజ్య పరిశ్రమలు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పర్యాటకం, ఐ అండ్ ఐ, ఆర్ అండ్ బీ, ఐటీఈ అండ్ సీ, వ్యవసాయం, అటవీ, వైద్యారోగ్యం, విద్య, నైపుణ్య శిక్షణ, విద్యుత్ ఇలా శాఖల వారీగా విడివిడిగా యాక్షన్ ప్లాన్ రూపొందించారు. అవసరానికి మించి డేటా సెంటర్ల ఏర్పాటును ప్రోత్సహించకుండా ఐటీ, ఏఐ సంస్థలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి" అని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. విభిన్న పంటల సాగుకు విశాఖ రీజియన్ ఎంతో అనుకూలంగా ఉంటుందనీ ఆయిల్ పామ్‌ను ప్రోత్సహిస్తూనే అంతర పంటలుగా కోకో, అరటి, మిరియాలు వంటి పంటలను పండించేలా చూడాలనీ సీఎం అన్నారు.

**ప్రత్యేక పర్యాటక కేంద్రంగా విశాఖ**

కైలాసగిరి నుంచి భీమిలి వరకు 40 చదరపు కిలోమీటర్ల తీర ప్రాంతాన్ని రాష్ట్ర పర్యాటకానికి కోర్ సిటీగా అభివృద్ధి చేయాలని మాస్టర్ ప్లాన్‌లో రూపొందించారు. ప్రధానంగా 5 బీచ్ ఫ్రంట్‌లు, వరల్డ్ క్లాస్ థీమ్ పార్క్,వాటర్ స్పోర్ట్స్ హబ్‌లతో అంతర్జాతీయ టూరిజం కేంద్రంగా విశాఖను తీర్చిదిద్దనున్నారు. కైలాసగిరి మాస్టర్ ప్లాన్ కింద మెగా రీ డిజైన్‌కు శ్రీకారం చుట్టనున్నారు. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేష్, కె. అచ్చెన్నాయుడు, నారాయణ, టీజీ భరత్, కందుల దుర్గేష్, కొండపల్లి శ్రీనివాస్, డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, కొల్లు రవీంద్రతో పాటు సీఎస్ విజయానంద్, ఉన్నతాధికారులు, 9 జిల్లాల కలెక్టర్లు హాజరయ్యారు.

# ఐటి కేంద్రంగా విశాఖ

>> ప్రధానంగా ఏఐ, మెషీన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజినీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలపై కాగ్నిజెంట్ దృష్టి సారించింది. కాగ్నిజెంట్ క్యాంపస్ శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "ఇన్ హౌస్ కంపెనీగా ఉన్న కాగ్నిజెంట్ ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా పనిచేస్తోంది. చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, కలకత్తా, పుణెలో కాగ్నిజెంట్ సంస్థ కార్యకలాపాలు ఉన్నాయి. ఇప్పుడు విశాఖకూ కాగ్నిజెంట్ అడుగుపెట్టింది. హ్యాపెనింగ్ సిటీ విశాఖకు రావాలని కాగ్నిజెంట్‌ను ఆహ్వానించాం. త్వరలో 25 వేల మందితో పనిచేసే కేంద్రంగా కాగ్నిజెంట్ త్వరలోనే తయారు కావాలి. 34 బిలియన్ డాలర్ల పెట్టుబడితో కాగ్నిజెంట్ కార్యకలాపాలను ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తోంది. కాగ్నిజెంట్‌లో 85శాతం మంది భారతీయులే. ఆ సంస్థ సీఈఓ కూడా భారతీయుడే కావటం విశేషం. భవిష్యత్తులో విశాఖ క్యాంపస్‌లో లక్ష మంది ఉద్యోగులతో పని చేయాలి. ప్రపంచవ్యాప్తంగా ఫాస్టెస్ట్ గ్రోయింగ్ కంపెనీగా కాగ్నిజెంట్ ఎదుగుతోంది. గతంలో హైదరాబాద్‌లో నాటి టీడీపీ ప్రభుత్వం రూపొందించిన ఎకో సిస్టంతో ఐటీ నిపుణులు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించారు. 3 దశాబ్దాల క్రితం చేసిన విజన్ తోనే దిగ్గజ ఐటీ కంపెనీలకు భారతీయులు నాయకత్వం ఇస్తున్నారు. 1995లో వచ్చిన ఇంటర్నెట్ రివల్యూషన్‌తో పాటు ఐటీ ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్ తీసుకున్నాం. అందుకే ఐటీకి బ్యాక్ బోన్‌గా భారతీయులు నిలిచే పరిస్థితి వచ్చింది. ఇప్పుడు ఏఐ విషయంలో కూడా ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్ తీసుకోవాలని భావిస్తున్నాం. ఆ దిశగానే ఏఐ, డేటా సెంటర్లతో విశాఖ ఐటీ డెస్టినేషన్‌గా నాలెడ్జి ఎకానమీ కేంద్రంగా తయారవుతోంది." అని సిఎం వెల్లడించారు.

**బెస్ట్ కనెక్టివిటీ... మోస్ట్ లివబుల్:** "విశాఖ నగరానికి బెస్ట్ కనెక్టివిటీ ఉండడంతోపాటు... మోస్ట్ లివబుల్ సిటీగా ఉంది. భోగాపురం విమానాశ్రయం, మెట్రో లాంటి అంతర్జాతీయ స్థాయి సదుపాయాలు వస్తాయి. ప్రపంచంలోనే మోస్ట్ హ్యాపెనింగ్ సిటీగా విశాఖ రూపుదిద్దుకుంటుంది. నౌకాదళ కేంద్రం నుంచి టూరిజం కేంద్రంగా, ఇప్పుడు టెక్ సిటీగా విశాఖ ఎదిగింది. కాగ్నిజెంట్‌తోపాటు 8 సంస్థలకు ఇవాళ భూమి పూజ చేశాం. గూగుల్ కూడా త్వరలోనే డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయబోతోంది. ఇప్పటికే విశాఖలో 150 టెక్ కంపెనీలు పనిచేస్తున్నాయి. ఎకరా భూమి 99 పైసలకే ఐటీ కంపెనీలకు ఇవ్వటం ఓ గేమ్ ఛేంజర్. గుజరాత్‌లో టాటా నానో కారు తయారీ కేంద్రానికి కూడా 99 పైసలకే ఎకరా చొప్పున భూమి ఇచ్చారు. ఇటీవలే భాగస్వామ్య సదస్సులో 613 ఎంఓయూల ద్వారా రూ. 13.50 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అలాగే ఎస్ఐపీబీల ద్వారా మరో రూ .8.50 లక్షల కోట్ల పెట్టుబడులను ఆమోదించాం. దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్ కేంద్రం అమరావతిలో ఏర్పాటు కాబోతోంది.రాష్ట్రంలోని ఎలక్ట్రానిక్స్, మెడ్ టెక్ జోన్లు ప్రపంచస్థాయి ఉత్పత్తులు తయారు చేస్తున్నాయి.పరిశ్రమలకు ప్రోత్సాహకాలను ఇచ్చేందుకు ఎస్క్రో ఖాతాను పెడుతున్నాం. ఈ తరహాలో ఆలోచించే ప్రభుత్వాలు ఉండవు. ఆర్టీఐహెచ్ ద్వారా స్టార్టప్‌లకు నూతన ఆవిష్కరణలకు నాంది పలుకుతున్నాం. సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులను కూడా రూపొందిస్తున్నాం. 15 శాతం వృద్ధి రేటు సాధించేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తోంది." అని సిఎం చంద్రబాబు వివరించారు

**8 వేలు కాదు... 25 వేలు:** కాగ్నిజెంట్ కార్యాలయ శంకుస్థాపన కార్యక్రమంలో ఆ సంస్థ సిఇఓ రవికుమార్ కీలక ప్రకటన చేశారు. విశాఖ కాగ్నిజెంట్ సంస్థలో 25 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని వెల్లడించారు. 8 వేల మందికి మాత్రమే ఉద్యోగాలు కల్పిస్తామని ప్రభుత్వంతో కాగ్నిజెంట్ సంస్థ ఒప్పందం చేసుకుంది. అయితే శంకుస్థాపన కార్యక్రమానికి ముందుగా రవికుమార్‌తో సిఎం చంద్రబాబు కొద్దిసేపు సంభాషించారు. 8 వేల ఉద్యోగాలు కాదని, విశాఖ క్యాంపస్‌లో 25 వేల మందికి ఉద్యోగాలు కల్పించాలని కోరాగా సిఇఓ అంగీకరించారన్నారు.

**మరో 8 సంస్థలకు శంకుస్థాపనలు:** కాగ్నిజెంట్ సంస్థతో పాటు త్వరలోనే విశాఖ నుంచి మరికొన్ని సంస్థలు కూడా కార్యాకలాపాలు మొదలు పెట్టనున్నాయి. వీటిల్లో కొన్నింటికి శుక్రవారం నాడే శంకుస్థాపనలు జరిగాయి. టెక్ తమ్మిన, సత్వ డెవలపర్స్, ఇమాజిన్నోవేట్ టెక్ సొల్యూషన్స్ ఇండియా, ఫ్లూయెంట్ గ్రిడ్ లిమిటెడ్, మదర్సన్ టెక్నాలజీస్, క్వార్క్స్ టెక్నోసాఫ్ట్, ఏసీఎన్ హెల్త్ కేర్ ఆర్సీఎం సర్వీసెస్, నాన్రెల్ టెక్నాలజీస్ వంటి సంస్థలకు శంకుస్థాపనలు జరిగాయి.

# ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దుర్మార్గం

## వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం, డిసెంబర్ 12 ప్రభాత వార్త బ్యూరో** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వమే ఓ దళారిగా మారి వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడం దుర్మార్గమని సీనియర్ నేత, వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి మండి పడ్డారు.ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శింగనమల నియోజకవర్గంలో సేకరించిన సంతకాల ప్రతులను వైసీపీ సమన్వయకర్త సాకే శైలజానాథ్ ఆధ్వర్యంలో శుక్రవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో అనంత వెంకటరామిరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ యజ్ఞంలా కొనసాగిందన్నారు. అన్ని వర్గాల ప్రజలతో పాటు గత ఎన్నికల్లో కూటమి పార్టీలకు ఓటు వేసిన వాళ్లు కూడా సంతకాల సేకరణలో పాల్గొన్నారని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణాలకు శ్రీకారం చుట్టి గతంలోనే 5 మెడికల్ కళాశాలల్లో తరగతులు ప్రారంభించామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తన వర్గీయులకు మేలు చేకూర్చడం కోసం కళాశాలలను ప్రైవేట్‌పరం చేస్తున్నారని మండిపడ్డారు.

# చిన్నారిపై కుక్కల దాడి

>> పట్టణ ప్రజల్ని ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తున్నాయి రోడ్ల పైన ఆవులు పురవీధుల్లోకి వెళితే కుక్కల బెడదతో పట్టణ ప్రజలు బెంబేలు ఎత్తిపోతున్నారు వీధి కుక్కలను పట్టుకోవాలని వరుసగా ప్రజల పై పిచ్చికుక్కలు దాడి చేస్తున్న విషయాన్ని ఇదివరకే పురపాలక సంఘం అధికారులకు ఎన్నిసార్లు ప్రజలు చెప్పినా చలనం లేకుండా పోతుందని స్థానిక ప్రజలు వాపోతున్నారు ప్రజల ప్రాణాలతో చెలగాటమా అంటూ పలువురు ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు పట్టణంలో వరుసగా వీధి కుక్కలు, పిచ్చికుక్కలు దాడి చేసిన సంఘటనలో ఎంతోమంది చిన్నారులు ప్రజలు ఇప్పటికీ కోలుకోలేక పోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం స్పందించి కుక్కల బారినుంచి భయాందోళన గురవుతున్న ప్రజలకు విముక్తి కల్పిస్తారా లేక చిన్నారిపై జరిగిన కుక్క దాడిని దృష్టిలో ఉంచుకొని ప్రాణాలు పోయినా మాకు ఎలాంటి సంబంధం లేదని చేతులు దులుపుకుంటారా అనే వేచి చూడాల్సి ఉంది పట్టణంలో ఇస్లాం పేటలో చిన్నారిపై జరిగిన కుక్క దాడిని దృష్టిలో ఉంచుకొని ప్రజలు అధికారుల తీరుపై అగ్రహంతో రగిలిపోతున్నారు.

# 5 కోట్ల రుణం

>> ఇలాంటి పురపాలక సంఘాల కోసం 25 ఏళ్ళ క్రితం నాటి కేంద్ర ప్రభుత్వం సమగ్ర చిన్న, మధ్య తరహా పట్టణాల అభివృది (ఐడీఎస్ఎంటీ) పేరుతో ప్రత్యేక కార్యక్రమం అమలు చేసింది. ఇదే తరహాలో తాజాగా సీఈఎస్‌ను ప్రవేశపెట్టారు. హడ్కో గ్యారెంటీతో వివిధ జాతీయ బ్యాంకుల నుంచి మున్సిపాలిటీలకు రుణాలు అందించనున్నారు. ఈ ప్రతిపాదనలకు నెలాఖరులోగా కేంద్రం ఆమోదం లభిస్తుందని అధికారులు ఆశిస్తున్నారు.

# పరాకామణి చోరీపై ముమ్మర దర్యాప్తు

>> ఉన్నతాధికారుల బృందం వచ్చినా వేర్వేరుగా వారివారి స్థాయిల్లో ఈ కేసు విచారణ చేపట్టనున్నారు. ఇందుకు అవసరమైన కార్యాచరణ ఇప్పటికే తిరుపతిలో సిద్దంచేసుకుంటున్నారు. 2023 ఏప్రిల్ 29న చోరీ జరిగి తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైతే ఆ తరువాత ఎన్నో కీలకమలుపులు, పలు పరిణామాలతో చివరకు జులైలో లోక్‌అదాలత్‌ద్వారా కేసు రాజీచేసుకోవడం వరకు జరిగిన పరిణామాలన్నీ సిఐడి వివరాలు సేకరించింది. ఈ వివరాలతో 920 అమెరికన్ డాలర్లు విలువ సుమారు లక్షల రూపాయలుగా చోరీ చేస్తే 14కోట్ల రూపాయలు ఆస్తులను టిటిడి బోర్డు పెద్దలు టిటిడికి గిఫ్ట్‌డీడ్‌లుగా స్వీకరించడం పెద్ద తతంగమనేది సిఐడి కీలక నివేదిక. దీంతో హైకోర్టు ధర్మాసనం మళ్ళీ రవికుమార్ ఆస్తులపై సమగ్రంగా విచారణ చేయాలని ఆదేశాలతో రెండవదఫా సిఐడి,ఏసిబి సిద్దమయ్యారు. భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా హుండీకి సమర్పించే కానుకల లెక్కింపు పరకామణిలో విదేశీ కరెన్సీ చోరీచేసిన ఘటన మాత్రం సంచలనంగా మారింది. గత తొమ్మిదినెలలుగా ఈ కేసు హైకోర్టు ఆదేశాలతో విచారణ సాగుతోంది. నిందితుడు రవికుమార్ ఆస్తులపై దర్యాప్తుకు హైకోర్టు ధర్మాసనం ఆదేశించడంతో ఇప్పుడు విదేశీ కరెన్సీ చోరీలో పాత్రదారుడ్ని తప్పించిన ఘటనలో .రాజీచేసిన కీలకం లో సూత్రధారులెవరనేది తేల్చేపనిలో ఆస్తుల వివరాలు తేల్చాలని న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలు. మొత్తం మీద నిందితుడి ఆస్తుల చిట్టా గుట్టు విప్పితే ఎవరెవరి పేర్లు బయటకు వస్తాయి,ఎందరు ఏమేరకు లబ్ధిపొందారనేది తేలనుందనే భయం అటు టిటిడి వర్గాల్లో ఇటు పోలీస్‌వర్గాల్లో పీడిస్తోంది. అప్పట్లో జరిగిన ఈ కేసు విచారణ, పూర్తిస్థాయి దర్యాప్తు చట్టపరంగానే సాగించారా!లేక ఏదేని అక్రమాలు చోటుచేసుకున్నాయా అనేది ఇప్పుడు ఆసక్తికర పరిణామంగా మారింది. అంతేగాక 2023 ఏప్రిల్ 29న పరకామణి భవనంలో నిఘాలో ఉన్న పూర్వ ,దివంగత ఏవిఎస్ఓ వై.సతీశ్‌కుమార్ కీలకం. అయితే ఆయన గత నెలలో తిరుపతికి విచారణకు హాజరయ్యే సందర్భంలో తాడిపత్రి సమీ పంలో రైల్వేపట్టాలపై అనుమానాస్పదంగా మృతి చెందడంసంచలనమే. దీనిపై కూడా ఆయన పోస్టుమార్టమ్ రిపోర్టు సీల్డుకవర్‌లో హైకోర్టుకు సిఐడి సమర్పించనుంది. వేలరూపాయలు జీతం తీసుకునే నిందితుడు వందలకోట్ల రూపాయలు ఆస్తులు ఎలా ఆర్జించాడు,కూడబెట్టాడనేది సిఐడి,ఏసిబి విచారణలో భాగంగా ఐటి,ఇడికి సమాచారం ఇవ్వనున్నారు. గతంలో వైసిపి ప్రభుత్వంలోని పెద్దలు, గత టిటిడి బోర్డులో పెద్దలు, ఓఉన్నతాధికారి, ఓ పోలీస్ అధికారి కీలకంగా వ్యవహరించారనేది గుప్పు మన్న ఆరోపణలు. మరీ ఇప్పుడు ఏం తేలనుందనేది మాత్రం త్వరలోనే గుట్టువీడనుంది.

## వారం - వర్జ్యం

13-12-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం
నవమి సా.4.41
హస్త పూర్తి, జ్యేష్ఠ కార్తె
వర్జ్యం : మ.3.06-4.52
దు.ఉ.6.28-8.01
శుభసమయం : ఉ.6.30-7.30
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** ఎంతో కాలముగా వాయిదా పడుతున్న విషయములు పరిష్కారమవుతాయి. వస్తు కొనుగోలు.

**వృషభం :** విద్యా వాణిజ్య రంగములలో, ఆర్థిక విషయాలలో ప్రోత్సాహకర వాతావరణము సమకూరుతుంది.

**మిథునం:**విరాళములు, చందాలు, ఋణాలు, పన్నులు వీటి విషయాలలో ఒత్తిడి రావచ్చు. ప్రయాణాలు లాభిస్తాయి.

**కర్కాటకం:** అతిథి మర్యాదలకు అధిక ఖర్చులు చేస్తారు. సన్నిహితుల నుండి రహస్యసమాచారము అందుకుంటారు.

**సింహం:** మీ కార్యక్రమములకు, సంతానము యొక్క అభివృద్ధికి ఆటంకములను కల్పించే యత్నములు జరుగును.

**కన్య :** ముఖ్యముగా మీ ప్రతిష్టను దెబ్బతీసే యత్నములు అధికము కావచ్చును. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**తుల :** ఆత్మీయులు, శ్రేయోభిలాషులతో కలిసి ఆనందంగా గడుపుతారు. ఇంటా బయటా అనుకూలము.

**వృశ్చికం:**ప్రయోజనములు తాత్కాలికముగా మీ చేతికి అందకపోయినా ఉనికికి మాత్రము ముప్పులేదు.

**ధనుస్సు:** ఋణ సంబంధమైన చికాకులు తీరతాయి. కోర్టు వ్యవహారములు మీకే అనుకూలము. కాంట్రాక్టులు లభిస్తాయి.

**మకరం:**బంధువులకు సంబంధించిన కొన్ని వ్యవహారములను పర్యవేక్షించవలసి వస్తుంది. ఇంటా బయటా అనుకూలం.

**కుంభం:** గృహములోని ఖర్చులను తగ్గించుటకు చేసే యత్నములు అను కూలించవు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి.

**మీనం :** మీతో విభేదించిన సోదర వర్గీయుల నుండి, సన్నిహితుల నుండి వినూత్న రీతిలో రాజీ యత్నములు వస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

13-12Pg3exHMNWJQEVK 3 ONG_13-12Pg3exHMNWJQEVK.qxd 13/Dec/25 12:02 AM Page 1



## ఎపిలో 6.91 లక్షల ఎంఎస్ఎంఇ యూనిట్లకు రూ.21,702 కోట్ల క్రెడిట్ గ్యారెంటీ

**విజయవాడ,డిసెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో గత ఆరేళ్లలో 6.91 లక్షల ఎంఎస్ఎంఈ యూనిట్లకు రూ.21,702 కోట్ల క్రెడిట్ గ్యారెంటీ ఇచ్చినట్లు కేంద్ర ఎంఎస్ఎంఈ సహాయమంత్రి శోభాకరంద్లాజే తెలిపారు. లోక్‌సభలో తెలుగుదేశం పార్టీ ఎంపీ బస్తిపాటి నాగరాజు, బీకే పార్థసారథి అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో రోజువారీగా తలసరి 55 లీటర్ల నీరు అందని నివాస ప్రాంతాలు 19,115 ఉన్నట్లు జలశక్తిశాఖ సహాయమంత్రి వి. సోమన్న తెలిపారు. లోక్‌సభలో వైఎస్సార్సీపీ సభ్యులు మిథున్‌రెడ్డి, అవినాష్‌రెడ్డిలు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.ఆంధ్రప్రదేశ్‌లో స్మార్ట్‌సిటీ పథకం కింద ఎంపికయిన 4 నగరాల్లో రూ.5,739 కోట్ల విలువైన 249 ప్రాజెక్టులు పూర్తయినట్లు కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ సహాయమంత్రి టోకన్‌సాహు తెలిపారు. ఇంకా రూ.850 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని చెప్పారు.



ఏపీ ఛాంబర్స్ బిజినెస్ ఎక్స్ పో 2025 ప్రారంభసభలో మాట్లాడుతున్న రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి..

# రాష్ట్రంలో పెట్టుబడులకు సువర్ణావకాశం

### రాష్ట్ర సమాచార మంత్రి కొలుసు పార్థసారథి

**విజయవాడ,డిసెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలోనే పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రం అనుకూలంగా ఉందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు.ఈ అవకాశాన్ని పెట్టుబడిదారులు అందిపుచ్చుకుని పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలన్నారు.ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్ లో మూడు రోజుపాటు నిర్వహించే ఏపీ ఛాంబర్స్ బిజినెస్ ఎక్స్ పో 2025 ను శుక్రవారం రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని అందుకు ప్రభుత్వం పెట్టుబడులు పెట్టేవారి కోసం సింగిల్ విండో ద్వారా 21 రోజుల లోపుగానే అనుమతులు ఇస్తుందన్నారు. గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఆయన ప్రతినిధిగా బిజినెస్ ఎక్స్ పో 2025 కు హాజరుకావడం జరిగిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పారదర్శక విధానాలు, పెట్టుబడులకు అనుకూల వ్యవస్థ, విజనరీ లీడర్ షిప్ కారణంగా రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి ప్రభుత్వం ఇప్పుడు స్పీడ్ ఆఫ్ బిజినెస్ నినాదంతో ముందుకు సాగుతోందన్నారు. పరిశ్రమలు స్థాపనకు పెట్టుబడిదారులు ఆలోచన చేయగానే వారి అవసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా వారికి మార్గనిర్దేశానికి సింగిల్ విండో విధానంతో ప్రభుత్వం చురుగ్గా అనుమతులు ఇస్తుందన్నారు. పెట్టుబడిదారుల విశ్వాసాన్ని, నమ్మకాన్ని చూరగొనటం ద్వారా యువతకు లక్షలాది ఉద్యోగావకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు. క్వాంటం సాంకేతికతలో రాష్ట్రం విప్లవాత్మకమైన ముందగుడు వేసిందని, ముఖ్యంగా దేశంలోనే మొట్టమొదటగా క్వాంటం కంప్యూటర్‌ను స్థాపించబోయే రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కావడం గర్వంగా ఉందన్నారు.

# తిరుపతి సమాచారం

## త్వరలో 60 టిటిడి ఆలయాల్లో భక్తులకు అన్నప్రసాదాలు

**తిరుమల,డిసెంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో వెంగమాంబ అన్నప్రసాదం భవనంలో భక్తులకు అన్నప్రసాదాలు అందిస్తున్న తరహాలో టిటిడి ఆధ్వర్యంలోని 60 ఆలయాల్లో భక్తులకు నాణ్యతతో రుచిగా అన్నప్రసాత వితరణకు టిటిడి కార్యాచరణ సిద్ధంచేసింది. అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడుతోంది. తిరుమలలో రోజుకు రెండు



లక్షలమంది వరకు భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీచేస్తోంది. ఇప్పుడు సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పర్యవేక్షణలో60ఆలయాలలో భక్తులకు అన్నప్రసాదం వితరణ చేయనుంది. ఇందుకు ధార్మిక సంస్థలు,మఠాలు ముందుకు వచ్చే వారితో అవగాహన చేసేందుకు టిటిడి చర్యలు చేపట్టింది.

### స్వామి ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలి : ప్రముఖులు



**తిరుమల,డిసెంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలకు మంచిరోజులు కలగాలని, సుఖసంతోషాలతోఉండాలని దేవుని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. శుక్రవారం ఉదయం సినీనిర్మాత అశ్వనీదత్, మాజీ సిఎండి కెవిరావు, దర్శకుడు కెవి విజయేంద్రప్రసాద్, తమిళనటి పావనిరెడ్డి, బిగ్‌బాస్ తమిళ్‌సీజన్ 5 ప్రియాంకదేశ్‌పాండే వేర్వేరుగా ఉదయం విఐపి బ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## అనామకులు కొండ దిగాల్సిందే!

### - యాచకులు ,అనధికారవ్యక్తులను తరలించినపోలీసులు

**తిరుమల,డిసెంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పుణ్యక్షేత్ర పవిత్రతకు భంగం వాటిల్లేలా, ప్రశాంతతకు అవాంతరాలు కలిగించేలా వ్యవహరిస్తున్న యాచకులు, అనామకులను కొండపైనుండి తరలించేందుకు తిరుమల పోలీసులు, విజిలెన్స్ సంయుక్తంగా చర్యలుచేపట్టింది. తిరుమలను పూర్తిస్థాయిలో భక్తివాతావరణం ఉట్టిపడేలా, ప్రశాంతతనెలకొల్పేలా పోలీసులు, టిటిడి విజిలెన్స్ చర్యలు చేపట్టేలా తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు కార్యాచరణ



రూపొందించారు.దీనిపై తిరుమల అదనపు ఎస్పీ ఐ.రామకృష్ణ, డిఎస్పీ కె.విజయశేఖర్, విఎస్ఒ ఎస్టీవిరామ్‌కుమార్, సురేంద్ర నేతృత్వంలో పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది సంయుక్తంగా శుక్రవారం కొండపై నందకం, సిఆర్ఒ, వరాహస్వామి విశ్రాంతి భవనాలు, కల్యాణకట్ట, ఎస్టీషాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో దీర్ఘకాలంగా అక్రమంగా అనధికారికంగా తిష్టవేసి పలుచోట్ల బసచేస్తున్న వారిని కనిపెట్టారు. మొత్తం 48మందిని తిరుమల నుండి తరలించారు.

## రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఏర్పాటు చట్టబద్ధతను తేల్చాలంటూ హైకోర్టులో పిటిషన్

**విజయవాడ,డిసెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఏర్పాటు చట్టబద్ధతను తేల్చాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. బోర్డు ఏర్పాటు ఛైర్మన్ ఎన్నికను ప్రశ్నిస్తూ కడప జిల్లాకు చెందిన న్యాయవాది షేక్ ఆరిఫ్ పిటిషన్ వేశారు. వక్ఫ్ యాక్ట్ ప్రకారం బోర్డులో ఎన్నికైన సభ్యుల సంఖ్య నామినేటెడ్ మెంబర్స్ కంటే ఎక్కువ ఉండాలన్నారు. కొత్త చట్టంలో ముగ్గురు సభ్యులే ఎన్నికవుతారని, ఎనిమిది మంది నామినేట్ అవుతారని, ఇది చట్ట వ్యతిరేకమని ప్రకటించాలని కోరారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉందన్నారు. ఎమ్మెల్యే కోటా కింద సభ్యులను ఎన్నుకోవాలనే నిబంధనకు బదులుగా ప్రభుత్వమే నామినేట్ చేసే విధానం చెల్లదని ప్రకటించాలని కోరారు. అడ్వకేట్ల నుంచి ఎన్నుకోవాల్సిన సభ్యుడి నియామకం జరగలేదన్నారు.

న్యాయపరమైన సమస్యలు తలెత్తేలా ప్రభుత్వ నూతన విధానం ఉందన్నారు. దీనిపై వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని, కోర్టు జోక్యం చేసుకోవాలని పిటిషనర్ హైకోర్టును కోరారు.

## రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌ల ఎదుట అంగన్వాడీల ధర్నా

**విజయవాడ,డిసెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** సుదీర్ఘకాలం నుంచి అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోరుతూ అన్ని కలెక్టరేట్ల వద్ద అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం ఈ ఆందోళన జరిగింది.ధర్నా సందర్భంగా వివిధ జిల్లాల్లో పోలీసులు ఎక్కడికక్కడ అంగన్వాడీలను అడ్డుకుంటున్నారు. బస్సుల్లో తనిఖీలు చేసి అంగన్వాడీలను దించేసారు.ఈ క్రమంలో ఆయా జిల్లా పోలీసుల కళ్ళు కప్పి కలెక్టరేట్ వద్ద ధర్నా జరిపారు.విజయవాడలో జరిగిన ధర్నా కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు రమాదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికీ 1200 కేంద్రాలు మినీ కేంద్రాలుగా ఉన్నాయని, అంటే అన్ని పనులూ అంగన్‌వాడీలే చేసుకోవాలని తెలిపారు. వారు ఎదుర్కొంటున్న జీతాల సమస్యను పరిష్కరించలేదని పేర్కొన్నారు. మరోవైపు దళితవాడల్లో బెల్టుషాపులు ఎక్కడికక్కడ పెద్దఎత్తున వ్యాపారం చేస్తున్నాయని వివరించారు. కుటుంబాలు ఛిద్రమవుతున్నాయని, వీటిల్లో ఎక్కువగా దళితుల కుటుంబాలే ఉన్నాయని తెలిపారు. ఎసైన్డ్ భూములు సాగు చేసుకుంటున్న వారికి చాలా చోట్ల వారికి పరిహారం ఇవ్వడం లేదని వివరించారు. అసైన్డ్ భూములనే పేరుతో తుఫాన్లలో దెబ్బతిన్న వారికి పరిహారం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. 25 వేల కోట్ల పొదుపు గ్రూపుల డబ్బులు బ్యాంకుల్లో ఉన్నాయని తెలిపారు. దళితవాడల్లో మహిళలు రుణాలు కట్టకపోతే అన్ని గ్రూపులకూ వసూలు బాధ్యత అప్పగిస్తున్నారని అన్నారు. ఆకివీడులో డ్వాక్రా మహిళ ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చిందని అన్నారు.

## సామాజిక మాధ్యమాల్లో అసభ్యరాతలపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,డిసెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. సోషల్ మీడియా వేదికగా తన వ్యక్తిత్వ, హక్కులను ఉల్లంఘించేలా వ్యవహరిస్తున్నారని అంటూ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆ పోస్టుల కారణంగా తన వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం వాటిల్లుతుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ తరఫున సీనియర్ న్యాయవాది సాయి దీపక్ పిటిషన్ దాఖలు చేశారు. వారం రోజుల్లో ఉల్లంఘనకు సంబంధించిన వివరాలను సమర్పించాలని కోర్టు ఆదేశించింది. ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని మెటా, గూగుల్, ఎక్స్‌కు ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ డిసెంబర్ 22కు వాయిదా వేసింది. సోషల్ మీడియాను కొంతమంది అడ్డాగా చేసుకుని సెలెబ్రిటీలపై దారుణమైన పోస్టులు పెడుతున్నారు.

అసభ్యకరమైన పోస్టులతో పెచ్చు మీరి విలయతాండవం చేస్తున్నారు. సెలెబ్రిటీల పర్సనల్ విషయాలపై కూడా పోస్టులు పెడుతున్నారు. వారి పరువుకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సెలెబ్రిటీలు కోర్టులను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలోనే పవన్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు.

## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి ఇ చలానాలు జారీ : కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

**విజయవాడ,డిసెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై 2024లో 44,24,135 ఈచలానాలు జారీ అయినట్లు కేంద్ర రహదారి, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. వీటి ద్వారా రూ.102.13 కోట్ల మొత్తం వసూలైందని, ఇంకా రూ.126.51 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని పార్లమెంటు శీతాకాల సమావేశాల సందర్భంగా సభలో మంత్రి స్పష్టం చేశారు.ఈ మేరకు నితిన్ గడ్కరీ " ఎక్స్" వేదిక సమాచారం తెలిపారు. దేశవ్యాప్తంగా 8.18 కోట్ల చలానాలు జారీ కాగా రూ.3,834 కోట్లు వసూలయ్యాయని, ఇంకా రూ.9,097 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. అత్యధికంగా ఉత్తర్‌ప్రదేశ్‌లో 1.53 కోట్ల చలానాలు జారీ చేయగా రూ.2,386 కోట్లు వసూలు కావాల్సి ఉందని పేర్కొన్నారు. దిల్లీలో 78.19 లక్షల చలానాలు జారీకాగా రూ.2,247 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు.లోక్‌సభలో వైఎస్సార్సీపీ ఎంపీ గుమ్మ తనూజారాణి అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ సమాచారం అందించినట్లు వివరించారు.ఏపీలోని అనంతపురం, విశాఖలలో మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్క్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చినట్లు గడ్కరీ తెలిపారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. దీని కోసం అనంతపురం ఏపీఐఐసీ ద్వారా 204.92 ఎకరాల భూమి అందుబాటులో ఉందని చెప్పారు.

పీఆర్‌కూడా పూర్తయిందని, ప్రస్తుతం మదింపు దశలో ఉందని వివరించారు. విశాఖపట్నంలోనూ తగిన భూమి అందుబాటులో ఉందని చెప్పారు. ఫీజబిలిటీ రిపోర్ట్/డీపీఆర్ కోసం కన్సల్టెంట్‌ను నియమించినట్లు వివరించారు.

## సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు సిఎం చంద్రబాబు పుట్టినరోజు శుభాకాంక్షలు

**విజయవాడ,డిసెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. తన ప్రియ మిత్రుడికి శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన సామాజిక మాధ్యమాల్లో ఒక ప్రత్యేక సందేశాన్ని పంచుకున్నారు. రజనీకాంత్ వ్యక్తిత్వాన్ని, ఆయన ప్రయాణాన్ని చంద్రబాబు కొనియాడారు. 'నా ప్రియ మిత్రుడు, లెజెండరీ సూపర్‌స్టార్



రజనీకాంత్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు! తెరపై, నిజ జీవితంలో హీరోలుగా ప్రకాశించే అతి కొద్ది మందిలో ఆయన ఒకరు. ఆయన వ్యక్తిగత ప్రయాణం కూడా అసాధారణమైన సినిమా ప్రయాణం అంతే స్ఫూర్తిదాయకం. ఆయనకు ఈ రోజు మరెన్నో సంతోషాలను ఇవ్వాలని కోరుకుంటున్నాను. నిండు నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షిస్తున్నాను!" అని చంద్రబాబు తన సందేశంలో పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు, రజనీకాంత్ మధ్య దశాబ్దాలుగా బలమైన స్నేహబంధం కొనసాగుతున్న విషయం తెలిసిందే. గతంలో అనేక బహిరంగ సభల్లో ఇరువురూ తమ స్నేహాన్ని, ఒకరిపై ఒకరికి ఉన్న గౌరవాన్ని చాటుకున్నారు. చంద్రబాబు లాంటి రాజకీయ నాయకుడు చాలా అరుదని రజనీకాంత్ పలు సందర్భాల్లో ప్రశంసించగా, రజనీకాంత్ వ్యక్తిత్వాన్ని చంద్రబాబు కూడా ఎన్నోసార్లు కొనియాడారు. ఈ నేపథ్యంలో రజనీ పుట్టినరోజున చంద్రబాబు చేసిన పోస్ట్ వారి స్నేహానికి నిదర్శనంగా నిలిచింది.

## విజయవాడలో ఇళ్లు కూల్చివేసిన జోజినగర్‌కు వచ్చే వారం వస్తా :మాజీ సిఎం జగన్



**విజయవాడ,డిసెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో ఇళ్లు కూల్చివేసిన జోజినగర్‌కు వచ్చే వారం వస్తానని, బాధితులకు అండగా ఉంటానని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇటీవల జోజినగర్లో 42 ప్లాట్లు కూల్చివేసిన సంగతి తెలిసింది. యజమానులందరూ గురువారం తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యాన జగన్‌ను కలిశారు. రెక్కల కష్టంతో 25 సంవత్సరాల క్రితమే తాము ఇళ్లు నిర్మించుకున్నామని, ప్లాట్ రిజిస్ట్రేషన్, ప్లాను, ఇంటిపన్ను, కరెంటు బిల్లులూ ఉన్నాయని తెలిపారు. డిసెంబర్ 31వ తేదీ వరకూ మా ప్లాట్ల జోలికి రావద్దని సుప్రీం కోర్టు కూడా చెప్పిందని, అయినా డిసెంబర్3న వేకువజామున వందల మంది పోలీసులు వచ్చి ఒక్కసారిగా కూల్చివేశారని తెలిపారు. ఇళ్లను కూల్చివేసి ఎంపిగానీ, ఎమ్మెల్యేగానీ పరామర్శకు రాలేదని పేర్కొన్నారు. మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదలంటే ప్రభుత్వానికి కడుపుమంటగా ఉందని, వారిపట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తోందని తెలిపారు. సామాన్లు బయటకు తెచ్చుకునే అవకాశం కూడా లేకుండా కూల్చివేశారని పేర్కొన్నారు. విజయవాడ ఉత్సవాలను పర్యవేక్షించడానికి తపనపడిన ఎంపి ఇళ్లు కోల్పోయిన వారిని పరామర్శించేందుకు సమయం కేటాయించడం లేదని విమర్శించారు. బాధితుల వినతిమేరకు వారిని మాజీ సిఎం జగన్ వద్దకు తీసుకువచ్చాని తెలిపారు. దీనిపై పలువురు బాధితులు కూడా మాట్లాడుతూ అనంతరం జగన్ మాట్లాడుతూ వారం రోజుల్లో జోజినగర్ ప్రాంతంలో ఇళ్లు కూల్చివేసిన ప్రాంతాన్ని సందర్శిస్తానని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ వదిలేది లేదని అన్నారు. ఇండిగో సమస్యకు కేంద్రమే కారణమని సరైన నియంత్రణ, పాలనా లేకుండా ఇండిగోకు పెద్దఎత్తున అనుమతులు ఇచ్చిన కేంద్రమే దీనికి బాధ్యత వహించాలని శ్రీనివాసరావు అన్నారు. ఎన్నికలకు ఫండ్ ఇచ్చారనే పేరుతో ఏమి చేసినా పట్టించుకోలేదని, దీనివల్ల సంక్షోభం ఏర్పడిందని అన్నారు.

## 'కల్తీనెయ్యి'లో గుట్టువీడేదెప్పుడో?

### - టిటిడి మార్కెటింగ్, కొనుగోళ్ల కమిటీలో తదుపరి విచారణ ఎవరిదో! -ముగిసిన ఇద్దరి కస్టడీ

**తిరుమల,డిసెంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూల తయారీకి 2020-2024 మధ్యకాలంలో కల్తీనెయ్యి సరఫరా జరిగిన కేసులో అసలు గుట్టువీడేదెన్నదనేది ఇప్పుడు టిటిడి వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. 2020 ఆగస్ట్‌లోనే తిరుమలకు కల్తీనెయ్యిసరఫరా అవుతోందని అప్పట్లోనే గుర్తించిన టిటిడి మార్కెటింగ్,కొనుగోళ్ళ విభాగం అధికారులు బోర్డుకు తెలిపినా అప్పటి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి పెద్దగా పట్టించుకోలేదనేది సిట్ కస్టడీలోని మాజీ జిఎం సుబ్రమణ్యం వాంగ్మూలం. ఇంకా పలు సంచలన విషయాలు సిట్ అధికారులకు సుబ్రమణ్యం తెలియజేయడంతో ఇప్పుడు టిటిడి వర్గాల్లో కలకలం రేపుతోంది. ఇప్పటికే కల్తీనెయ్యికేసులో భాగస్వాములైన గత అధికారులు 12మందిని గుర్తించిన సిట్ వారిని విచారణకు పిలిచేందుకు టిటిడి ఇఒకు లేఖరాయడం, దానిపై 16న ఆదేశాలు వెలువడనున్నట్లు తెలుస్తోంది. ఆ తరువాతే ఆ 12మందిని విచారణకు పిలిచే అవకాశం కనిపిస్తోంది. వీరిలో ముగ్గురు అధికారులు ఇప్పటికే పదవీవిరమణ చేశారు. ఉద్యోగులను విచారణకు ఇఒ అనుమతి అసవరం. నాగేంద్రప్రసాద్, శేఖర్, ఈశ్వర్‌రెడ్డి,వెంకట అనిల్‌కుమార్, వెంకట నగేశ్‌బాబు,జగదీశ్వర్‌రెడ్డి, సుబ్రమణ్యం, మురళీకృష్ణ, గోశాల మాజీ డైరెక్టర్ (సస్పెన్షన్ వేటుకుగురైన)డాక్టర్ హరినాథరెడ్డి కల్తీనెయ్యిలో కీలకమనేది సిట్ కథనం.గత నాలుగురోజుల కస్టడీలో సుబ్రమణ్యం, అజయ్‌కుమార్‌సుగంధి కొంతవరకు మాత్రమే సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. మరీ 12మందిలో కీలకమైన ఐదుగురు టిటిడి ఉద్యోగులను విచారణ చేస్తే నెలకొన్న చిక్కుముడివీడిపోతుందనేది వినిపిస్తున్న వ్యాఖ్యలు. ఇప్పటికే ఈ కేసులో సిట్ దర్యాప్తు మరింత వేగం పుంజుకుంటున్నప్పటికీ కీలకమైన వైవి గత పిఎ చిన్నఅప్పన్నను సిట్ అరెస్ట్‌చేసి రిమాండ్‌లో ఉంచింది. కల్తీనెయ్యి పాపంలో దోషులెవరనేది తేల్చేయడమే ఇక తరువాయిగా మారింది.

## తిరునగరిలో రెండు నెలల్లో 'ఈట్‌స్ట్రీట్'



**తిరుపతి,డిసెంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** ప్రసిద్ధ యాత్రాస్థలం, ఆధ్యాత్మికనగరం తిరుపతిలో సామాన్యులకు సరసమైన ధరకు ఆహారపదార్థాలు అందించేందుకు "ఈట్‌స్ట్రీట్"ప్రారంభించేందుకు తిరుపతి నగరపాలకసంస్థ సన్నాహాలు చేస్తోంది. ఇందుకు రెండునెలల్లో ప్రజలకు అందూబాటులోకి తీసుకురానుంది. నగరపాలకసంస్థ కార్యాలయం ఎదురుగా అచ్యుత దేవరాయమార్గంలో ఈట్‌స్ట్రీట్ ఏర్పాటు పనులను కమిషనర్ ఎన్.మౌర్యశుక్రవారం పరిశీలించారు. ఈట్‌స్ట్రీట్‌ప్లాన్, వాహనాల పార్కింగ్ తదితర వాటిని అధికారులు కమిషనర్‌కు వివరించారు. నగరంలోని ప్రజలకేగాక బయటిప్రాంతాల నుండి వచ్చే యాత్రికులకు నాణ్యమైన ఆహారపదార్థాలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఈట్‌స్ట్రీట్‌ను ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. భారత ప్రభుత్వం నుండి అందిన కోటిరూపాయల నిధులతో 12 కంటైనర్లు ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు పార్కింగ్ స్థలం, పిల్లలు ఆడుకునేందుకు ప్లేజోన్, వాటర్‌ఫౌంటైన్ ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. ఈట్‌స్ట్రీట్‌లోని షాపులను వేలంద్వారా కేటాయించడం జరుగుతుందని కమిషనర్ మౌర్య తెలిపారు.

## మహిళలు,బాలల భద్రత కోసం ప్రత్యేక విభాగం

### - నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

**విజయవాడ,డిసెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మహిళలు,బాలల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా అన్నారు. వారిపై జరిగే నేరాల విషయంలో సత్వర స్పందన కోసం రాష్ట్ర వ్యాప్తంగా 164 శక్తి బృందాలు ఏర్పాటు చేసామని తెలిపారు. శక్తి వాట్సప్ నంబర్ 7993485111కు అందే ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఐజీ బి.రాజకుమారి నేతృత్వంలో ప్రత్యేకంగా మహిళలు,బాలల భద్రత విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ విభాగం కోసం తాడేపల్లిలో ఏర్పాటు చేసిన నూతన కార్యాలయాన్ని డిజీపీ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మహిళలు,బాలలపై ఎక్కువగా నేరాలు జరిగే ఆస్కారమున్న ప్రాంతాల్ని గుర్తించారు.

## ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు

**తిరుపతి,డిసెంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలంఅడవుల నుండి ఎర్రచందనం అక్రమరవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ళ జైలుశిక్ష, మూడు లక్షల రూపాయలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ అదనపుజిల్లా జడ్జి జస్టీస్ నరసింహమూర్తి తీర్పునిచ్చారు.శేషాచలం రిజర్వు అటవీప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమరవాణాను అరికట్టే ప్రయత్నంలో ఎర్రచందనం అక్రమరవాణా నిరోధక దళం కఠిన చర్యలు అమలుచేస్తోంది. ఈ విభాగం చీఫ్ లంకెల సుబ్బరాయుడు, ఎస్పీ శ్రీనివాస్,అదనపుఎస్పీ కులశేఖర్ పర్యవేక్షణలో గతంలో నమోదైన కేసుల్లో ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఇలా పలు కేసులపై కోర్టులో స్పెషల్ పిపి అమరనారాయణ ద్వారా బలంగా సాక్ష్యాధారాలు న్యాయస్థానానికి సమర్పిస్తున్నారు. దీంతో ముద్దాయిలకు జైలుశిక్ష, జరిమానా విధిస్తున్నారు. 05/2017 కేసులో ఇద్దరు ముద్దాయిలు తమిళనాడు తిరువణ్ణామలైకు చెందిన వెల్లయ్యన్‌శివాజీ, మోహన్‌శంకర్‌లు కరకంబాడి బీట్‌లో ఎర్రచందనం అక్రమరవాణాలో పట్టుబడ్డారు. వీరి నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి స్మగ్లర్లకు ఐదేళ్ల జైలుశిక్ష, 3లక్షలరూపాయలు జరిమానా విధించడంతో తదుపరి నెల్లూరు సెంట్రల్‌జైల్‌కు తరలించారు.

### ఎపి స్టేట్ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్లు నియామకం..

**విజయవాడ,డిసెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ స్టేట్ సివిల్ సప్లై కార్పొరేషన్ లో 5 డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మీరు రెండేళ్ల పాటు పదవుల్లో కొనసాగుతారని ఉత్తర్వులు పేర్కొన్నారు. ఇప్పటికే సివిల్ సప్లై కార్పొరేషన్‌కు ఛైర్మన్‌ను నియమించారు.వీరు కచ్చితంగా రెండు నెలల పాటు తమ పదవుల్లో కొనసాగుతారు.ఉత్తర్వులను అనుసరించి ఒకట్రెండు రోజుల్లో వీరంతా బాధ్యతలను స్వీకరించనున్నారు.

## గ్రామీణాభివృద్ధి, మంచినీటి సరఫరా విషయంలో సంస్కరణలే కీలకం - ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**విజయవాడ,డిసెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** పంచాయతీరాజ్ వ్యవస్థలో గ్రామీణాభివృద్ధి, మంచినీటి సరఫరా విషయంలో సంస్కరణలే కీలకమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేసారు. పంచాయతీరాజ్ పాలనలో వ్యవస్థాగతమైన సంస్కరణలు చేపట్టి గ్రామ స్వరాజ్య సాధన దిశగా - స్థానిక సంస్థల పాలకులను, ఉద్యోగులను ముందుకు తీసుకువెళ్తున్నారు . పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్.డబ్ల్యూ.ఎస్. శాఖలు నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్. ఈ క్రమంలోనే గ్రామీణాభివృద్ధి, ఆర్.డబ్ల్యూ.ఎస్. శాఖలో - క్షేత్ర స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ పరిపాలన ప్రక్రియలో సంస్కరణలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ విషయమై ఈ సాయంత్రం క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమాలోచనలు చేశారు. ఈ శాఖల్లో ఉన్న ఉద్యోగుల ప్యాటర్న్, క్షేత్ర స్థాయి నుంచి పై స్థాయి వరకూ ఉన్న హోదాలపై చర్చించారు. గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన పనులు వేగవంతం కావడంతోపాటు,

ప్రజలలో సంతృప్త స్థాయి పెంచే విధంగా మార్పులు చేపట్టాల్సిన అవసరం ఉందని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛ రథం,

మ్యాజిక్ డ్రెయిన్ పైలెట్ ప్రాజెక్టులు గురించి ప్రస్తావిస్తూ - ఇలాంటి నూతన ఆలోచనలతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి అన్నారు. ఈ శాఖల్లో ఉన్న ఉద్యోగులకు ప్రోత్సాహకరమైన, భరోసా ఇచ్చే పరిస్థితులను తీసుకురావాలని స్పష్టం చేశారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
Tender Notice No. 37/2025-26/SE-W/EE-II (Works)/DB, dt. : 11-12-2025
Number of Works - 01 Work Value of works : Rs. 1,45,67,908.00
Starting Date : 11-12-2025
Ending Date : 26-12-2025
Note : Further details at htpp://www.tender.apeprocurement.gov.in
O/o the EE-II Cell No. 99480 95518
Sd/- COMMISSIONER

వార్త

> ఇతరులు మనం చెప్పినట్లు చేయాలని ఆశించడమే మనం చేసే మొదటి తప్పు.
>
> -సిసిరో

# రక్తసిక్తమవుతున్న రహదారులు

ఒకరు కాదు, ఇద్దరు కాదు, పదులు వందలు కాదు, దేశవ్యాప్తంగా వేలసంఖ్యలో రోడ్డు ప్రమాదాల్లో ప్రజలు అసువులు భాస్తున్నారు. ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని ప్రభుత్వాలు ఎంత చెప్పున్నా, ఎన్ని చట్టాలు తీసుకువస్తున్నా మరెన్ని సమీక్షలు, సమావేశాలు జరుపుతున్నా ప్రమాదాలు అంతకంతకు పెరిగిపోతున్నాయి. ఏమాత్రం తగ్గడం లేదు. రోడెక్కిన మనిషి సురక్షితంగా ఇంటికి తిరిగి వస్తాడన్న భరోసా రోజురోజుకు తగ్గిపోతున్నది. అభివృద్ధికి సోపానాలుగా వర్థిల్లాల్సిన రహదారులు వికలాంగమో, వీరస్వర్గమో అన్నట్లుగా దాపురిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ అల్లూరి సీతారామరాజు జిల్లాలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మంది యాత్రికులు మృతిచెందగా, మరో ఇరవై మంది వరకు గాయపడ్డారు. అందులో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్తున్నారు. బస్సులో ఇద్దరు డ్రైవర్లు,ముప్పైఐదు మంది యాత్రికులున్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన వీరు తీర్థయాత్రల కోసంప్రైవేట్ బస్సులో బయల్దేరారు. అన్నవరం నుండి భద్రాచలం వెళ్తుండగా చింతూరు, మారేడుమిల్లి ఘాట్‌రోడ్డులో రాజుగారి మెట్టవద్ద వీరు ప్రయాణిస్తున్న బస్సు తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో అదుపుతప్పి లోయలో పడిపోయింది. మృతిచెందిన వారిలో ఐదుగురు మహిళలున్నారు. ఈ సంఘటన పట్ల రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైనవైద్యం అందించేందుకు భద్రాచలానికి తరలిస్తున్నారు. అవసరమైతే ఖమ్మం, హైదరాబాద్‌కు తరలించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఇక అరుణాచల్‌ప్రదేశ్‌లో ఇండో, చైనా సరిహద్దు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పదిహేడు మంది కార్మికులు మృతిచెందినట్లు సమాచారం. వాస్తవంగా ఈ ప్రమాదం సోమవారం ఇరవైఒక్క మంది రోజువారీ కూలీలతో వెళ్తున్న ట్రక్ అంజావ్‌జిల్లాలోని హయులియాంగ్ చెగ్లామ్ రహదారిపై ఘోర ప్రమాదానికి గురైంది. ఈ విషాద సంఘటన మూడు రోజుల తర్వాత బాహ్యప్రపంచానికి సమాచారం అందింది. అసోంలోని టిక్‌సుకియాకు చెందిన దినసరి కూలీలతో బయలుదేరిన ఈ ట్రక్ మార్గమధ్యంలో అదుపుతప్పి లోతైన లోయలో పడిపోయింది. ప్రమాద సమయంలో ట్రక్‌లో ఇరవైరెండు మంది కూలీలున్నట్లు చెబుతున్నారు. మొత్తం అందరూ చనిపోయినట్లు భావిస్తున్నా పదిహేడు మంది మృతదేహాలను బయటకు తీశారు. కేంద్ర రోడ్డురవాణా రహదారుల మంత్రిత్వశాఖ ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం 2022లో దేశవ్యాప్తంగా నాలుగు లక్షల అరవైఒక్కవేల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఆ ప్రమాదాల్లో లక్షాఅరవై ఎనిమిదివేల మంది ప్రాణాలు కోల్పోయారు. మరో నాలుగు లక్షల నలభైమూడువేల మంది గాయపడ్డారు. అంతకుముందు యేడాదితో పోలిస్తే రోడ్డు ప్రమాదాలు దాదాపు పన్నెండు శాతం మరణాలు తొమ్మిదిన్నర శాతం మేర పెరిగాయి. క్షతగాత్రుల సంఖ్య పదిహేను శాతం అధికమైంది. కేంద్ర ప్రభుత్వం లెక్కల ప్రకారం సగటున రోజూ పన్నెండు వందలకు పైగా రహదారి ప్రమాదాలు చోటుచేసుకుంటే వాటిలో రోజూ నాలుగువందల అరవైరెండు మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారిలో అరవైశాతం వరకు ముప్ఫైఐదేళ్లలోపు వయసున్నవారే. ఇక ప్రమాదాలకు గురవుతున్న వాటిల్లో ద్విచక్ర వాహనాలు అధికంగానే ఉంటున్నాయి. హెల్మెట్లు ధరించకపోవడం వల్ల ఈ ప్రమాదాల్లో ఎక్కువ మంది మరణిస్తున్నారు. ఆటోరిక్షాల కారణంగా సంభవిస్తున్న ప్రమాదాల్లో పాతికశాతం మందికిపైగా ప్రాణాలు కోల్పోతున్నారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి యేటా పదిహేనువేల మందికిపైగా మరణిస్తుండగా యాభైవేల మంది వరకు గాయపడుతున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే వచ్చే ఐదేళ్లలో ఆ సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం ఉంది. భర్తలను కోల్పోయిన భార్యలు,తల్లిదండ్రులనుకోల్పోయిన పిల్లలు, పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు ఇలా ఒక్కరేమిటి గత పదేళ్లలో తెలుగురాష్ట్రాల్లోనే లక్షకుపైగా కుటుంబాలు పడిన, పడుతున్న మానసికవేదన వర్ణనాతీతం. ప్రమాదాల్లో కుటుంబ సభ్యులను కోల్పోయిన ఆ భాగ్యులకు ఏమిచ్చినా, మాటలతో ఎంత ఊరట కల్పించినా ఆ లోటు తీర్చలేం. ప్రమాదాలకు గురై అసువులు భాసిన వారి మృతదేహాలను స్వగ్రామాలకు తీసుకువెళ్లే ఆర్థికస్తోమత లేక, వారి బంధువులు అక్కడికక్కడే కననం చేసిన సంఘటనలు కూడా ఎన్నో ఉన్నాయి. పెరిగిపోతున్న ఈ ప్రమాదాల్లో బలైపోతున్న అమాయకుల విషయం పాలకులకు తెలియంది కాదు.వేలాదిమందిని పొట్టన పెట్టుకుంటున్న ఈ ప్రమాదాల నివారణకు త్రికరణశుద్ధిగా ప్రయత్నం జరగడం లేదేమోననిపిస్తున్నది. అధ్యయన కమిటీలు, నివేదికలు సమీక్షా,సమావేశాలకు కొరత లేదు. ఎన్నో ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఇప్పుడే కాదు ఎన్నో ఏళ్లనుంచి అటు రాష్ట్ర ప్రభుత్వాలు, ఇటు కేంద్రప్రభుత్వం ఈప్రమాదాల నివారణకు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్తున్నాయి. వాస్తవంగా 2024 నాటికే రోడ్డు ప్రమాదాల్లో మరణాలను సగానికి తగ్గించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్నా అది సాధ్యం కాదనే వాస్తవాన్ని గ్రహించి ఆ లక్ష్యాన్ని 2030 నాటికి పొడిగించింది. అప్పటికీ లక్ష్యాన్ని చేరుకునే పరిస్థితులు కన్పించడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా ఈ ప్రమాదాల నివారణ, నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోకపోతే మృతుల సంఖ్య ఊహించని రీతిలో పెరిగే అవకాశాలున్నాయి.

> సంపదకి అహంకారం తోడైతే అన్ని దుర్గుణాలూ వరుసగా ఉత్పన్నమవుతాయి. వాటి ఫలితం మనిషి నాశనమే.
>
> గోల్డ్‌స్మిత్



> సువాసన వెదజల్లే అత్తరులు, తళతళ మెరిసే అలంకారాలు, సంపదలు వీటన్నిటికన్నా ఉత్తమ సంస్కారమే మంచి సంపద, మంచి అలంకారం.
>
> అరిస్టాటిల్



# రాక్షస క్రీడను నియంత్రించలేమా?

**తెలుగు రాష్ట్రాల్లో ఈ ర్యాగింగ్ భూతం వికృత రూపం దాలుస్తున్నా ఒక్క కేసులో కూడా నిందితులను సాక్ష్యాలతోసహా న్యాయస్థానం ముందుంచి శిక్ష వేయించలేకపోయారంటే ఏమనుకోవాలి. ప్రాణసమానంగా పెంచుకున్న తమ బిడ్డలు కళ్లముందే చదువు సంస్కారం ఉందనుకున్న కొందరి వింతపశువుల వికృత చేష్టలకు బలవుతుంటే ఆ గర్భశోకాన్ని ఊహించగలమా? అది ఎప్పటికైనా తీరుతుందా? పెద్దలు మనసుపెట్టి ఆలోచించాలి. కమిటీలు, సమీక్షలతో కాలంగడపకుండా పక్షపాతరహితంగా రాజకీయాలకు అతీతంగా కఠిన చర్యలు తీసుకోగలిగితే ఇలా వేధించి ర్యాగింగ్‌కు పాల్పడేవారికి, ప్రోత్సహించే వారికి ఒక తిరుగులేని హెచ్చరిక అందించగలుగుతాం. ర్యాగింగ్ భూతాన్ని పారద్రోలగలుగుతాం. ఆ దృఢసంకల్పం లేనప్పుడు ఈ చట్టాలు, చర్చలు, కమిటీలు అన్నీ నిష్ప్రయోజనమే. పాలకపెద్దల ఉదాసీనతకు, చేతకానితనానికి అమాయక మెరికల్లాంటి విద్యార్థులు బలైపోతూనే ఉంటారు.**

దామెర్ల సాయిబాబ

ఎన్ని చట్టాలు చేసినా, కఠిన చర్యలు తప్పవని ఎందరో నేతలు ఎన్నిసార్లు హెచ్చరించినా ర్యాగింగ్ భూతం వదిలిపెట్టడం లేదు. వికృత రూపం దాల్చిన ఈ ర్యాగింగ్‌కు ఎందరో అమాయక విద్యార్థులు బలైపోతున్నారు. వీటిల్లో కొన్ని మాత్రమే వెలుగులోకి వస్తున్నాయి. తమకు జరిగిన అవమానాలను భరించలేక బయటకు చెప్పుకోలేక వారిలో కొందరు కుమిలిపోతుంటే మరికొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.ఇంతకాలంగా ఇంతగా కొనసాగుతున్న ర్యాగింగ్ కారకులకు ప్రభుత్వం నిర్దిష్టమైన, పటిష్టమైన చర్యలు తీసుకొని పునరావృతం కాకుండా నివారించలేకపోతున్నది. ఇలాంటి సంఘటనలలో కొన్ని చాలా స్పష్టమైన సాక్ష్యాలతో వెలుగుచూసినప్పుడు కూడా వాటిని న్యాయస్థానం ముందు పెట్టి కారకులకు శిక్షలు వేయించడంలో పాలకయాంత్రాంగం విఫలమవుతున్నది. చట్టాలు, నిబంధనలు ఎన్ని ఉన్నా అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. చట్టాలకు సామాన్యులు లోకువ అయితే సమర్థులకు చట్టాలు లోకువ అవుతున్నాయి. ఈ కారణంగానే నిందితులు ఏదోరకంగా బయటపడుతున్నారు. అందులోనూ నిందితులు ఎక్కువ శాతం రాజకీయ అండదండలు, లక్ష్మీప్రసన్నుల పుత్రులు కావడంతో వారి జోలికి వెళ్లడానికి అధికారగణం వెనకాడుతున్నదేమోననిపిస్తున్నది. దీంతో ఎవరు ఏం చేసినా, మరెన్ని హెచ్చరికలు చేసినా భయభక్తులు లేకుండా ర్యాగింగ్ భూతం విస్తరించిపోతున్నది. ర్యాగింగ్ అనండి, వేధింపులు అనండి. వీటికారణంగా ఎంతో మంది విద్యార్థినీవిద్యార్థులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు. సరదాపేరిట కొందరు, బలాధిక్యప్రదర్శన కోసం మరికొందరు, కుల, మత, లింగ, వివక్షతో ఇంకొందరు, సీనియర్లు సైకోలా ప్రవర్తిస్తున్న సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ దారుణ వేధింపులు కోటి ఆశలతో కళాశాలల్లోకి అడుగిడుతున్న ఎందరో మెరికల్లాంటి విద్యార్థులను చదువులకు దూరం చేస్తున్నాయి. గుజరాత్‌లోని పాటణ్ జిల్లా దార్పూర్‌లోని వైద్య కళాశాలలో ఆ మధ్య సీనియర్లు కొందరు జూనియర్ విద్యార్థిని మూడుగంటలపాటు నిలబెట్టి పైశాచిక ఆనందం పొందారు. ఆ విద్యార్థి అపస్మారకస్థితిలోకి వెళ్లడంతో ఆస్పత్రికి తీసుకువెళ్లినా ప్రాణాలు దక్కలేదు. ఖమ్మం జిల్లాలో వైద్య కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థినికి హెయిర్‌స్టయిల్ బాగాలేదంటూ సీనియర్లు ర్యాగింగ్ చేశారు. విషయం తెలుసుకున్న కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ర్యాగింగ్ నిరోధక కమిటీ ఇంచార్జ్ సీనియర్లను మందలించకుండా జూనియర్‌పైనే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత రెచ్చిపోయిన సీనియర్లు ఆ విద్యార్థికి గుండు కొట్టించి పవిత్రమైన వైద్యవృత్తికి కళంకం తెచ్చారు. మొన్న నాగర్‌కర్నూల్ ప్రభుత్వ వైద్యకళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఎంబిబిఎస్ విద్యార్థిని గోడకుర్చీ వేసి వేధింపులకు గురి చేయడంతో బాధితుడి ఫిర్యాదుతో సంఘటన వెలుగులోకి వచ్చింది. నలుగురు విద్యార్థులను కాలేజీ యాజమాన్యం సస్పెండ్ చేసింది. ఇక సిద్ధిపేటలోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఎనిమిది మంది సీనియర్లు ఒక జూనియర్‌ను ర్యాగింగ్‌చేశారు. తల్లి ఫిర్యాదు చేయడంతోర్యాగింగ్ నిరోధక చట్టంకింద వారిపై కేసు నమోదు చేశారు. నిజామాబాద్ ప్రభుత్వ వైద్యకళాశాలలో ఇద్దరు సీనియర్లు జూనియర్‌ను ర్యాగింగ్ చేశారు.ఇలా ఇటీవల కాలంలో ఈవికృత క్రీడ రానురాను పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తున్నది. ప్రొఫెషనల్ కాలేజీల్లోనే కాదు ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలల్లో కూడా ఇది విస్తరిస్తున్నది. విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో చదివే విద్యార్థుల భవిష్యత్తును ఈ ర్యాగింగ్ చిదిమేస్తున్నది. అయితే తాము తీసుకుంటున్న చర్యల ఫలితంగా ర్యాగింగ్ తగ్గినట్లు ప్రభుత్వ ప్రకటనలలో వాస్తవం లేదనే విమర్శలను తోసిపుచ్చలేం. 2019-21 మధ్యకాలంలో యూజీసీకి అందిన ఫిర్యాదులు తగ్గినట్లు కన్పిస్తున్నా అది పాలక పెద్దలు తీసుకున్న చర్యల వల్ల కాదని, కేవలం కోవిడ్ ప్రభావం వల్లనేనేది కాదనలేం. 2022 నాటికి యూజీసీకి 1094 ఫిర్యాదులు అందితే 2023 నాటికి 1240కి చేరింది. ఆ తర్వాత మరింతగా పెరుగుతున్నాయి. గతంలో కేవలం విద్యాసంవత్సరం ప్రారంభ రోజులకే పరిమితమయ్యేది. ఇప్పుడు ఆపరిస్థితి లేదు. విద్యాసంవత్సరం అంతా ఎప్పుడుపడితే అప్పుడు కొనసాగుతూనేఉన్నది. వాస్తవంగా ఈ ర్యాగింగ్ అనేది ముందుగా ఇంజినీరింగ్, మెడికల్ లాంటి ప్రొఫెషనల్ కళాశాలల్లో ప్రారంభమైందని చెప్పొచ్చు. రానురాను కళాశాలలన్నింటికి పాకింది. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి సెకండరీ విద్యను పూర్తి చేసుకొని ఉజ్వల భవిష్యత్‌ను ఊహించుకుంటూ కాలేజీలోకి అడుగుపెట్టిన విద్యార్థులకు బెరకు, భయం పోగొట్టడానికి చేపట్టిన పరిచయ వినోద కార్యక్రమం ఇది. ప్రారంభంలో అంతవరకే పరిమితమైనా ఇది శృతిమించి కొందరు విద్యార్థులకు ప్రాణాంతక,వికృతక్రీడగా మారిపోయింది. పాశ్చాత్య సంస్కృతి విషవలయంలో చిక్కుకొని ఆలోచనారహితంగా చేస్తున్న ఈ ర్యాగింగ్‌ను లేతమనసులు తట్టుకోలేకపోతున్నాయి. అశ్లీల సాహిత్యం, నీలి చిత్రాలు, మత్తుపదార్థాలు తోడుకావడంతో ఈ అనుమానుషత్వం పరాకాష్ఠకు చేరుకుంటున్నది. ఇప్పటికే ఎంతో మంది మెరికల్లాంటి విద్యార్థులు బలైపోయారు. అకారణంగా పిల్లలను కోల్పోయిన ఆ కుటుంబాల గర్భశోకం ఎలా తీరుతుందో ఒక్కసారి మనసుపెట్టి పెద్దలు ఆలోచించాలి. ఈ ర్యాగింగ్‌కు భయపడి మరెందరో విద్యార్థులుఏకంగా విద్యాభ్యాసానికే స్వస్తి చెప్తున్న సంఘటనలు చాలా ఉన్నాయి. ర్యాగింగ్‌ను అదుపు చేయడానికి ప్రభుత్వం ఏం చేయడం లేదని చెప్పడం లేదు. చర్చలు, తర్జనభర్జనలు జరిగాయి. మితిమీరుతున్న ఈ విషసంస్కృతిని నిరోధించేందుకు అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్రమైన చట్టమే తీసుకువచ్చింది. 1997 మార్చి 18న రాష్ట్ర శాసనసభ ఆమోదించిన ర్యాగింగ్ చట్టం ప్రకారం వేధింపులకు గురిచేసినా, ఆత్మహత్యకు ప్రేరేపించినా ఆరునెలల జైలుశిక్షతోపాటు తీవ్రతను బట్టి పదేళ్లవరకు శిక్ష విధించే చట్టాన్ని ఆమోదించారు. వీటన్నింటికంటే మించి ర్యాగింగ్ చేసిన విద్యార్థులను ఆయా విద్యాసంవత్సరం నుంచి తొలగించడమే కాక వారిని ఎక్కడా చేర్చుకోరాదని కూడా చట్టంలో పొందుపరిచారు. చట్టమైతే తెచ్చారు కానీ త్రికరణ శుద్ధిగా అమలు చేసే మనసు పాలకులకు లేకుండాపోయింది. సంఘటనలు వెలుగు చూసినప్పుడు నాలుగైదు రోజులపాటు అధికారులో, నేతలో హడావుడి చేయడం, ఆ తర్వాత మరిచిపోవడం పరిపాటిగా మారిపోయింది. పొరుగునున్న తమిళనాడులో 1996లో జరిగిన సంఘటనల్లో ఆ రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లో పటిష్టమైన, కఠినమైన చర్యలు తీసుకోవడంతో అక్కడి ర్యాగింగ్ భూతం తగ్గిపోయిందనిచెప్పొచ్చు. 1996 నవంబరు 6న జాన్ డేవిడ్ అనే విద్యార్థి పొనవరసు అనే జూనియర్ విద్యార్థిని తన రూమ్‌కు తీసుకువెళ్లి రికార్డు బుక్ రాయమని ఆదేశించాడు. తాను ఒక మాజీ వైస్‌ఛాన్సలర్ కుమారుడు కావడంతో తనను ఎవరూ ఏమీ చేయలేరన్న ధైర్యంతో సీనియర్ ఆదేశాలను పొనవరసు తిరస్కరించాడు.దీంతో ఆగ్రహం చెందిన సీనియర్ పరిధులు దాటి పైశాచిక స్థితికి చేరుకొని విచక్షణారహితంగా కొట్టడంతో జూనియర్ మరణించాడు. పకడ్బందీ సాక్ష్యాలతో అక్కడి యంత్రాంగం న్యాయస్థానం ముందు నిందితుడిని నిలబెట్టింది. చదువుకొని గొప్ప వైద్యుడిగా పేరుప్రతిష్టలు సంపాదించిపెడతారని కుమారుడిపై ఆశలు పెంచుకున్న తల్లిదండ్రులను దృష్టిలో ఉంచుకొని మరణశిక్ష వేయడంలేదని న్యాయమూర్తి వ్యాఖ్యానిస్తూ ఇరవైఎనిమిది సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష విధించారు.ఇది తమిళనాడులో విద్యార్థిలోకంలో భయం పుట్టుకుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ ర్యాగింగ్ భూతం వికృత రూపం దాలుస్తున్నా ఒక్క కేసులో కూడా నిందితులను సాక్ష్యాలతోసహా న్యాయస్థానం ముందుంచి శిక్ష వేయించలేకపోయారంటే ఏమనుకోవాలి. ప్రాణసమానంగా పెంచుకున్న తమ బిడ్డలు కళ్లముందే చదువు సంస్కారం ఉందనుకున్న కొందరు వింతపశువుల వికృత చేష్టలకు బలవుతుంటే ఆ గర్భశోకాన్ని ఊహించగలమా?అది ఎప్పటికైనాతీరుతుందా? పెద్దలు మనసుపెట్టి ఆలోచించాలి. కమిటీలు, సమీక్షలతో కాలం గడపకుండా పక్షపాతరహితంగా రాజకీయాలకు అతీతంగా కఠినచర్యలు తీసుకోగలిగితే ఇలా వేధించి ర్యాగింగ్‌కు పాల్పడేవారికి, ప్రోత్సహించే వారికి ఒక తిరుగులేని హెచ్చరిక అందించగలుగుతాం. ర్యాగింగ్ భూతాన్ని పారద్రోలగలుగుతాం. ఆ దృఢసంకల్పం లేనప్పుడు ఈ చట్టాలు, చర్చలు, కమిటీలు అన్నీ నిష్ప్రయోజనమే. పాలకపెద్దల ఉదాసీనతకు, చేతకానితనానికి అమాయక మెరికల్లాంటి విద్యార్థులు బలైపోతూనే ఉంటారు. ●

## ఒక్క మాట

# పిల్లల్లో పెరుగుతున్న నేర ప్రవృత్తి

బి. మధుపాళి

ఈ మధ్యకాలంలో పిల్లల్లో నేర ప్రవృత్తి విపరీతంగా పెరిగిపోయింది అనే దానికి నిదర్శనంగా ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా కొంతమంది పిల్లలు చేసిన ఆకృత్యాలు, వారు హింసాత్మక, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడటం వంటి చర్యలు అందుకు ఓ సాక్షి భూతంగా మన కళ్ళ ముందు నిలుస్తున్నాయి అనే మాట సత్య దూరం కాదు. ముఖ్యంగా పిల్లలు తెలిసో తెలియకో, క్రమశిక్షణ లోపం నుంచో లేక సోషల్ మీడియా ప్రభావం వల్లనో లేక మత్తు పదార్థాలు సేవించడం వల్లనో కాని, తమకు మంచి చెప్పేందుకు ప్రయత్నించిన ఉపాధ్యాయులపై సైతం విచక్షణ రహితంగా దాడులకు పాల్పడటం, మత్తు మందులు సేవించి క్లాస్ రూమ్‌లోకి అడుగుపెట్టడం, ఆడపిల్లలపై లైంగిక దాడులకు పాల్పడటం, ఉపాధ్యాయులు మందలించారుఅనే నెపంతో వారి ముందే ఆత్మహత్య ప్రయత్నాలు చేయడం వంటి అనేక హింసాత్మక, చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడటం కొంతమంది పిల్లల్లో శృతిమించి పోవడం ఈ ప్రజాస్వామ్యానికి సంబంధించి అత్యంత ఆందోళనకరం.అదే మాదిరి కొంతలో కొంత స్మార్ట్ ఫోన్ల ప్రభావం,తల్లిదండ్రుల నిర్లక్ష్యం, ఉపాధ్యాయుల అలసత్వం వెరసి నేటి పిల్లలు ఇలా చెడు పంథాలో వెళుతూ ఆకతాయి పనులు చేయడం అనేది వారికి నిత్యకృత్యంగా మారడం ఇటీవల కాలంలో మరీ మితిమీరిపోయింది అనే మాట అక్షర సత్యం. అలాగే తమ పిల్లలు ఏదైనా తప్పు చేస్తే వారిని ఉపాధ్యాయులు దండించడం అనేది వారి విధి, బాధ్యత. అయితే బొత్తిగా విచక్షణ కోల్పోయిన కొంతమంది పిల్లల తల్లిదండ్రులు తప్పు చేసిన తమ పిల్లలకు నచ్చ జెప్పాల్సింది పోయి తమ పిల్లల్ని దండించిన ఉపాధ్యాయుల మీదకే దండెత్తుతుండటం ఏ మాత్రం భావ్యమో,సమంజసమో విద్యార్థుల తల్లిదండ్రుల వివేకానికే మనం వదిలేయాలి.అంతేగాకుండా ఒక్కొక్కసారి ఉపాధ్యాయులు సైతం తమ గురుతర బాధ్యతను మరచి కొంతమంది పిల్లలపై చీటికీ మాటికీ కక్ష్య



సాధింపు చర్యలకు పాల్పడటం మూలాన కూడా ఆ పిల్లల హృదయాలు గాయపడి వారు నేరస్థులుగా మారే ప్రమాదం సైతం పొంచి వుంది అనే మాటలో ఎంతో కొంత వాస్తవం ఉంది. ఇంకా చెప్పుకుంటూపోతే తల్లిదండ్రులు సైతం తమ పిల్లల ప్రవర్తనను నిత్యం గమనిస్తూ, పర్యవేక్షిస్తూ ఉండాలి. ఏవైనా తమ పిల్లల వ్యవహారశైలిలో మార్పులు చోటు చేసుకుంటే తక్షణమే వారిని సైకాలజిస్టుల దగ్గరకు తీసుకెళ్లి వారి చెడు ప్రవర్తనలో మార్పు తెచ్చేందుకు తీవ్ర కృషి సల్పాలి. ఏదిఏమైన ఈ సందర్భంగా కొంతమంది మేధావి వర్గాల వారు సెలవిచ్చినట్లు పిల్లలకు మద్యం, సిగరెట్లు, బీడీలు అమ్మకుండా చర్యలు తీసుకోవడంతో పాటు,బాగా అభివృద్ధి చెందిన చైనా, ఆస్ట్రేలియా దేశాల మాదిరిగా చిన్న పిల్లలకు అశ్లీల సైట్స్, సోషల్ మీడియా, స్మార్ట్ ఫోన్స్ వంటివి అందుబాటులో లేకుండా చాలా కఠినమైన చట్టాల అమలులోకి తేవాల్సిన తక్షణ కర్తవ్యం గురుతర బాధ్యత మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దల భుజస్కందాలపై ఎంతైనా వుంది. ఏమైనా పిల్లల్లో రోజురోజుకు అడుగంటిపోతున్న మానవతా విలువలను తిరిగి వారిలో పెంపొందింపజేసేలా, అదేమాదిరి తమ పిల్లలకు ఏమైనా చెడు స్నేహాలు, వ్యసనాలు ఉంటే సత్వరమే, తక్షణమే వాటిని వారు వదిలించుకునేలా వారి మనస్సులను ప్రక్షాళన చేయాల్సిన కర్తవ్యం, బాధ్యత ప్రతి విద్యార్థుల తల్లిదండ్రులపై ఎంతైనా వుంది అనే మాట సత్య దూరం కాదు.అంతకుమించి చెడు పంథాలో వెళుతున్న పిల్లల నడవడికలో మార్పు తెచ్చేందుకు సైతం యుద్ధ ప్రాతిపదికన ఒక వైపు పిల్లల తల్లిదండ్రులు మరో వైపు ఉపాధ్యాయులు తీవ్ర కృషి చేయాల్సిన కాలం, తక్షణ అవసరం ఆసన్నమైంది. చీకట్లు కమ్ముకున్న పిల్లల జీవితాల్లో మనమంతా వెలుగులు నింపే ప్రయత్నం చేయడమే కాదు, అదే మాదిరి ఓ మానవతావాదులుగా కూడా ప్రతిఒక్క ప్రజానీకం పిల్లలకు ఓ ఉజ్వల భవిష్యత్‌ను ప్రసాదించేందుకు సైతం తమ శక్తి వంచన లేకుండా ప్రయత్నం గావిస్తే మాత్రం ఖచ్చితంగా, తప్పక నూటికి నూరు పాళ్ళు ఓ మంచి ఫలితం దక్కి తీరుతుంది అనడంలో ఎలాంటి సందేహానికి తావు లేదు. నేటి పిల్లలు ఓ బాధ్యత గల రేపటి భారత పౌరులుగా ఎదగాలి కాని, ఓ విధ్వంసకర శక్తులుగా అసలు ఎలాంటి పరిస్థితుల్లో ఎదగకూడదు! ●

# కనుమరుగవుతున్న సామాజిక శాస్త్రాలు

మేకిరి దామోదర్

ప్రజాస్వామ్యం కేవలం ఓటు హక్కుతో మాత్రమే నిలబడేది కాదు. అది విలువలపై, అవగాహనపై, బాధ్యతాయుతమైన పౌర ప్రవర్తనపై ఆధారపడి ఉంటుంది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం, లౌకిక వాదం, జాతీయ ఏకత్వం వంటి రాజ్యాంగ మూలాలు పుస్తకాలలో మాత్రమే కాకుండా పౌరుల దైనందిన జీవితాలలో ప్రతిబింబించినప్పుడే ఒక దేశం నిజమైన అర్థంలో ప్రగతి పథంలో నడుస్తుంది. అయితే నేటి సమాజాన్ని పరిశీలిస్తే ఈ విలువల్ని నిర్మించే ప్రధాన ఆధారాలైన సామాజిక శాస్త్రాలు క్రమంగా విద్యా వ్యవస్థ నుంచి, సామాజిక చర్చల నుంచి, విధాన నిర్ణయాల నుంచి కనుమరుగవుతున్నాయని ఆందోళన కలుగుతోంది. ఇది భవిష్యత్ ప్రజాస్వామ్యానికి పెద్ద ప్రమాద సంకేతం. మన దేశం ప్రజాస్వామ్యమని చెప్పుకోవడమే కానీ, ఆ ప్రజాస్వామ్య స్థిరత్వానికి అవసరమైన పౌర చైతన్యం, రాజకీయ అవగాహన, నైతిక ప్రవర్తన అన్నివైపులా క్షీణిస్తున్నాయి. 'నేను-నాది' అన్న సంకుచిత భావన పెరిగిపోయి, వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలే పరమావధిగా మారుతున్నాయి. ఫలితంగా కుల, మత, ప్రాంతీయ విభేదాలు బలపడుతూ, సామాజిక అసమానతలు విస్తరిస్తున్నాయి. ఈ పరిస్థితికి ప్రధాన కారణం తరతరాలకు సామాజిక శాస్త్రాల ద్వారా అందాల్సిన చైతన్యం సరైన స్థాయిలో చేరకపోవడమే. పౌర హక్కులు, బాధ్యతలు ఏమిటి? పాలన వ్యవస్థ ఎలా పనిచేస్తుంది? ఓటు విలువ ఏమిటి? ప్రజాప్రతినిధులను ఎన్నికల్లో ఎన్నుకునేటప్పుడు ఏ ప్రమాణాలు పాటించాలి? ఇవన్నీ నేర్పాల్సిన బాధ్యత విద్యా వ్యవస్థపై ఉంది. కానీ నేటి పరిస్థితిలో పాఠశాలల నుండి విశ్వవిద్యాలయాల వరకు సామాజిక శాస్త్రాలు రెండవ శ్రేణి అంశాలుగా మారిపోయాయి. వైద్య, ఇంజినీరింగ్, సాంకేతిక, వాణిజ్య విద్యకే సమస్త ప్రాధాన్యం ఇస్తూ, సమాజాన్ని అర్థం చేసుకునే శాస్త్రాలను పక్కన పెట్టిన విద్యా విధానం సమతుల్యమైన మానవాభివృద్ధిని అందివ్వలేకపోతోంది. చరిత్ర, భూగోళ శాస్త్రం, పౌర శాస్త్రం, ఆర్థిక శాస్త్రం,సమాజశాస్త్రం, సాహిత్యం వంటి అంశాలపై అవగాహన లేని తరానికి



'భిన్నత్వంలో ఏకత్వం' అనే భారతీయ భావన లోతుగా అర్థం కాగలదా? సమాజ సమస్యలను విశ్లేషించే సామర్థ్యం లేకపోతే, వాటికి పరిష్కారాలు సూచించే చైతన్యం ఎలా పెరుగుతుంది? సామాజిక శాస్త్రాలు కేవలం మార్కులు సంపాదించడానికి మాత్రమే చదువుకుంటే, వాటి ఆత్మసారం యువతలో నాటుకుపోదు. ఇలాంటి నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని, నైతిక ప్రవర్తనకు ప్రోత్సాహం ఇచ్చే విధానాలపై చర్చ అవసరమైంది. ఈ సందర్భంలో చైనాలో అమలులో ఉన్న సోషల్ క్రెడిట్ సిస్టమ్ (సామాజిక పరపతి విలువ) గురించి ప్రస్తావన అవసరం. పౌరుల ప్రవర్తనను మంచి చెడుల ఆధారంగా మదింపు చేసి, మంచికి బహుమతి, తప్పుకు పరిమితులు విధించే విధానం ఇది. రోడ్డుప్రమాదాలు నివారించటం, సామాజిక సేవ, రక్తదానం, పేదలకు సహాయం, కుటుంబ బాధ్యతలు నిర్వర్తించడం వంటి చర్యలు క్రెడిట్‌ను పెంచుతాయి. చట్టాల ఉల్లంఘనలు,సామాజిక బాధ్యతారాహిత్యం క్రెడిట్‌ను తగ్గిస్తాయి.ఈ విధానం అక్కడ కఠినంగా అమలవుతున్నప్పటికీ, నైతిక ప్రవర్తనపై ప్రభావం చూపుతుందన్న వాస్తవాన్ని విస్మరించలేం. ఆధునిక సాంకేతికత, కృత్రిమ మేధ (ఏఐ) సహాయంతో పౌరుల ప్రవర్తనను గమనించడం ద్వారా సామాజిక క్రమశిక్షణ పెరుగుతోందన్న వాదన కూడాఉంది. అయితే భారతదేశ వంటి ప్రజాస్వామ్య వ్యవస్థలో,వ్యక్తిగత స్వేచ్ఛలకు భంగంకలగకుండా, రాజ్యాంగ పరిధిలో ఇలాంటి ఆలోచనలపై చర్చజరగాల్సిన అవసరం ఉంది.ఇంకా ముఖ్యంగా, ఈతరహా సామాజిక బాధ్యత ప్రమాణాలను రాజకీయ పార్టీలకు, ప్రజాప్రతినిధులకు వర్తింపజేస్తే అవినీతి తగ్గడానికి, పారదర్శకత పెరగడానికి అవకాశముంటుంది. ఎన్నికల హామీలు, విధానాల అమలు, ప్రజలకు జవాబుదారీతనం ఇవన్నీ ఒక మదింపు వ్యవస్థలోకి తీసుకొస్తే ప్రజాస్వామ్యంపై ప్రజల నమ్మకం మరింత బలపడుతుంది. సామాజిక శాస్త్రాలు లేని విద్యా విధానం కేవలం నిపుణులను తయారుచేస్తుంది కానీ బాధ్యతాయుత పౌరులను కాదు. దేశ ప్రగతికి సాంకేతిక పరిజ్ఞానం ఎంత అవసరమో, సామాజిక చైతన్యం కూడా అంతే అవసరం. భవిష్యత్ తరాలు ప్రశ్నించే శక్తితో, విశ్లేషించే దృష్టితో, నైతిక విలువలతో ఎదగాలంటే సామాజికంగా మళ్లీ కేంద్ర స్థానం కల్పించాల్సిందే. ప్రభుత్వాలు, విద్యా నిర్వాహకులు, మేధావులు, పౌర సమాజం కలిసి ఈ విషయాన్ని ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలి. సామాజిక శాస్త్రాల పునరుత్థానం లేకుండా ప్రజాస్వామ్యానికి పటిష్టమైన పునాదులు వేయడం సాధ్యం కాదు. విలువలతో కూడిన విజ్ఞానం కలిగిన పౌర సమాజమే భారతదేశాన్ని నిజమైన అగ్రగామి దేశంగా నిలబెట్టగలదు. ●

# ప్రజావాక్కు



### ఇంటర్నేషనల్ గుర్తింపు పొందుతున్న దీపావళి

ప్రపంచవ్యాప్తంగా భారతీయ సంస్కృతి పెరుగుతున్న ప్రభావంతో దీపావళి పండుగకు అంతర్జాతీయ స్థాయిలో విశేష గుర్తింపులభిస్తోంది.వెలుగుల పండుగగా పేరొందిన దీపావళి,ఇప్పుడుభారతదేశానికే పరిమితంకాకుండా అనేక దేశాల్లో జరిగే గ్లోబల్ సెలబ్రేషన్‌గా మారింది. అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, సింగపూర్, మలేషియా వంటి అనేక దేశాల్లో దీపావళి అధికారిక పండుగగా గుర్తింపు పొందడం గర్వకారణం. ముఖ్యంగా అమెరికాలోని కొన్ని రాష్ట్రాలు దీపావళిని పాఠశాల సెలవుగా ప్రకటించడం, భారతీయులలో పెరుగుతున్న సామాజిక, సాంస్కృతిక స్థితిని తెలియజేస్తోంది. యునైటెడ్ నేషన్స్ ప్రత్యేక కార్యక్రమాలు కూడా దీపావళి అంతర్జాతీయ ప్రాధాన్యతను పెంచుతున్నాయి.సాంస్కృతిక దౌత్యపరంగా కూడా దీపావళి భారతదేశ ప్రతిఛాయను మరింత బలపరుస్తోంది. మొత్తానికి అంతర్జాతీయస్థాయిలో దీపావళికిలభిస్తున్న గుర్తింపు,భారతదేశ సంప్రదాయాలనువిశ్వవ్యాప్తం చేస్తోంది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### కల్తీలకు అడ్డుకట్ట వేయాలి

ప్రస్తుతం మార్కెట్‌లో దొరుకుతున్న నిత్యావసర వస్తువులు మొత్తం కల్తీమయంగా మారుతున్నాయి.ముఖ్యంగా ఆహార పదార్థాలను కృత్రిమంగా తయారు చేస్తున్నారు. కృత్రిమ మాంసం,ఇతర రకాలబియ్యం తదితర కృత్రిమ నిత్యావసర ఆహార పదార్థాల కల్తీలకు అడ్డుకట్ట వేయాలి. ప్రజల ఆరోగ్యంపై వీటి ప్రభావం ఎక్కువగా పడుతుంది. చాలా మంది బయటి ఆహారాలను ఎక్కువగా తీసుకుంటారు. కనుక కల్తీకి అడ్డుకట్ట వేయాలి.

- కె.రామారావు, హైదరాబాద్

### వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్రంలోని వికలాంగుల నుండిఅప్పుగా తీసుకున్న డబ్బులుకొందరు తిరిగి ఇవ్వడంలేదు.రౌడీయిజం ప్రదర్శిస్తున్నారు. 2016 వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం శిక్షించాలి.దాడులు దౌర్జన్యంచేసిన వారిపై చర్య తీసుకోవాలి. వికలాంగుల ఇంటి స్థలం అక్రమంగా తీసుకోని అక్రమంగా మరుగుదొడ్లు కట్టిన వారిపై చర్య తీసుకోవాలి.పోలీస్‌శాఖ,రెవిన్యూశాఖ ఆధ్వర్యంలో వికలాంగులకు సంబంధించిన సమస్యలు పరిష్కారం చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### తల్లిదండ్రుల నిర్లక్ష్యం

గంజాయి సరఫరా ప్రస్తుతం సంఘటిత నేర ఆర్థిక వ్యవస్థగా పరిణమించింది. సరిహద్దు రాష్ట్రాల నుంచి రహస్య రవాణా, ఆపై పట్టణాల్లో చిన్న నెట్‌వర్క్‌ల ద్వారా విక్రయాలు సాధారణమయ్యాయి. ప్రతి అరెస్టు తాత్కాలిక ఉపశమనం మాత్రమే. నిరుద్యోగం, సామాజిక నిరాశ, ఒత్తిడి వంటి అంశాల నుంచి క్షణికంగా తప్పించుకోవాలనే మానసిక ఆలోచనే ఈ డిమాండ్‌కు మూలం.ప్రభుత్వం ఎన్‌డిపిఎస్ చట్టం కింద కఠిన శిక్షలు అమలు చేస్తున్నా, సరఫరా తగ్గడంలేదు.దీనికి కారణం, మనం ముల్లును కాకుండా ఆకులను మాత్రమే తొలగిస్తున్నాము. సరఫరా వెనుకఉన్న పెద్ద నెట్‌వర్క్‌లను ఛేదించడంలో పూర్తిస్థాయి విజయం సాధించలేకపోతున్నాం. తల్లిదండ్రుల నిర్లక్ష్యం కూడా మరో ప్రధాన కారణం. పిల్లల పర్యవేక్షణ బాధ్యతను విస్మరిం చడం,'మా బిడ్డ మంచివాడే' అనే భ్రమ చివరకు సంక్షోభంలోకి నెడుతోంది.

-సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### రోడ్లను బాగు చేయాలి

ఇటీవల పలు చోట్ల కురిసిన వర్షాలకు గ్రామీణ ప్రాంత రోడ్లు ప్రమాదకరంగా మారాయి. చాలా గ్రామాలలో పొలాల నుండి భారీగా కురిసిన వర్షపు నీరు రోడ్ల పై నుండి ప్రవహించి రోడ్లు కోతకు గురైయ్యాయి.ఈపరిస్థితుల్లో గ్రామీణ రోడ్లు గుంతలమయంగా మారి, కంకరతేలి ప్రమాదాలు జరిగే విధంగా తయారయ్యాయి. అదేవిధంగా రోడ్లవెంట కంపచెట్లు పెరిగి వాహనదారులు గాయపడేవిధంగా ఉంటున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు గ్రామీణ ప్రాంతాలలో ప్రమాదకరంగా దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టాలి.

-టి.యోగేందర్, నల్గొండ జిల్లా

### ఏకగ్రీవాల పరంపర కొనసాగాలి

నేడు తెలంగాణలో ప్రజాస్వామిక పండుగ నడుస్తోంది, అయితే చైతన్యంతో నిండినఅడుగులు కూడా నేడుపడుతున్నాయి. అందులో రెండు అంశాలు ఉత్తేజకరంగా ఉన్నయి.ఒకటి ఏకగ్రీవాల పరంపర, మరొకటి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక అయితే మేము ఇన్ని లక్షలు ఊరికి ఇస్తాం అని వాగ్దానం చేస్తున్నారు. అయితేవారు ఇచ్చేడబ్బును గ్రామపంచాయితీ అకౌంట్‌లో జమ చేసి వాటిని గ్రామాభివృద్ధికి వాడుకోవాలి. ఈ రకమైన పని చిన్న గ్రామపంచాయితీలు,గుడెలు తండాలకు ఉపయోగకరంగా ఉంటుంది.ఒక రకంగా ప్రజాస్వామిక స్ఫూర్తిని నిలబెడుతుంది.

-అవినాష్ భారత్, జనగాం

మనవి
ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

## వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసిన వైవి గౌతమ్ అశోక్

**ఒంగోలు, ప్రభాతవార్త**



రాష్ట్ర బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శి వైవి గౌతమ్ అశోక్ ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరు రవితో కలిసి మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లి పార్టీ ఆఫీసు లో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా చుండిరి రవి ఒంగోలు నియోజక వర్గంలో కోటి సంతకాల కార్యక్రమం గురించి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి వివరించారు. వై ఎస్ జగన్మోహన్‌రెడ్డి రాబోయే రోజుల్లో మన పార్టీకి మంచి భవిష్యత్తు ఉంది, కాబట్టి మీరంతా పార్టీనీ బూతు స్థాయిలో బలోపేతానికి కృషి చేయాలని వైవి గౌతమ అశోక్‌కి సూచించారు. వీరితో పాటు కొత్తపట్నం మండలం ఎంపీపీ అంజిరెడ్డి, ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్, 44 డివిజన్ అధ్యక్షుడు మాల్యాద్రి, రాష్ట్ర నాయకులు జి రజిని, మేరీలు జగన్మోహన్ రెడ్డిని కలిసినవారిలో ఉన్నారు.

## చెరువులో పడి వ్యక్తి మృతి

**కొండపి, ప్రభాతవార్త**



మండలంలోని తాటాకుల పాలెం వ్యవసాయ చెరువు లో పడి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. కొండపి ఎస్సై బి ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు కొండపిలోని బీసీ కాలనీ చెందిన బొజ్జ కొండయ్య (50)అను వ్యక్తి తాటాకుల పాలెం వెళ్లి చెరువులో పడి చనిపోయినట్లుగా మృతిని భార్య కొండమ్మ ఫిర్యాదు చేసిందని తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవఅంచనామ నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకు వైద్యశాలకు పంపించటం జరిగిందని ఆయన తెలిపారు. మృతికి కారణాలు తెలియ రాలేదని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## వైఎస్సార్సీపీ మీడియా ప్యానలిస్ట్‌గా బొట్లా రామారావు

**ఒంగోలు, ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లాకు చెందిన బొట్లా రామారావు ను వైఎస్సార్సీపీ అధినేత వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర స్థాయిలో మీడియా ప్రతినిధిగా నియామకం చేశారు. వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తూ దర్శి, సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గముల పరిశీలకులుగా చురుగ్గా పనిచేస్తూ మంచి ప్రతిభ కనబరుస్తున్న బొట్లా రామారావుకు మరొక ముఖ్యమైన "మీడియా ప్రతినిధి"గా బాధ్యతలు కల్పించడమైనది. ఈ నియామకం గురించి బొట్లా రామారావు మాట్లాడుతూ నాపై నమ్మకంతో జగనన్న అప్పగించిన బాధ్యతలను శక్తి వంచన లేకుండా పనిచేస్తానని, జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిగా చేయడమే ఏకైక లక్ష్యంగా పనిచేస్తానని, ఈ సందర్భంగా నన్ను అన్ని విధాలా నిరంతరం ప్రోత్సహిస్తున్న మా ప్రియతమ అధినేత జగనన్న కు రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డికి, రాష్ట్ర పార్టీ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణా రెడ్డికి, ఒంగోలు పార్లమెంట్ ఇంచార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డికి, రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావుకి, జిల్లా పార్టీ అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డికి, జడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మకి, మాజీ మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, జిల్లా పార్టీ పరిశీలకులు బత్తుల బ్రహ్మారెడ్డికి, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

## జూనియర్ అసిస్టెంట్ బిఎల్ఓ విధులు నిలుపుదల చేయాలని తీర్మానం

**కొత్తపట్నం డిసెంబర్ 12. ప్రభాతవార్త**



మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆదిత్యకు బిఎల్ఓ విధులు చేయాలని ఉత్తర్వులు వచ్చినట్లు దానిని నిలుపుదల చేయాలని మండల పరిషత్ తీర్మానిం చిందని అధ్యక్షులు అంజిరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఎంపీపీ అంజిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా అనుమతి లేకుండా ఆర్డిఓ బిఎల్ఓ గా విధులు నిర్వహించాలని ఏ విధంగా ఉత్తర్వులు వచ్చిందని నిలదీశారు. తక్షణమే ఆ ఉత్తర్వులను విరమించుకోవాలని మండలం తీర్మానించిందన్నారు.మొంథా తుఫానుకు 590 టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశామన్నారు 766 ఎకరాలు నష్టం కలిగిందని అంచనా తయారు చేసి జిల్లా కార్యాలయంకు పంపడం జరిగిందన్నారు. 670 ఎకరాలలో ఆక్వా సాగు నష్టానికి గురైందన్నారు. మోటుమాల గ్రామ పంచాయతీ పరిధిలో బీరంగుంటలో దళితుని భూమిలో నారును అధికారులు సరైన చర్య కాదని ఎలాంటి నోటీసులు ఉత్తర్వులు ఇవ్వకుండా ఏ విధంగా చేశారో వారికే అర్థం కావాలని అన్నారు. వివిధ శాఖలపై చర్చలు జరిగాయి కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీకృష్ణ డిప్యూటీ ఎంపీడీవో వేణుగోపాలకృష్ణమూర్తి తాసిల్దార్ కే శాంతి ఎంపీటీసీలు సర్పంచులు అధికారులు పాల్గొన్నారు.

## పేస్ ఎంబీఏ విద్యార్థులకు పారిశ్రామిక పర్యటన


**ఒంగోలు, ప్రభాతవార్త**



స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్నటువంటి ప్రథమ సంవత్సర ఎంబీఏ విద్యార్థులకు పారిశ్రామిక పర్యటనలో భాగంగా చీమకుర్తికి చెందిన జైనీస్ గ్రానైట్స్ ఎక్స్పోర్ట్స్ నందు గ్రానైట్ కటింగ్స్, పాలిషింగ్ మరియు ఎక్స్పోర్ట్స్ సంబంధించిన విషయాలను ప్రత్యక్షంగా వీక్షించి అవగాహన పెంచుకున్నారు ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ శ్రీ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ఇలాంటి పారిశ్రామిక పర్యటన ద్వారా విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ వస్తుందని తెలియజేశారు అలాగే కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, డీన్ ఆఫ్ ఎకాడమిక్స్ డాక్టర్ సి వి సుబ్బారావు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ ఆర్ వీరాంజనేయులు మాట్లాడుతూ ఎంబీఏ విద్యార్థులకు అకాడమిక్స్‌తో పాటు పారిశ్రామిక పర్యటన నాలెడ్జి ఎంతైనా అవసరం ఉందని తెలియజేశారు. ఈ పారిశ్రామిక పర్యటనకు విద్యార్థులతో పాటు ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ మేరీ జోన్స్, ఇన్చార్జ్ డాక్టర్ పుష్పశ్రీ పాల్గొని విజయవంతం చేశారు.

## ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను కలిసిన జిల్లా నూతన గ్రంధాలయ చైర్మన్ సుచిత్ర

**నాగులుప్పలపాడు, డిసెంబర్ 12, ప్రభాతవార్త**



మంగమూరు రోడ్డులో మర్రిచెట్టు దగ్గర సంతనూతలపాడు నియోజకవర్గ శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్‌ని వారి కార్యాలయంలో ప్రకాశం జిల్లా నూతన గ్రంధాలయ చైర్మన్‌గా నియమి తులైన మాజీ ఎంపీపీ కి.శే ముప్పవరపు వీరయ్య చౌదరి సతీమణి ముప్పవరపు సుచిత్ర మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొగాకు సమాఖ్య చైర్మన్ మండవ జయంత్‌బాబు, మండల పార్టీ అధ్యక్షులు తేళ్ళ మనోజ్ కుమార్, నియోజకవర్గ రైతు అధ్యక్షులు ఇంటూరి శ్రీనివాసరావు, మెట్టు సుబ్బయ్య, స్వర్ణ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ

**ఒంగోలు, ప్రభాతవార్త**



మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఒంగోలు శాఖ ఆధ్వర్యంలో ఒంగోలు సంతపేటలోని శివం శరణాలయం కు నిత్యవసర వస్తువులతో పాటు శివం శరణాలయంలోని వృద్ధులకు చలికి ఇబ్బంది పడకుండా దుప్పట్లు పంపిణీ అన్నదానం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ చైర్మన్ మారెళ్ళ సుబ్బారావు మాట్లా డుతూ శివం పౌండేషన్ గత నాలుగు సంవత్సరాల నుంచి ప్రతిరోజు అనాధలకు పేదలకు ఒంగోలు నగరంలో శివం సంచార వాహనం ద్వారా అన్నం పెట్టి కడుపు నింపుతుందని వారికి దాతలు ఆర్థికంగా అండగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుదునగుంట కోటేశ్వరరావు, చెరుకూరి ఆదిలక్ష్మీ, కాకర్లపూడి శ్రీనివాసరావు. కె. కృష్ణారెడ్డి. శ్రీను. ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# వెలిగొండ ప్రాజెక్టుతో వెలుగులు

- 2026 కల్లా పూర్తి చేస్తాం
- పనుల రోజు వారి లక్ష్యాలు పెంచాం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

**పెద్దదోర్నాల, డిసెంబర్ 12, ప్రభాతవార్త**



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులు మీదుగా భూమి పూజ చేసుకున్న వెలిగొండ ప్రాజెక్ట పనులు 2026కి పూర్తి చేయాలని పట్టుదలతో పని చేస్తున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. శుక్రవారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, ప్రాజెక్ట అధికారులు కలిసి పనులను పరిశీలించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టన్నెల్‌లో 18 కి.మీ లోపలి వరకు ప్రయాణించి క్లిష్టమైన లైనింగ్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో కలిసి ప్రాజెక్ట పనులు పురోగతిపై ఇరిగేషన్ అధికారులు, ఏజెన్సీలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్ట పరిధిలో ఇప్పుడు జరుగుతున్న పనులతో పాటు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ వరకు పూర్తి చేయడానికి మరో మూడు నుంచి నాలుగు వేల కోట్లు అవసరమవుతాయని మంత్రి స్పష్టం చేశారు. ఇన్ని పనులు ఉండగా.. ఈ ప్రాజెక్ట పూర్తయిపోయిందని, జగన్‌మోహన్‌రెడ్డి జాతికి అంకితం చేయడం ఎంత విడ్డూరమో ఆలోచించాలన్నారు. రాష్ట్ర చరిత్రలో దగాకి మోసానికి జగన్ బ్రాండ్ అంబాసిడర్‌గా మంత్రి నమ్మల ఎద్దేవ చేశారు. వెలిగొండ ప్రాజెక్ట లో జగన్ చేసిన తప్పిదాలు మోసం, దగా, జిల్లా రైతులకు తెలియజేయాలనే రైతులతో కలిసి సమీక్ష నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చార హెడ్ రెగ్యులేటర్లో 2200 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తి చేశామని ఆయన స్పష్టం చేశారు. 18 నెలల కాలంలోనే టన్నెల్స్‌లో క్లిష్టమైన 3 కి.మీ లైనింగ్ పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం 4 గ్యాంట్రీలతో రోజు 12 మీటర్ల లైనింగ్ పనులు చేస్తుండగా గ్రాంట్రీల సంఖ్యను పెంచి లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయాలని ఏజెన్సీని ఆదేశం చామని ఆయన అన్నారు. ఫీడర్ కెనాల్‌లో 45 వేల క్యూబిక్ మీటర్ల హార్డ్ రాక్ పనులు చేయాల్సి ఉండగా ఇప్పటికే 28 వేల క్యూబిక్ మీటర్లు పనులు పూర్తి చేసినట్లు వివరించారు. ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం 456 కోట్లతో టెండర్లు పక్రియ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ డిసెంబర్‌లోనే పనులు మొదలు పెట్టి, సీజన్ వచ్చే లోపు పూర్తి చేయాలని ఏజెన్సీని ఆదేశించామన్నారు. తీగలేరు కెనాల్‌కు సంబంధించి 600 మీటర్ల టన్నెల్ లైనింగ్ చేసి గేట్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నల్లమల సాగర్ ముంపుతో 9.6 కి.మీ పర్మినెంట్ డైవర్షన్ రోడ్డు నిర్మాణ పనులు మొదలు పెట్టామన్నాడు. మొంథా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న ఫీడర్ కెనాల్ గండ్లు పూడ్చి, జంట సొరంగాల్లో డీవాటరింగ్ పనులను పూర్తి చేసి, లైనింగ్ పనులు కొత్త లక్ష్యాలు నిర్ధేశించి వేగంగా చూస్తున్నామన్నారు. కూటమి హయాంలో పనుల పురోగతి ఇలా ఉండగా వెలిగొండ ప్రాజెక్టుకు ఉత్తుత్తి ప్రారంభం చేసి, జాతికి అంకితం చేసిన జగన్ చరిత్ర హీనుడుగా మిగిలిపోయాడన్నారు. ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా, జగన్ విధ్వంసం చేసిన ఇరిగేషన్ రంగాన్ని చంద్ర బాబు గాడిలో పెట్టారని ఆయన సోదాహరణంగా చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టును ప్రాధాన్యత ప్రాజెక్టుగా గుర్తించి, పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు అనుక్షణం మమ్మల్ని ప్రోత్సహిస్తూ పరుగులు పెట్టిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేకు ముందు నిర్ణయించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా వెలిగొండ ప్రాజెక్ట పనులు పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని మంత్రి రామానాయుడు చెప్పారు. 2026 నాటికి వెలిగొండ పూర్తి చేసి నల్లమల సాగర్‌ను కృష్ణాజలాలతో నింపుతామని ఆయన స్పష్టం చేశారు. మంత్రి నమ్మల రామానాయుడు తో పాటు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, ప్రాజెక్ట అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.








## సర్వేరెడ్డిపాలెంలో ఎన్ఎస్ఎస్ మెగా క్యాంప్ వంద మొక్కలు నాటిన క్విస్ విద్యార్థులు

**ఒంగోలు, ప్రభాతవార్త**

డాక్టర్ ఎన్ ఎస్ కల్యాణ్ చక్రవర్తి ట్రస్ట్ సహకారంతో నిర్వహ స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహణ, యోగ సాధ ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ ఎస్ ఎస్ యూనిట్ 2, డాక్టర్ ఎన్ ఎస్ కల్యాణ్ చక్రవర్తి వికసిత భారత్ ట్రస్ట్ సహకారంతో సర్వేరెడ్డి పాలెంలో మెగా క్యాంప్ నిర్వహిస్తున్నారు. సోమవారం ప్రారంభమైన ఈ క్యాంప్ వారం రోజుల పాటు నిర్వహించనున్నట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి తెలియజేశారు. వారం రోజులు పాటు జరిగే ఈ కార్యక్రమంలో మొదటి రోజు గ్రామంలో సర్వే నిర్వహించి, వివిధ విషయాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. రెండో రోజు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల అవసరాలను తెలుసుకుని వారికి పుస్తకాలు, రాసుకునే అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. మూడో రోజు బుధవారం గ్రామంలోని వివిధ ప్రదేశాల్లో 100 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. శుక్రవారం గ్రామంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించి, స్కూల్ విద్యార్థులకు యోగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో క్విస్ కళాశాల ఎన్ ఎస్ ఎస్ డీన్ డాక్టర్ నవనీత కృష్ణన్, పీవో వేణుగోపాల్, సర్వేరెడ్డి పాలెం గ్రామానికి చెందిన ఎం శ్రీను, సచివాలం డిజిటల్ అసిస్టెంట్ సుధీర్, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ శ్రీనివాస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉజ్వల తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించిన వాసుదేవరావు, అబ్రహం లింకన్

**పామూరు, డిసెంబ్ 12, ప్రభాతవార్త**

పామూరు మండల కేంద్రంలోని బొట్ల గూడూరు గ్రామ రైతు సేవా కేంద్రంలో ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించి పామూరు మండల తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన వరి ధాన్యంను రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి టి.అబ్రహం లింకన్ మాట్లాడుతూ వరి సాధారణ రకాలు కనీస మద్దతు ధర రూ.2369 రూపాయలు, వరి మొదటి రకం 2389 ఈ మద్దతు ధర కన్నా ధర తక్కువగా ఉన్నప్పుడు మాత్రమే బయట మార్కెట్లో విక్రయించుకోవాలని తెలిపారు.

# జీజీహెచ్‌లో మౌలిక సదుపాయాల కల్పన

- జీజీహెచ్‌లో పేషెంట్ల మౌలిక సదుపాయాలు, ఇతర అవసరాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు

**ఒంగోలు, ప్రభాతవార్త**

జీజీహెచ్ ఒంగోలులో పేషెంట్ల మౌలిక సదుపాయాలు, ఇతర అవసరాలను గుర్తించి 5 నుంచి పది కోట్ల రూపాయల విలువైన పనులు త్వరలో ప్రారంభిస్తామని, శానిటేషన్ మెరుగు పడాల్సిన అవసరాన్ని గుర్తించామని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. జీజీహెచ్‌లో పేషెంట్లకు అందుతున్న మౌలిక వసతులు, పారిశుధ్య పరిస్థితులు స్వయంగా పరిశీలించారు. జీజీహెచ్‌లో డ్రైన్, ఇతర సౌకర్యాలను ప్రాంగణం మొత్తం తిరిగి పరిశీలించారు. డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను వారంలో తొలగించాలని, పూర్తి స్థాయిలో పారిశుధ్యం మెరుగుపడాలని, లేదంటే ఏజెన్సీ పై చర్యలు తీసుకుంటామన్నారు. జీజీహెచ్‌లో పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా వైద్య అధికారి, ఏపీఎంఎస్ ఐడీసీ మెడికల్ సూపరింటెండెంట్‌లతో కమిటీ వేశామని, ఆ కమిటీ ఇచ్చిన నివేదిక అంశాలను పరిశీలిచేందుకు జీజీహెచ్‌కు వచ్చామన్నారు. పేషెంట్లు వారి సహాయకులు సేద తీరేందుకు షెడ్డులు నిర్మించాల్సిన అవసరం ఉందన్న కలెక్టర్ పలు ప్రాంతాలను పరిశీలించారు. పాత కోవిడ్ షెడ్‌తో పాటు, ఎమర్జెన్సీ సమీపంలోనూ, నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్ సమీపంలో విశ్రాంతి షెడ్డుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏపీఎంఎస్ ఐడీసీ అధికారులను ఆదేశించారు. అదే విధంగా మార్చురీ వద్ద వేచి ఉండే వారి కోసం కూడా షెడ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని, అన్ని షాప్స్ ఒకే చోట ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నిరూపయోగంగా ఉన్న ప్రదేశాలను గుర్తించి షాప్స్ ఏర్పాటు చేయాలన్నారు. స్పేస్ పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని పార్కింగ్, గ్రీనరీ, ఇతర అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. వీటి సమగ్ర ప్రనాళిక కోసం కన్సల్టెన్సీ సేవలు వినియోగించుకుంటామన్నారు. జిల్లా జీజీహెచ్ లో మంచి వైద్య సేవలు అందుతున్నందున అధికంగా పేషెంట్లు వస్తున్నారని, వారిని దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకోవాలన్నారు. ఓపీ కౌంటర్లు అన్ని ఒకే చోట ఉంటే బాగుంటుంది అన్న అభిప్రాయం వ్యక్తం చేసిన కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రులు అన్ని నిర్లిప్తత రాకుండా కార్పొరేట్ తరహా సేవలు అందించాలని, ఆ మేరకు డిజైన్ ఉండాలన్నారు. డంప్ తరలింపు విషయంలో కార్పొరేషన్, ఏజెన్సీ మధ్య సమన్వయం ఉండాలని, ఈ మేరకు సూపరింటెండెంట్ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరరావు, జిల్లా వైద్య అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ కుమార్, ఏపీఎంసీడీసీ ఈఈ నిర్మల్ కుమార్, సీఎస్ఆర్ఎం డాక్టర్ మాధవీలత, ఏడీ అనిల్ కుమార్‌రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ తిరుపతిరెడ్డి, డాక్టర్ ప్రభాకర్, మెప్మా ప్రాజెక్టు డైరక్టర్ శ్రీహరి, కార్పొరేషన్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.







6_6.qxd 12/13/2025 12:10 AM Page 1



## అరటి రైతులు అధునాతన పద్ధతుల్లో సాగుచేసి లాభాలు పొందాలి

### - సీనియర్ శాస్త్రవేత్త డా. కే. ఉమామహేశ్వరరావు






**సంతమాగులూరు ,డిసెంబర్ 12 ,ప్రభాతవార్త**
అరటి రైతులు అదునాతన పద్ధతుల్లో సాగుచేసి లాభాలు పొందాలి- సీనియర్ శాస్త్రవేత్త డా. కే. ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. సంతమాగులూరు మండలం, తంగేడుమల్లి గ్రామంలో శుక్రవారం అరటి మరియు మిరప పంటల రైతులకు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాపట్ల జీడి మామిడి ఉద్యాన పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డా. కే. ఉమామహేశ్వర రావు జిల్లా ఉద్యాన అధికారి ఖలీమ్ , ఉద్యాన అధికారి మార్టూరు బి. హనుమంత్ నాయక్, గ్రామ సర్పంచ్ మర్లపాట రంగనాథ బాబు, గ్రామ రెవెన్యూ అధికారి రావిరేల వాసు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు. శాస్త్రవేత్త గారు మాట్లాడుతూ అరటి సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలు, పూత మరియు గెలలు ఏర్పడే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. అలానే అరటిలో వచ్చే సిగటోక ఆకుమచ్చ తెగులు కు సంబంధించిన జాగ్రత్తల గురించి వివరించారు. అరటి రైతులకు ఒక హెక్టారుకు రూ.42,000/ సబ్సిడీ రూపంలో ఉద్యానశాఖ ద్వారా అందిస్తున్నామని, అలానే గెలలు ఏర్పడ్డాక రైతులకు ఉద్యాన శాఖ తరపున ఫ్రూట్ కవర్స్ అనే స్కీమ్ ద్వారా రైతులు గెలలకు కవర్లు వేసుకుంటే ఒక హెక్టారుకురూ. 25,000/ సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని తెలియపరిచారు.

## మిర్చి పైరుపై రసాయనికి ఎరువుల వాడకం తగ్గించాలి

### - ఉద్యానవన శాఖ అధికారి బి.హనుమంత్‌నాయక్



**సంతమాగులూరు ,డిసెంబర్ 12, ప్రభాతవార్త**
మిర్చి పైరుపై రసాయనికి ఎరువుల వాడకం తగ్గించాలని మార్టూరు ఉద్యానవన శాఖ అధికారి బి.హనుమంత్ నాయక్ తెలిపారు. రైతులుఅవగాహనా లేమితో విచ్చలవిడిగా యూరియాలాంటి రసాయనిక ఎరువులు వినియోగం, సిఫార్సులకు మించి పురుగు మందుల వాడకం ద్వారా పైరుకు అధిక పెట్టుబడులు కావడం ద్వారా రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. మిరపలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో రైతులకు నల్ల తామర పురుగులు,ముడత (జెమిని వైరస్)లకు సంబంధించి తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియపరచారు.

## వైసీపీ అధినేత జగన్‌ను మార్యాదపూర్వకంగా కలసిన అంజిరెడ్డి, కోటిరెడ్డి



**సంతమాగులూరు, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
తాడేపల్లి వైఎస్ఆర్సీపీ కేంద్ర కార్యాలయం నందు వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని అద్దంకినియోజకవర్గ వైఎస్ఆర్సీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు బండికోటిరెడ్డి ,సంతమాగులూరు మండల వైఎస్ఆర్సీపీ ఐటీ విభాగం అధ్యక్షుడు బండి అంజిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

## ఒకే సారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన ఏల్చూరు యువతి



**సంతమాగులూరు ,డిసెంబర్ 12, ప్రభాతవార్త**
ప్రస్తుత పరిస్థితులలో ప్రభుత్వ ఉద్యోగం చిన్నదైనా, పెద్దదైనా సాదించడం అంత ఆషామాషీ వ్యవహారం కాదు. ఏళ్ల తరబడి పోటీ పరీక్షలకు కోచింగ్‌లు తీసుకుని పదుల సార్లు పరీక్షలకు హాజరయ్యే వారిలో కేవలం పదిశాతం మందికి మాత్రమే ప్రభుత్వ కొలువు దక్కుతుంది. అలాంటిది ఒక యువతి అందులోనూ తెలుగు కుటుంబ మాతృభాష కాని ముస్లిం యువతి ఒకే సారి మూడు ప్రభుత్వ కొలువులకు ఎంపిక కావడం అంటే ఆమె అసాధారణ ప్రతిభ నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన చిన్న బాజీకి ప్రవేటులో చైతన్య కాలేజీ లెక్చరర్ హుందాతనమైన వేతనంతో కొలువుకు ఆహ్వానం వచ్చింది. అదే సమయంలో ప్రభుత్వ విభాగాలలో పంచాయతీ సెక్రటరీగా, పొల్యూషన్ బోర్డులో అనలిస్ట్ గా, పాలిటెక్నిక్ కాలేజీ లెక్చరర్ గా ఒకేసారి ఎంపికైనట్లు ఆహ్వానాలు అందాయి. అసాధారణ ప్రతిభతో ప్రభుత్వ కొలువులకు ఎంపికైన బాజీ గ్రామానికే గర్వకారణం అంటూ యువత అభినందనలతో ముంచెత్తుతుంది.

## గ్రామాల్లో కంది పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు



**దర్శి, డిసెంబర్ 12,ప్రభాతవార్త**
ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గుంటూరు అపరాల ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మోహన్‌రెడ్డి, శాస్త్రవేత్తల బృందం డాక్టర్ సాంబ శివరావు, ప్రధాన శాస్త్రవేత్త (కీటక), శివారెడ్డి, ప్రధాన శాస్త్రవేత (బ్రీడర్) ప్రకాశంజిల్లాలోని దర్శి, ముండ్లమూరు, పసుపుగల్లు, తిమ్మాయపాలెం, చలివేంద్రం, బోధనంపాడు, అబ్బాయిపాలెం గ్రామాలలో పర్యటించారు. జిల్లా వ్యాప్తంగా కంది సాగు ఖరీఫ్ కింద సాధారణ విస్తీర్ణం సాగైనట్లు కేవీకే కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ జి.రమేష్ శాస్త్రవేత్తల బృందానికి వివరించారు. పర్యటించిన గ్రామాలలో సాగైన కంది ప్రస్తుతం పూత, పిందె దశలో ఉన్నట్లు అపరాల ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మోహన్‌రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ జి.రమేష్, డాక్టర్ టి.వెంకటేశ్వరరెడ్డి, శాస్త్రవేత్త, రైతులు పాల్గొన్నారు.

## ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ని తనిఖీ చేసిన జిల్లా పంచాయతీ అధికారి

### - జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు



**దర్శి, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
దర్శి మండలంలోని పోతవరం గ్రామ పంచాయతీలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ని శుక్రవారం తనిఖీ చేయడం జరిగింది. అదే విధంగా జల సురక్ష మాసం కార్యక్రమంలో భాగంగా తానంచింతల గ్రామ పంచాయతీలో వాటర్ ట్యాంక్ నీటిని పర్యవేక్షించడం జరిగింది. తానంచింతల స్కూల్లోని మిడ్డేమిల్స్ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా జిల్లా పంచాయతీ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరావు, దర్శి మండల ఎంపీడీవో కల్పన, డిప్యూటీ ఎంపీడీవో ఆవుల సుధాకర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# వృద్ధాశ్రమంలో అన్నదానం



**దర్శి, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
దర్శి పొదిలి రోడ్డు కరెంటు ఆఫీసు వెనుక బజార్ వాస్తవ్యులు కల్లూరి ఆదిలక్ష్మీ నాలుగో వర్ధంతి సందర్భంగా దర్శి శ్రీషిర్డీ సాయిబాబా వృద్ధల ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం, పండ్లు, మిఠాయిలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం నిర్వహించిన వారు వారి భర్త కల్లూరి వెంకటేశ్వర్లు కుమారుడు నాగేశ్వరావు కోడలు అనూష చిన్న కుమారుడు కల్లూరి నరేష్ మనవళ్లు మనువరాలు వారి చెల్లెలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులను పరిశీలించిన ఎంపిడివో



**పొన్నలూరు, డిసెంబర్ 12,ప్రభాతవార్త**
మండలంలోని చౌటపాలెం గ్రామంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులను ఎంపిడివో పి.సుజాత శుక్రవారం పరిశీలించారు. పండ్ల తోటలు పెంపకం కింద గ్రామ రైతు కల్లూరి మాలకొండయ్య చేపట్టిన నిమ్మ మొక్కలను పరిశీలించారు. ఈ పథకం కింద మూడు సంవత్సరాల వరకు ప్రభుత్వం వివిధ పనుల కింద నగదు అందజేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరొక రైతు ఉన్నం లక్ష్మి నరసింహం నిర్మించుకుంటున్న పశువులు షెడ్ ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలోని పనులు రైతులకు ఉపయోగకరంగా ఉన్నవని రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణ, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## పంట నష్టపరిచే తామర పురుగు నియంత్రణపై రైతులకు అవగాహన

### - పంట తెగుళ్ళపై రైతులకు పలు సూచనలు చేసిన డివిజన్ హార్టికల్చర్ అధికారి ఆదిరెడ్డి



**పుల్లలచెరువు, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
మండలంలోని కొమరోలు, రంగన్నపాలెం, చాపలమడుగు, ముటుకుల సతకోడు గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న మిరప, ఉద్యాన పంటలనుయర్రగొండపాలెండివిజన్ హార్టికల్చర్ అధికారి ఆదిరెడ్డి పరిశీలించారు. వ్యవసాయ, ఉద్యానశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఉద్యాన శాఖ కమీషనర్ ఆదేశాలతో తామరపురుగు, తెల్లదోమ, సం పీల్చు పురుగుల నియంత్రణ పద్ధతులను గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి మాట్లాడుతూ మిరప పంటలో మిరప పంట చుట్టూ జొన్న లేదా సజ్జ వంటి రక్షణ పంటలను 3-4 వరుసలుగా వేసుకుంటే తామర పురుగు ఉదృతి తగ్గుతుందని పంట పొలంలో పసుపు, నీలిరంగు, స్టిక్కీ అట్టలు ఎకరానికి 30-40 చొప్పన పంటకు ఎత్తులో ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్తగా మిరప సాగు చేసిన రైతులు ఫ్రిపోనిల్ గుళికలను ఎకరానికి 8 కిలోల చొప్పున చల్లుకోవడం ద్వారా 45 రోజులు వరకు తామర పురుగును అరికట్టవచ్చని పేర్కొన్నారు. బవేరియా బాసియానా లేదా వర్టిసీలియంను లీటర్ నీటికి 5 గ్రాములు చొప్పున కలిపి 5 రోజుల వ్యవధిలో 4 సార్లు పిచికారి చేస్తే తామర పురుగును తగ్గించుకోవచ్చని వివరించారు. 10,000 పీపీఎం వేపనూనెను 2 మిల్లీ లీటర్లు పురుగు మందుతో కలిపి పిచికారి చేస్తే మిరప పంటలో పురుగుల ప్రబలత తగ్గుతుందని సూచించారు. మండల వ్యాప్తంగా తామరపురుగు నియంత్రణపై రైతులకు అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు నాయక్, ఆయా గ్రామాల వీఏఏలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెడికల్ కాలేజీలను మూడు పీపీ విధానాలంటూ పేదవానికి శఠగోపురం పెడుతున్నాడు

### - సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ



**యర్రగొండపాలెం, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
యర్రగొండపాలెంమెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయుటకు నిరసనగా ఈనెల 18న జరగబోయే నిరసన ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్‌నారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం యర్రగొండపాలెం సీపీఐ పార్టీ కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ సమితి కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవండ్ల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయటం చాలా దుర్మార్గమైన చర్య అని , ఈ చర్యకు వ్యతిరేకంగా 18వ తేదీ మార్కాపురం మెడికల్ కాలేజీ ఎదురుగా పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపడుతున్నామని, ఆ కార్యక్రమానికి యావన్మంది ప్రజానీకం, ప్రజా సంఘాలు, అభ్యుదయ వాదులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటు పరం చేయడం అన్యాయంగా మేము భావిస్తున్నాము. పేదవానికి వైద్య, విద్య దూరం చేయడం, పేదవానికి సరైన వైద్యం అందకుండా చేయాలని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మూడు పీపీలు పెట్టి పేదవానికి శఠగోపురం పెడుతున్నాడని ఆయన అన్నారు. మార్కాపురంలో గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కాలేజీ పెట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడం మానుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ సమావేశంలో నియోజకవర్గ కార్యదర్శి బాణాలరామయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేవీ కృష్ణ గౌడ్, మండల కార్యదర్శి మన్నె సాంబశివరావు, దాసరి మల్లిఖార్జున, గుంటూరు శ్రీను, నక్కా తిరుపతయ్య, జిల్లా అధ్యక్షులు పూర్ణ కంటి తిరుమలయ్య, నియోజకవర్గ కౌన్సిల్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాలు ఆకస్మిక తనిఖీ

**వెలిగండ్ల, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
వెలిగండ్ల మండలంలో జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఇంటర్నల్ స్క్వోర్డ్ అయిన దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు బాలాజీ నాయక్ ఎరువులు దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆకస్మిక తనిఖీ చేసి వివిధ రకాలైన ఎరువులు అమ్మకాలు నిలుపుదల చేశారు. లైసెన్స్‌కి ఫారంఓ పొందు పరచకపోవడం వల్ల ఈ అమ్మకాలు నిలుపుదల చేసినట్లు తెలిపారు. నిలుపుదల చేసిన ఎరువులు పరిమాణం దాదాపు 8.2 టన్నులు ఉంటుందని వాటి విలువ 2,19,760 ఉంటుందని తెలిపారు. సహాయ వ్యవసాయ సంచాలకులు మాట్లాడుతూ ఎమ్మార్పీకి మించి ఎరువులు విక్రయించినట్లయితే దుకాణదారులకి చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల వ్యవసాయాధికారిణి తమ్మినేని శిల్ప మాట్లాడుతూ ఎరువులు కొన్న ప్రతి రైతుకు విధిగా రైతులకు బిల్లు ఇవ్వాల్సిందిగా సూచించారు. అదే విధంగా ప్రతి రైతు తప్పనిసరిగా ఎరువులు, కొనుగోలు చేసిన తర్వాత బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు.

## మృతుల కుటుంబాలకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సాయం




**దర్శి, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
దర్శి పట్టణం క్రిస్టియన్‌పాలెంకు చెందిన నిరుపేద అయిన జిజ్జారపు ప్రభుదాస్ ఇటీవల మరణించాడు. చందలూరు గ్రామానికి చెందిన తోట నరసింహారావు రెండు రోజుల క్రితం కామెర్ల వ్యాధితో గుంటూరులో ఆసుపత్రి నందు మరణించాడు. అతని కుటుంబం అతి పేదరికంలో ఉంది. దర్శి పట్టణంలోని అద్దంకి రోడ్డు నందు నివసించే నిరుపేదరాలైన జక్కా తిరుమలమ్మ టీబీ వ్యాధితో బాధపడుతుంది. వీరి సమస్యలు దర్శి మానవత సేవా సంస్థ దృష్టికి రావడంతో సంస్థ ప్రతినిధులు స్పందించి వారికి ఆత్మీయ సహకారం ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున ముగ్గురికి రూ.15వేలు చెక్కుల రూపంలో శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ దేవతి వరప్రసాద్, కన్వీనర్ ధనిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కపురం శ్రీనివాసరెడ్డి, అధ్యక్షులు చీదెళ్ళ బసవయ్య, కార్యదర్శి గొర్రెపాటి వేణు, డైరక్టర్స్ ఎస్‌కే ఖాదర్ మస్తాన్, పి.పెద్దిరాజు, రామకోటిరెడ్డి, సభ్యులు సంగు కొండలు, కొల్లా గురువార్జునరావు, ఆర్.నారాయణ, ఉపాధ్యాయులు రామాంజనేయులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించిన సీఐ రామారావు



**దర్శి, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
దర్శి టౌన్‌లో రోడ్డు ప్రమాదాలపై రోడ్డు సేప్టి వారియర్స్‌తో కలిసి ప్రజలకు అవగాహనకల్పించిన దర్శి సీఐ వై.రామారావు దర్శి టౌన్‌లో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా దర్శి సీఐ రామారావు, దర్శి ఎస్సై మురళి అలాగే రోడ్డు సేప్టీ వారియర్స్‌తో కలిసి దర్శి పట్టణంలోని పొదిలి రోడ్డులో ఉన్న షాపుల వారికి అలాగే రోడ్డు మీద ప్రయాణిస్తున్న వాహనదారులకు హెల్మెట్ వాడకం గురించి అవగాహన కల్పిస్తూ ప్రతి షాపు వారికి కూడా ఆ షాపులకు వచ్చేటువంటి కస్టమర్లకు అవగాహన వచ్చే విధంగా వారి షాపులలోహెల్మెట్ వాడకం గురించి స్టిక్కర్లు గాని, ఫ్లెక్సీలు గాని ఈ సందర్భంగా దర్శి సీఐ రామారావు మాట్లాడుతూ అందువల్ల వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని తెలియజేశారు.

### హెల్మెట్ ధరించిన వాహనదారులకి స్వీట్లు పంపిణీ చేసిన సీఐ రామారావు, ఎస్సై మురళి




**దర్శి, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
దర్శి గడియారస్తంభం సెంటర్లో శుక్రవారం సాయంత్రం హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతున్న వాహనదారులకి స్వీట్లను పంపిణీ చేసిన దర్శి సీఐ వై.రామారావు, ఎస్సై ఎం.మురళి పోలీసు శాఖతో పాటు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు కూడా హెల్మెట్ ధరించిన వాహనదారులకి స్వీట్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీఐ వై.రామారావు మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్న వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకుని వాహనాలు నడపాలని అన్నారు. అదే విధంగా ఎస్సై ఎం.మురళి మాట్లాడుతూ 18 సంవత్సరాలు లోపు విద్యార్థులు పిల్లలు వాహనాలు నడపకూడదని అలా వాహనాలు నడిపితే వారిపై అపరాధ రుసుము విధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ సేవల్లో పారదర్శకత తప్పనిసరి

### - సింగరాయకొండ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జిల్లా రిజిస్టర్ ఆకస్మిక తనిఖీ




**సింగరాయకొండ, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
రిజిస్ట్రేషన్ సేవల్లో పారదర్శకతను తప్పనిసరిగా పాటించాలని జిల్లా సబ్ రిజిస్టర్ బాలంజనేయులు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన సింగరాయకొండ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై ఆకస్మిక తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమల్లోకి తీసుకోని వచ్చిన స్లాట్ బుకింగ్ విధానం అమలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత, సేవల నాణ్యతపై ఆయన ప్రజలతో నేరుగా మాట్లాడారు. ఎవరికైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా, సిబ్బంది ప్రవర్తనశైలి, అవినీతి కి పాల్పడుతున్నారా వంటి అంశాలను గురించి ప్రజలును అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్‌రిజిస్ట్రార్ జాపర్‌తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గిట్టుబాటు ధర కల్పనే ప్రభుత్వ ధ్యేయం



**తాళ్లూరు, డిసెంబరు 12,ప్రభాతవార్త**
రైతులుపండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పనే ప్రభుత్వ ధ్యేయమని తహసీల్దార్ బచ్చల వెంకట రమణారావు అన్నారు. ఇందుకోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. శుక్రవారం తాళ్లూరు రైతు సేవా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ నాగంబొట్లపాలెం, మన్నేపల్లి సొసైటీల ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సొసైటీల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం రైతన్నా మీ కోసం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.ప్రసాదురావు, మన్నేపల్లి సొసైటీ అధ్యక్షుడు గొంది రమణారెడ్డి (సమర), హౌసింగ్ ఏఈ హనుమంతరావు, ఏపీఓ వెంకటేశ్వర్లు, ఏపీఎం దేవరాజు, వీఏఏ సాయి, రైతులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కరపత్రం ఆవిష్కరణ



**తాళ్లూరు,డిసెంబర్ 12,ప్రభాతవార్త**
మండలం లోని బొద్దికూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 20002001 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు 2026 జనవరి 6తేదీన పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు విజయవాడ లో ఏపీ ఆర్టీసీ కార్యాలయంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు కరపత్రాలను ఆవిష్కరించారు. బృందం వర్ధమాన విద్యార్థులకోసం వివిధ రకాల పోటీలు నిర్వహించి వారిలో సృజన వెలికి తీయడం, ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించేలా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం, ఆ బృందం నిర్వహిస్తున్న పలు రకాల కాంపిటేషన్స్ కు సంబంధించిన వివరాలు పొందుపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టాలెంట్ టెస్ట్ వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగి సృజనాత్మకత వెలికితీయటానికి ఎప్పటికప్పుడు ఆలోచనా విధానంపెంపొందించుకుంటారన్నారు. తాళ్లూరు, దర్శి ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు 10 పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రతి స్కూల్లో జనవరి ఆరో తేదీ సంక్రాంతి అంశంగా స్టోరీ టెల్లింగ్ కథలు చెప్పడం, పాడుతావా తీయగా (సంక్రాంతి పాటలు, జానపద), చిత్ర లేఖనం గ్రామీణ సంక్రాంతి పై బొమ్మల గీద్దాం, వక్తృత్వం సంక్రాంతి పై మాట్లాడదాం, క్విజ్ ఆచారాలు పండుగలుపై, ఆంగ్ల పదము లేకుండా రెండు నిమిషాల పాటు తెలుగులో సంక్రాంతి గురించి మాట్లాడటం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు, నాటి ఉపాధ్యాయులు సన్నపురెడ్డి అంజిరెడ్డి తెలిపారు. 5వ తేదీ తాళ్లూరు దర్శి మండలాల్లో ఉన్న హై స్కూల్ పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు 100 మార్కులకు ఆబ్జెక్టివ్ ప్రశ్నలతో పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. వీటన్నిటిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పది కన్సోలేషన్ బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేస్తున్నట్లు అంజిరెడ్డి తెలిపారు. పదవ తరగతి విద్యార్థులకు మాత్రమే నిర్వహించే టాలెంట్ టెస్ట్ విజేతలకు మాత్రం నగదు బహుమతి ఉంటుందని తెలిపారు. బొద్దికూరపాడు హైస్కూల్ 200001 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సంఘాలవారు జనవరి 12వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఆ రోజే విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## వైఎస్సార్సీపీ మీడియా ప్యానలిస్ట్‌గా బొట్లా రామారావు



**సింగరాయకొండ, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
వైఎస్సార్సీపీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రస్థాయి మీడియా ప్రతినిధి (మీడియా ప్యానలిస్ట్)గా బొట్లా రామారావును నియమించారు. వైఎస్సార్సీపీరాష్ట్రకార్యదర్శిగా, దర్శిమరియు సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకుడిగా చురుకుగా పని చేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించిన రామారావుకు పార్టీ మరో ముఖ్యమైన బాధ్యతను అప్పగించింది. ఈ సందర్భంగా బొట్లా రామారావు మాట్లాడుతూ నాపై నమ్మకంతో జగనన్న అప్పగించిన బాధ్యతలను శక్తివంచనలేకుండా నిర్వర్తిస్తాను. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేయడం నా ఏకైక లక్ష్యం" అని తెలిపారు. అలాగే తన నియామకంలో సహకరించిన

## అటల్ మోదీ సుపరిపాలన యాత్రను విజయవంతం చేయండి

### - బిజెపి మండల అధ్యక్షులు నరసింహారెడ్డి



**సంతమాగులూరు ,డిసెంబర్ 12 ,ప్రభాతవార్త**
ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాలనలో దేశ ప్రగతిని చాటుతూ సాగుతున్న ఆంధ్ర రాష్ట్ర బస్సు యాత్ర ఈనెల 16న బాపట్ల కు చేరుకుంటుందని ఈ కార్యక్రమంలో మండలంలోని కూటమి నేతలు నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు దేవరపల్లి నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. పుట్టవారిపాలెం కూడలిలో శుక్రవారం ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో బిజెపి నాయకులతో కలసి ఆయన మాట్లాడారు. దేశానికి రాష్ట్రానికి సుపరిపాలనందిస్తున్న ఏకైక ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అని నరసింహారెడ్డి తెలిపారు. బిజెపితో జతకట్టి రాష్ట్రంలో సాగుతున్న కూటమి పాలనలో అభివృద్ధి డబల్ ఇంజన్ రైలులా దూసుకుపోతుందన్నారు. అందులో భాగంగా సాగుతున్న అటల్ మోదీ సుపరిపాలన యాత్రను విజయవంతం చేసేందుకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో అద్దంకి నియోజకవర్గంలో సంతమాగులూరు మండలంలో బిజెపిని పటిష్టం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా బస్సు యాత్ర గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షా కార్యదర్శులు నరసింహారెడ్డి, సిరిపురపు వెంకట్ రెడ్డి, అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త వేములూరి పోలిశెట్టి, మండల అధికార ప్రతినిధి మక్కెన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మోటార్ బైకును ఢీ కొట్టిన లారీ - వ్యక్తి మృతి



**సంతమాగులూరు,డిసెంబర్ 12, ప్రభాతవార్త**
అద్దంకి- నారెకట్‌పల్లి రహదారిలో సంతమాగులూరు మండలం ఏల్చూరు వదనద శుక్రవారం మోటార్ బైకును లారీ ఢీకొన్న ఘటనలో బైకు పై వెళుతున్న ఏల్చూరు గ్రామానికి చెందిన కొండి లక్ష్మీ వెంకట ఆంజనేయులు(19) మృత్యువాత బడ్డాడు. వివరాలలోకి వెళితే ఏల్చూరు నరగామానికి చెందిన మృతుడు కొండి లక్ష్మీ వెంకట ఆంజనేయులుతన బైకుపై రోడ్డు దాటుతుండగా అద్దంకి వైపు నుండి వసునతన్న లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుని నరసరావుపేట వైద్యశాలకు తరలిస్తుండగా మారనగ మద్యంలో మృతి చెందాడు. బాదితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సంతమాగులూరు ఎస్సై మేదరిమెట్ల పట్టాభిరామయ్య తెలిపారు. కాగా మృతుని తండ్రి సుబ్బారావు కూడా ఇటీవలే మృతి చెందడం ఇంతలోనే ప్రమాదం రూపంలో యువకుడు మృతి చెందడంతో గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి.

## భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగా ఎరువులు



**ముండ్లమూరు, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
మండలంలోని వేములబండ గ్రామంలో ఆత్మ(వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ) ప్రకాశం జిల్లా వారి సౌజన్యంతో ముండ్లమూరు వ్యవసాయశాఖ వారి సహకారంతో వరి పంటలో రైతులు భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగా ఎరువులు అందించే విధానం పై ప్రదర్శన క్షేత్రాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయాధికారి ఏ.తిరుమల రావు మాట్లాడుతూ వరి పంటలో ఆఖరి దమ్ములో జింక్ సల్ఫేట్‌ను వేసుకుని కలియదున్నడం వలన జింక్ లోపాలు రాకుండా అరికట్టవచ్చన్నారు. అలాగే అద్దంకి ఆత్మ అధికారి పి.శేషారావు మాట్లాడారు. అలాగే అద్దంకి ఆత్మ అధికారి కోట రామిరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సహాయకురాలు బాజీ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## కొనకనమిట్ల పోలీసుస్టేషన్ తనిఖీ చేసిన దర్శి డీఎస్పీ



**కొనకనమిట్ల, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
కొనకనమిట్ల పోలీసు స్టేషన్‌ను దర్శి డీఎస్పీ బి.లక్ష్మీ నారాయణ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదుదారులకు జవాబుదారితనంగా ఉండాలని, పెండింగ్ కేసులుగా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగాపోలీసుస్టేషన్‌ను సందర్శించి తనిఖీ నిర్వహించారు. వివిధ రికార్డులను నిశితంగా పరిశీలించారు. శాంతి భద్రతలకు ఎటువటి ఆటంకాలు కలగకుండా ఉండాలని, పెండింగ్ కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ప్రజల మన్ననలు పొందాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీలో పొదిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, ఎస్సై శ్రీకాంత్, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల మధ్యాహ్న భోజనం పథకం తనిఖీ



**కొనకనమిట్ల, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
మండలం కాట్రగుంట ఏప పాఠశాలను ఎంపీడీవో డి.ఈశ్వరమ్మ శుక్రవారం తనిఖీ నిర్వహించారు. విద్యార్థుల హాజరు పట్టికను, వివిధ రికార్డులను పరిశీలించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి అన్నం,కూరలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలు అన్నం తినేచోట పరిశుభ్రంగా ఉంచాలని,పిల్లలకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం మెనూ అందించాలని తెలియజేశారు.పిల్లలతో కలిసి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు నాసా కిట్స్ పంపిణీ చేసిన

## మండల విద్యాశాఖాధికారి వస్త్రం నాయక్



**మార్టూరు, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
మార్టూరు గ్రామం నందు గల శ్రీ చైతన్య స్కూల్ నందు శుక్రవారం ప్రతిష్టాత్మకంగా నేషనల్ స్పేస్ సొసైటీ వారు, నాసా అమెరికన్ రీసెర్చ్ సెంటర్ వారు సంయుక్తంగా నిర్వహించు ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్ నందు పాల్గొనుచున్న విద్యార్థులకు నాసా కిట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించబడిందని పాఠశాల ప్రిన్సిపాల్ కే.సంపత్ కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మార్టూరు మండల విద్యాశాఖాధికారి ఎంసీహెచ్ వస్త్రం నాయక్ విద్యార్థులకు నాసా కిట్స్‌ను పంపిణీ చేసి వారిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇలాంటి పోటీలలో పాల్గొనడం వలన విద్యార్థుల్లో అంతరిక్ష పరిశోధనలో ఆసక్తి పెరుగుతుందని తద్వారా విద్యార్థులలో అంతరిక్ష సాంకేతికతపై అవగాహన, ప్రయోగాత్మక విద్య అభివృద్ధి చెందుతుందని, గ్రామీణ విద్యార్థులు ప్రపంచ స్థాయి విద్యను పొందడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలియజేశారు. ఈ పోటీలలో పాల్గొనుచున్న విద్యార్థులను శ్రీ చైతన్య పాఠశాల ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య, ఆర్ఐ జి.అప్పాజీ, అకడమిక్ కోఆర్డినేటర్ కే.శ్రీనివాసరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏవో ఏలూరి శేషగిరిరావు, అకడమిక్ డీన్ పి.కార్తీక్, సీ బ్యాచ్ ఇన్‌చార్జి రాజ్యలక్ష్మీ, ప్రైమరీ, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జిలు గీత, సునీత, ఎలీషా, నాగార్జున, పాఠశాల సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### కారంచేడులో 14న ఉచిత మెగా కంటి వైద్యశిబిరం విజయవంతం చేయండి

**- తిరుమలశెట్టి శ్రీహరి**

**మార్టూరు, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
కారంచేడు గ్రామంలోని యార్లగడ్డ కళ్యాణ మండపంలో ఈనెల 14వ తేదీన ఆదివారం జరిగే ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తిరుమలశెట్టి శ్రీహరి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారధ్యంలో నోవో అగ్రిగ్రూప్-గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో కారంచేడులోని యార్లగడ్డ కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తిరుమలశెట్టి శ్రీహరి ప్రజలకు పిలుపునిచ్చారు. శిబిరంలో కంటి పరీక్షలు, అవసరమైన చికిత్సలు, శస్త్ర చికిత్సలు సంబంధించి వైద్యుల సూచనలు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలు, పరిసర ప్రాంతాల వాసులు పెద్ద ఎత్తున హాజరై ఈ వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ప్రతి సమస్యను పరిష్కరిస్తాం

**- అభివృద్ధి సంక్షేమానికి ప్రాధాన్యం**

**- 24 గంటలు అందుబాటులో క్యాంపు కార్యాలయం**

**- అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే ఏలూరి**



**మార్టూరు, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
ప్రజల ప్రతి సమస్యను పరిష్కరించడమే తమ బాధ్యతని ప్రతి సమస్యను వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని, 24 గంటలు తన కార్యాలయం అందుబాటులో ఉంటుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజల సమస్యలను ఓపికగా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ది పథంలో ముందుకు నడిపిస్తామని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటికే సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే ఏలూరి వెల్లడించారు. సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు, రహదారులు, విద్యుత్, సాగునీరు, ప్రతి విభాగంలో స్పష్టమైన కార్యచరణ తయారు చేస్తున్నామన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కారం చూపడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని చర్యలు తీసుకునే విధంగానే ప్రజా దర్బార్ కొనసాగుతుందని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. ప్రజలు ఎప్పుడైనా క్యాంపు కార్యాలయంలో అర్జీలు నేరుగా ఇవ్వవచ్చునని వెంటనే సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్దే ధ్యేయంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్నారు.

### హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో సురేష్‌బాబు



**సంతనూతలపాడు, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
సంతనూతలపాడు హైస్కూల్లో శుక్రవారం ఎంపీడీవో డి.సురేష్‌బాబు మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనంను ఆయన పరిశీలించారు. విద్యార్థులతో కలిసి క్యూలో ఉండి, భోజనాన్ని తీసుకుని వారితో సహపంక్తి భోజనంచేశారు.తరగతి గదులు మరమ్మత్తులు చేయాలని ప్రహరిగోడ ఏర్పాటు చేయాలని, క్లాస్ రూమ్స్ కొత్తగా నాలుగు ఏర్పాటు చేయాలని హెచ్ఎం ఎం.ప్రమోద ఈ సందర్భంగా ఎంపీడీవో సురేష్‌బాబుకు తెలియజేశారు. ఇటీవల సంతనూతలపాడు హైస్కూల్‌కు విచ్చేసిన ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్‌కు హెచ్ఎం ప్రమోద, ఉపాధ్యాయులు, ఆయా సమస్యలపై వివరించారు. ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు మేరకు ఈ నెలాఖరులోగా వీటికి 60 లక్షల రూపాయలు మంజూరు చేయించనున్నట్లు వారికి హామీని ఇచ్చారు. మధ్యాహ్న భోజనం పట్ల ఎంపీడీవో సురేష్‌బాబు సంతృప్తి వ్యక్తం చేశారు.

## ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహణ



**మార్టూరు, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
మార్టూరు మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓ- ఎంసీహెచ్ వస్త్రం నాయక్ ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఈఓలు మాట్లాడుతూ ప్రాథమిక విద్యార్థులలో విద్యా ప్రమాణాలను పెంపొందించడానికి ప్రభుత్వం నిర్ణయించిన 75 రోజుల జీఎఫ్ఎల్ఎన్ (గ్యారెంటెడ్ ఫండమెంటల్ లెర్నింగ్ అండ్ న్యూమరసి) కార్యక్రమాన్ని ప్రతి రోజు అన్ని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు నిర్వహించాలని, అదే విధంగా పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత నూరు శాతం సాధించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 100 రోజుల ప్రణాళికను కూడా ఖచ్చితంగా ప్రతి ఉన్నత పాఠశాలలో అమలు చేసి, ప్రతి రోజు స్లిప్ టెస్ట్‌లో నిర్వహించి, సంబంధిత ఫలితాలను నమోదు చేసి రికార్డులు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలో నిర్వహించాల్సిన రికార్డులు అన్ని సక్రమంగా అప్డేట్‌గా నిర్వహించాలని, మధ్యాహ్న భోజనం విషయంలో కూడా తగు జాగ్రత్తలు తీసుకుని ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 కే.ప్రేమలత, మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్‌కు 25 అర్జీలు



**సంతనూతలపాడు, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
ఒంగోలులోని సంతనూతలపాడు శాసన సభ్యులు బీఎన్.విజయ్‌కుమార్ కార్యాలయంలో శుక్రవారం నాడు జరిగిన ప్రజా దర్బార్‌కు నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజల నుండి వివిధ సమస్యలకు సంబంధించి 25 అర్జీలు వచ్చాయి. సంతనూతలపాడు, చీమకుర్తి, నాగులుప్పలపాడు, మద్దిపాడు మండలాల నుండి ప్రజలు తమతమ సమస్యలపై ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు వివరించి అర్జీలను అందజేశారు. ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణ అనుమతులు, రేషన్ కార్డులు, నూతన పెనషన్లు తదితర వాటికి అధికంగా అర్జీలు వచ్చాయి. ఆయా అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించనున్నట్లు సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని పలువురు ప్రజలు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచితంగా బ్యూటిషియన్‌పై శిక్షణ

**సంతనూతలపాడు, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం ఎండ్లూరు డొంక పరిదిలోని జిల్లా మహిళా ప్రాంగణంలో నిరుద్యోగ మహిలలకు ఉచితంగా బ్యూటీషియన్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు మహిళా ప్రాంగణ జిల్లా మేనేజర్ కే.మాధవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుండి 45 సంవత్సరాలు లోపు గల నిరుద్యోగ మహిళలు ఈ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగపరుచుకోవాల్సిందిగా ఆమె కోరారు. వివరాల కొరకు మొబైల్ నెంబర్లు 6302733492, 9000850869లను సంప్రదించాల్సిందిగా జిల్లా మహిళా ప్రాంగణ మేనేజర్ మాధవి కోరారు.

### సంతనూతలపాడు 2వ సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో, సురేష్‌బాబు



**సంతనూతలపాడు, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
సంతనూతలపాడులోని ఎండవ సచివాలయాన్ని శుక్రవారం నాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ అటెండెన్స్ పరిశీలించి కౌశలం, సిటిజన్స్ ఈకేవైసీ డోర్ టూ డోర్ మనమిత్ర యాపలకు సంబంధించి సర్వేల పనితీరుపై సచివాలయం సిబ్బందిని ఎంపీడీవో సురేష్‌బాబు ప్రశ్నించారు. పనులను పెండింగ్ లేకుండా స్పీడ్‌అప్ చేయాలన్నారు. విధులు పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో సురేష్‌బాబు వారిని హెచ్చరించారు.

## కొమరోలు పడిదప్ప చెరువును పరిశీలించిన

### జిల్లా నీటి యాజమాన్య సంస్థ పిడి జి జోసెఫ్ కుమార్



**కొమరోలు, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
కొమరోలులోని పడిదప్ప చెరువును జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి జోసఫ్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. పడిదప్ప చెరువు కట్టను బలోపేతం చేయడంతోపాటు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ సమావేశం హాలులో ఎంజీఎన్ఆర్ఇజీఎస్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కొమరోలు గ్రామపంచాయతీలోని అంచల కోటేశ్వరమ్మ ఇంటి ఆవరణలో నిర్మాణం జరుగుతున్న పశువుల పాకను పరిశీలించి లబ్ధిదారునికి, సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సానికొమ్ము స్నత్య, ఏపీఓ ఆర్ మహాలక్ష్మి, ఈసీ రంగారెడ్డి, కోర్సు డైరెక్టర్ కె హరికృష్ణ, ఎంజీఎన్ఆర్ సిబ్బంది, కొమరోలు సొసైటీ అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మార్కాపురంలో దొనకొండ, కురిచేడు మండలాలను జిల్లాలో చేర్చాలి

**- ప్రజా సంఘాల నిరసన**





**మార్కాపురం, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
మార్కాపురానికి అతి సమీపంలో ఉన్న దొనకొండ మరియు కురిచేడు మండలాలను కొత్తగా ఏర్పాటు చేస్తున్న మార్కాపురం జిల్లాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రజా సంఘాలు, ఎమ్మార్పీఎస్, రైల్వే యూనియన్ నాయకులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నేతలు మాట్లాడుతూ దొనకొండ-కురిచేడు ప్రాంతాలు మార్కాపురంతో భౌగోళికంగా అత్యంత సమీపంలో ఉన్నాయి. మా ప్రాంత అభివృద్ధి దృష్ట్యా ఈ రెండు మండలాలను మార్కాపురం జిల్లాలో కలపడం అత్యవసరం. ప్రభుత్వం మా డిమాండ్‌ను వెంటనే గుర్తించాలి. లేనిపక్షంలో ప్రజల మద్దతుతో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. అనంతరం వారు సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఏవోకు వినతి పత్రాన్ని అందజేశారు.

### చిన్నగానిపల్లి గ్రామంలో పశువులకు మినరల్ మిక్సర్ పంపిణీ



**రాచర్ల, డిసెంబరు 12 ప్రభాతవార్త**
రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ ద్వారా గోకుల్ మిషన్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం వారు మండలంలోని చిన్నగానిపల్లి గ్రామంలో పశువులకు మినరల్ మిక్సర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గిద్దలూరు పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ బాలునాయక్ మాట్లాడుతూ గేదెలు ఆవుల్లో వచ్చే ప్రత్యుత్పత్తి సమస్యలు ఎదకురాని పశువులను పరిశీలించి పశుపోషకులకు అవసరమైన మందులను మినరల్ మిక్సర్ ప్యాకెట్లను అందజేశారు. గొడ్డు మోతు పశువులను ఎదకు వచ్చేలా చేసి చూలు కట్టేందుకు కృత్రిమ గర్భధారణ ప్రక్రియ ద్వారా చేసి అవగాహన కల్పించారు సీజనల్గా వచ్చే వ్యాధుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకుంటూ వెంటనే చికిత్సలు చేయించుకోవాలని సూచించారు ప్రస్తుతం 50 గేదెలు 25 ఎద్దులు 35 లకు చికిత్సలు చేసి వ్యాధులను బట్టి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు డా దేవిరెడ్డి హరిబాబు, సిబ్బంది శ్రవణ్ కుమార్, శ్రీవిద్య, శివశరణ్, రంగారావు, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహాధర్నాలో పాల్గొనేందుకు అనుమతి కొరకు వినతి



**రాచర్ల, డిసెంబరు 12 ప్రభాతవార్త**
రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 16వ తేదీన విజయవాడలో జరిగే మహాధర్నాకు అనుమతి కోరుతూ మండల వీఆర్ఏలు స్థానిక ది సర్వే డిప్యూటీ తహసిల్దార్ వై స్వాతికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. తమ సంఘం జాయింట్ కమిటీ పిలుపుమేరకు తాము కూడా ధర్నాలో పాల్గొంటున్నామని వారు తెలిపారు. తెలంగాణ తరహాలో తమకు పే స్కేల్ అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వారినీ వీఆర్ఏలుగా నియమించాలని అర్హులందరికీ 70 ప్రమోషన్ ఇవ్వాలని కారుణ్య నియామకాలు జరిపించాలని వారు వినతిపత్రంలో ప్రభుత్వాన్ని కోరారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వారు ఆమెను కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో వీఆర్ఏలు ఎస్ అల్లూరయ్య జి క్రాంతి దీపక్ సురేష్ లింగ య్యరమాదేవి ఉన్నారు.

## భూపతిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం





**మార్కాపురం, డిసెంబరు 12, ప్రభాతవార్త**
మార్కాపురం మండలంలోని భూపతిపల్లి గ్రామంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కే బుజ్జి బాయి మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, పారదర్శకమైన ధాన్యం కొనుగోలు విధానాలను వివరించారు. గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాకు రూ.2389, సాధారణ రకానికి రూ.2369 కనీస మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు. రైతులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న తమ పంటను గ్రామంలోని రైతుసేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వానికి విక్రయించుకోవాలని, దళారులు-మధ్యవర్తుల వల్ల నష్టపోకుండా జాగ్రత్తపడాలని సూచించారు. పంట నమోదు చేసి, ఈకేవైసి పూర్తి చేసిన రైతుల నుంచే కొనుగోలు జరిగుతుందని అధికారులు తెలిపారు. ఆర్ఎస్‌కే ద్వారా తేదీ, సమయంతో కూడిన కూపన్లు జారీ అవుతాయని, వాట్స్ యాప్ నంబర్ 7337359375 కు హాయ్ పంపి షెడ్యూల్ చేసుకునే సౌకర్యం కూడా ఉందని పేర్కొన్నారు. టెక్నికల్ సిబ్బంది రైతుల పొలాలకు వచ్చి ధాన్యం నాణ్యతను పరీక్షి స్తారని, భారత ప్రభుత్వ ప్రమాణాల ప్రకారం ఐదు రకాల నాణ్యత పరీక్షల అనంతరం మాత్రమే కొనుగోలు జరుగుతుందని తెలిపారు. కొనుగోలు సమయంలో ఎఫ్‌టిసి రశీదు, అనంతరం ఎఫ్‌టిడి కాపీ రైతులకు ఇవ్వబడుతుందని తెలిపారు. తాసిల్దార్ చిరంజీవి మాట్లాడుతూ, ప్రతి రైతు బయోమెట్రిక్ నమోదు తప్పనిసరిగా చేయాలని, ధాన్యం రవాణా వాహనాలు జిపిఎస్ ట్రాకింగ్ వ్యవస్థ కలిగి ఉండాలన్నారు. రైతుల ధాన్యం విలువ నేరుగా వారి ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. ఆర్ఎస్‌కే నిర్ణయించిన నాణ్యతా ఫలితాలే అమల్లో ఉంటాయని, మిల్లర్ల అభ్యంతరాలు పరిగణలోకి తీసుకోబోడని అధికారులు వెల్లడించారు. బహిరంగ మార్కెట్లో విక్రయించాలన్నా ఆర్ఎస్‌కేలో వివరాలు నమోదు చేయడం తప్పనిసరని సూచించారు. ధాన్యం కొనుగోలు పారదర్శకంగా, రైతులకు పూర్తి ఎంఎస్‌పి అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ఏదైనా సమస్య ఎదురైతే జిల్లా కలెక్టర్‌ను లేదా టోల్ ఫ్రీ నంబర్ 1967 ను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బుజ్జి బాయ్, తాసిల్దార్ చిరంజీవి, గ్రామ వ్యవసాయ నాయకులు రసూల్, ప్రభు, శంకర్, భూపాల్ తదితరులు, రైతులు పాల్గొన్నారు.

## మార్కాపురం మండలంలో ఎంపీడీఓ పర్యటన





**మార్కాపురం, డిసెంబరు 12, ప్రభాతవార్త**
మార్కాపురం మండలం రామచంద్రాపురం గ్రామ సచివాలయం మరియు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓ ఏ బాలచెన్నయ్య సందర్శించారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకం, మంచినీటి సరఫరా, పాఠశాల పారిశుద్ధం వంటి అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి, పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచి ఆనందదాయక వాతావరణం కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే క్లోరినేషన్ చేసిన మంచినీటిని తప్పనిసరిగా వినియోగించాలని ఆదేశించారు. తరువాత సచివాలయాన్ని సందర్శించిన ఎంపీడీఓ, సిబ్బంది సమయపాలన పాటించాలి, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి అని సూచించారు. ప్రజలకు సేవ చేయడంలో నిరక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ ఎంపీడీవో గరీబ్ కాజా, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### చోరీ కేసులో ఇరువురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**- రూ.14లక్షల విలువగల బంగారు ఆభరణాలు స్వాధీనం**

**- చోరీ కేసు వివరాలను వెల్లడించిన మార్కాపురం డిఎస్పి యు నాగరాజు**



**గిద్దలూరు, డిసెంబరు 12, ప్రభాతవార్త**
గిద్దలూరు మండలం దొడ్డంపల్లె గ్రామానికి చెందిన పల్లా రమణారెడ్డి ఇంట్లో గత నెల 23వ తేదీన జరిగిన చోరీ ఘటనను గిద్దలూరు పోలీసులు ఛేదించారు. మార్కాపురం డిఎస్పి విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల మేరకు కారులో వచ్చిన రమణారెడ్డి ఇంటిలో 90గ్రాముల బంగారాన్ని దొంగలు చోరీ చేసి వెళ్తుండగా స్థానికులు చూసి కేకలు వేయగా పరారయ్యారయ్యారని, బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చోరీకి పాల్పడ్డ సయ్యద్ అప్రోజ్, సుంకర ఖాదర్ భాషలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. చోరి చేసిన రూ.14 లక్షలు విలువచేసే బంగారు ఆభరణాలతో పాటు చోరీకి ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నామని ఆయన సమావేశంలో తెలిపారు. చెడు అలవాట్లకు బానిసైన నిందితులపై గతంలో నేరచరిత్ర ఉందని ఇప్పటికే వారిపై నాలుగు కేసులు ఉన్నట్లు డీఎస్పీ అన్నారు. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టి అనంతరం రిమాండ్‌కు తరలిస్తున్నామని డిఎస్పి నాగరాజు మీడియాకు వెల్లడించారు.

## ఫార్మసీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది

**- విద్యార్థులు పరిశోధనాత్మక ఆలోచనతో ముందుకు సాగాలి**

**- డాక్టర్ ఆదిమూలపు సతీష్**





**మార్కాపురం, డిసెంబరు 12, ప్రభాతవార్త**
మార్కాపురం పట్టణంలోని స్థానిక జార్జ్ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం భవ్యంగా ఫార్మా క్వెస్ట్ 2025 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డా ఆదిమూలపు సతీష్, ప్రత్యేక అతిథిగా డా. స్టెల్లా సెలిన హాజరై విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ డా ప్రసన్న కుమార్ మాట్లాడుతూ“ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులలోని ప్రతిభను వెలికితీయడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం మా లక్ష్యమన్నారు. ఇటువంటి టెక్నికల్ ఈవెంట్స్‌ను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న డా ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ ఫార్మసీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని విద్యార్థులు పరిశోధనాత్మక ఆలోచనతో ముందుకు సాగాలన్నారు. ఇలాంటి టెక్నికల్ ఈవెంట్స్‌లో పాల్గొనడం భవిష్యత్తు కెరీర్‌కు ఎంతో ఉపయోగకరం” అని పేర్కొన్నారు. డా స్టెల్లా సెలిన మాట్లాడుతూ ఫార్మా రంగంలో నైపుణ్యం, నవీనత, నిబద్ధత అవసరమని ఈ తరహా పోటీల్లో పాల్గొనే విద్యార్థులు భవిష్యత్తులో మంచి పరిశోధకులు, మంచి ఫార్మిస్ట్‌లుగా ఎదుగుతారని అన్నారు. టెక్నికల్ ఈవెంట్స్ ఫలితాలు ఈ ఫార్మాక్వెస్ట్‌లో వివిధ ఫార్మసీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. డ్రగ్ ఫ్రమ్ క్లూ ఈవెంట్‌లో మొదటి బహుమతి గుంటూరు - చెబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలకు రెండో బహుమతి జార్జ్ ఫార్మసీ కళాశాలకు లభించాయని తెలిపారు. ఉదయం ప్రారంభ కార్యక్రమం అనంతరం టెక్నికల్ రౌండ్స్ ఉత్సాహంగా నిర్వహించగా, విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమం మొదటి రోజు ఘనంగా ముగిసింది.

## కేజీబీవీ స్కూల్ని సందర్శించిన ఎంపీడీఓ రాజ్ కుమార్





**త్రిపురాంతకం, డిసెంబర్ 12, ప్రభాతావార్త**
స్థానిక మండల పరిధిలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజకుమార్ శుక్రవారం సందర్శించి రిపేర్ చేపించిన హ్యాండ్ పంపును పరిశీలించారు. ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ఫ్ టి కిట్ ద్వారా టెస్ట్ చేయించి, క్లాస్ రూమ్‌లను పరిశీలించి, విద్యార్థులతో చదువు యొక్క విలువేంటో, చదువుకొనుట ద్వారానే మనిషి ఏ రంగలో నైనా సాధించగలరని,ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని విద్యార్థులకు తెలియజేశారు.వారి యోగక్షేమములు అడిగితెలుసుకున్నారు. అనంతపురం విద్యార్థులతో కలసి మధ్యాహ్నం భోజనం చేశారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల లో నూతనోత్సాహం కలిగిందని,శక్తి వంచన లేకుండా విద్యార్థుల భవిష్యత్ కొరకు తనతోపాటు మిగిలిన ఉపాధ్యాయులు శ్రమిస్తున్నారని, మంచి ఉత్తీర్ణతను విద్యార్థులు సాధించేందుకు కృషి చేస్తున్నారని స్కూల్ ప్రిన్సిపాల్ వసుమతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తో పాటు మిగతా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### విధుల పట్ల నిర్లక్ష్యం ఏమిటి..? పథకాలపై అవగాహన లేకపోవడంపై

## డీఆర్‌డీఏ పీడీ టి.నారాయణ ఆగ్రహం

**- కనిగిరి క్లస్టర్ వెలుగు సిబ్బందిపై సమీక్షలో మండిపాటు**





**కనిగిరి, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణంలోని దొరువు బజార్ ఫంక్షన్ హాల్లో జరిగిన సమీక్ష సమావేశంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరక్టర్ టి.నారాయణ వెలుగు సిబ్బంది పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పథకాలపై కనీస అవగాహన లేకుండానే విధులను నిర్లక్ష్యంగా నిర్వహించడం ఎలా సమర్థించు కుంటారో ప్రశ్నించారు. లక్షపతి దీదీ, వుమెన్ ఎంటర్ ప్రెన్యూర్ పథకాల మధ్య తేడా తెలియకుండా క్షేత్ర స్థాయిలో అమలు ఎలా చేస్తారు..? అని టి.నారాయణ నిలదీశారు. ఏడు నెలలుగా షేక్‌పథకం సమీక్షలు జరుగు తున్నా ఇంకా అవగాహన లేకపోవడం తీవ్రమని వ్యాఖ్యానించారు. ఏబీఏలే పథకాలపై ఎక్కువ అవగాహనతో ఉన్నారని అభినందించిన పీడీ, పనితీరు లేని హెచ్‌ఎంపాడు సీసీలు, ఏబీఏలను మార్చాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పని చేయని వారి పేర్లను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం. రెండు నెలలు గడువు.. మార్పు రాకపోతే తప్పనిసరిగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. క్లస్టర్‌లో వెలుగు సిబ్బంది పనితీరు అత్యంత దారుణంగా ఉందని వ్యాఖ్యానించిన ఆయన, నేను మరో నాలుగు సంవత్సరాలు పీడీగా ఉంటాను, పని చేయని వారిని సెట్ చేయడమే కర్తవ్యం అని స్పష్టం చేశారు. సమీక్ష అనంతరం సిబ్బందిగా వ్యంగ్యంగా ఇంత భాగా పని చేస్తున్న మిమ్మల్ని శాలువాలతో సత్కరించాల్సిందే అని చమత్కరించారు. సాయంత్రం 7గంటలైనా పథకాలపై అవగాహన కల్పించే శిక్షణ కొనసాగుతుందని, అందుకు అందరూ సిద్దంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఏపీడీ నీలకంఠరెడ్డి, బీఎల్‌డీపీఎం అంబేద్కర్, శ్రీనిధి ఏజీఎం పుల్లయ్య, ఎల్‌హెచ్‌డీపీఎం రజనీకాంత్, ఐబీ ఏపీఎం ఆదిశేషు, ఉన్నతి ఏపీఎం బాలసుబ్రహ్మణ్యం, ఏపీఎంలు అశోక్, జీవరత్నం, లక్ష్మీనారాయణ, సత్యానందం, సీసీలు, వీవీఓఏలు పాల్గొన్నారు.

### అనుమతి లేని బయో పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు

**- దర్శి ఏడీఏ బాలాజీ నాయక్**

**- తనిఖీల సమాచారం తెలుసుకున్న దుకాణదారులు షాపులు మూసివేత**



**కనిగిరి, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
ప్రభుత్వ అనుమతి లేని బయో పురుగుమందుల విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని దర్శి ఏడీఏ బాలాజీ నాయక్ హెచ్చరించారు. శుక్రవారం కనిగిరి పట్టణంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. శ్రీ ఆంజనేయ ట్రేడర్స్, వెంకటలక్ష్మీ, ప్రసన్నాంజనేయ ట్రేడర్స్ దుకాణాలను పరిశీలించి రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, సూక్ష్మపోషకాల వివరాలను వివరంగా తనిఖీ చేశారు. అనుమతి లేని బయో పురుగుమందులు, ఎరువులు విక్రయించిన దుకాణదారులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. వివిధ కంపెనీల ఉత్పత్తులను విక్రయించేందుకు తప్పనిసరి అయ్యే ఓ ఫామ్, టీసీలు, స్థానిక ఏడీఏ అనుమతులు లేకుండా విక్రయాలు జరపడం చట్టవిరుద్ధమని, దీనిపై కఠిన చర్యలు తప్పవని బాలాజీ నాయక్ స్పష్టం చేశారు. రైతులకు నాన్యమైన ఎరువులు, పురుగు మందులు అందించడానికి ఈ తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మాల్యాద్రి పాల్గొన్నారు. అయితే ప్రత్యేక స్క్వాడ్ తనిఖీల కోసం వచ్చిన సమాచారం పట్టణంలో ప్రత్యేక స్క్వాడ్ తనిఖీల కోసం వచ్చిన సమాచాం పట్టణలో వ్యాపారులలో పెద్ద ఎత్తున భయాందోళన రేపింది. తనిఖీలు జరుగుతున్నాయన్న విషయం తెలిసిన వెంటనే పలువురు దుకాణదారులు హడావిడిగా తమ దుకాణాలను మూసివేశారు. ఫలితంగా అరిధికారులు అన్ని దుకాణాలను పరిశీలించలేకపోయారు. కొద్ది దుకాణాల్లో మాత్రమే స్టాక్‌లు, రికార్డులు తనిఖీ చేయగలిగారు. నిరంతరం దుకాణదారుడు విక్రయించే పురుగుమందులు ఎరువుల దుకాణాలపై తనిఖీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

### కనిగిరిలో రోడ్లు, డ్రైనేజీ కాలువల పనులకు శంకుస్థాపన





**కనిగిరి, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
కనిగిరి మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో శుక్రవారం రోడ్లు, డ్రైనేజీ పనులకు మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ శంకుస్థాపన చేశారు. కనిగిరి పట్టణంలోని 7వవార్డులో రూ.10లక్ష నిధులతో రోడ్డు నిర్మాణ పనులను, 1వ వార్డు బీసీ కాలనీలో 23లక్షల 70 వేల నిధులతో డ్రైనేజీ కాలువలునిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్స్ డ్రైనేజీ కాలువలు మౌలిక వసతులు కల్పించి మున్సిపాలిటీని అభివృద్ధిచేయనున్నట్లు ఆయన తెలిపారు. రోడ్స్, డ్రైనేజీ కాలువలు నిర్మాణ పనులను పొందిన కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలను పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి సహకారంతో మున్సిపాలిటీని సుందరీకరణ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ తమ్మనేని సుజాత, మున్సిపాలిటీ ఏఈ మాధవరావు, తెలుగు ఉపాధ్యక్షుడు అచ్చాల రవి, టీడీపీ వార్డు అధ్యక్షుడు పిల్లి కిరణ్ కుమార్‌రెడ్డి, ఉండేలా శ్రీనివాసరెడ్డి, తమ్మినేని సురేంద్రారెడ్డి, బోగాల ప్రసాద్‌రెడ్డి, పుట్లూరి కృష్ణారెడ్డి, అచ్చాల శ్రీనివాసరెడ్డి, షేక్ రెహమాన్, అంజి నాయుడు, మోహన మురళి, మున్సిపల్ సిబ్బంది స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలి

**- దద్దాల నారాయణ యాదవ్**



**కనిగిరి, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
స్థానికపార్టీ కార్యాలయంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్‌ను 2వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు నెంబర్ షరీఫ్, వంకదారి రాజా, కోమటికుంట్ల శ్రీను, కొమ్మిరెడ్డి సాయి, కొమ్మిరెడ్డి, సుబ్బు, బోట్ల గుండూరు కిషోర్ తదితరులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వార్డుకు చెందిన నూతన కమిటీ సభ్యుల జాబితాలను ఇన్‌చార్జికి అందజేశారు. పార్టీ విస్తరణ బలోపేతం, వార్డు అభివృద్ధిలో ప్రతి నాయకుడు చురుకుగా పని చేయాలని దద్దాల నారాయణ యాదవ్ సూచించారు. నాయకుల సమన్వయం, క్రమశిక్షణ, ప్రజలతో అనుసంధానం మరింత బలపడాలని సూచించారు. సమావేశంలో 2 వ వార్డు కు సంబంధించిన తాజా కార్యక్రమాలు, బూత్ స్థాయి కమిటీలు, పార్టీ కార్యకలాపాలపై కూడా చర్చించారు.

### బస్సు ప్రమాదంపై మంత్రి గొట్టిపాటి దిగ్భ్రాంతి



**అద్దంకి, డిసెంబరు 12, ప్రభాతవార్త**
అల్లూరి జిల్లాలో బస్సు ప్రమాద ఘటనపై రాష్ట్ర విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ దిగ్భ్రాంతిచెందారు. ఆయన ఒక ప్రకటనలో తీర్థయాత్రలకు వెళుతుండగా ప్రమాదం జరగడం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని మంత్రి తెలిపారు. క్షత గాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందిచాలని అధికారులను అదేశించారు.

# అనిల్ తండ్రికి అశోక్ నివాళి



**అద్దంకి, డిసెంబరు 12, ప్రభాతవార్త**
అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ శనివారం అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంలో వైయస్ఆర్ సీపీ నాయకులు నరిశెట్టి అనిల్ తండ్రి నరిశెట్టి సింగయ్య భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరి వెంట పట్టణ వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు కాకాని రాధా కృష్ణ మూర్తి, వివిధ హోదాలలో ఉన్న వైఎస్ఆర్సీపీ నాయకులు ఉన్నారు.

# నేడు జాతీయ మెగా లోక్ అదాలత్

**అద్దంకి , డిసెంబరు 12,ప్రభాతవార్త**
జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం అద్దంకి కోర్టు భవనాల సముదాయంలో ఉదయం 10.30 నుండి సాయంత్రం 5గంటల వరకు లోక్ అదాలత్ జరుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి డి.నాగవెంకట లక్ష్మి తెలియజేశారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో సూచించారు.

### సంజీరావుపేట అటవీ ప్రాంతంలో

## చెట్టుకు ఉరి వేసుకొని భార్యాభర్తలు మృతి

**- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన**



**గిద్దలూరు, డిసెంబరు 12, ప్రభాతవార్త**
గిద్దలూరు మండలం సంజీరావుపేట అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకొని భార్యాభర్తలు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దాదాపు 5 నెలల కిందట జరిగిన సంఘటన ఇవాళ శుక్రవారం బయట పడింది. దంతరపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు, శారద అనే భార్యాభర్తలు దాదాపు 5 నెలల కిందట మిస్సింగ్ అయినట్టు కేసునమోదు కాగా ఉరివేసుకుని మృతిచెందింది వారే అనే అనుమానాన్ని చుట్టుప్రక్కల గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

### సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ నందు ఉచిత రక్తదాన శిబిరం



**వేటపాలెం, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ చీరాల నందు రక్తదాన శిబిరంను హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వారి సహకారంతో శుక్రవారం నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ పదామ రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు సంయుక్తంగా తెలియజేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వివి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరం నందు 30 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా రక్తదానం మిన్నం అని, ప్రాణదానంతో సమానమన్నారు. శిబిరంలో చీరాల ఏరియా ప్రభుత్వ వైద్యశాల బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి డాక్టర్ యు.తిరుమలరావు, వారి సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి బి.వినరు కుమార్, కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**చీరాల, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
ఈనెల 13న సబ్ స్టేషన్, ఫీడర్ లైన్‌ల మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని, జాండ్రపేట, రామకృష్ణాపురం, పాత చీరాల, సాల్మన్ సెంటర్, కొత్తపాలెం, గాంధీ నగర్, విటల్ నగర్, వైకుంఠపురం విటల్ నగర్, గంజిపాలెం నాయుడుపేట, నవాబుపేట ప్రసాద్ థియేటర్ రోడ్డు జోన్ అన్ని ఏరియాలకు ఉదయం 9గంటల నుండి 12గంటల వరకు సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు సహకరించాలని డీ2 సెక్షన్ చీరాల అసిస్టెంట్ ఇంజనీర్ బి.శంకర్ తెలియజేశారు.

### ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా దర్బార్



**చీరాల, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
ప్రజల సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని చీరాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య హాజరయ్యారు. ఎమ్మెల్యే కొండయ్య ప్రజల వద్ద నుండి స్వయంగా సమస్యల వినతుల అర్జీలను స్వీకరించారు. మొత్తం 177 పైగా అర్జీలు రాగా వీటిలో ఇంటి నిర్మాణాల కోసం, ఇంటి స్థలాల కోసం 140, 27 పింఛన్లు, 10 పలు సమస్యలపై అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధన్ మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ సుబ్బయ్య, బీజేపీ నాయకులు మువ్వల వెంకట రమణారావు, చీరాల మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం, చీరాల పట్టణ అధ్యక్షులు దోగుపర్తి వెంకట సురేష్, పట్టణ మహిళా అద్యక్షురాలు దర్శి నాగేంద్రమణి, గూడూరు శివరాం ప్రసాద్, ఉసిరిపాటి సురేష్, బాలకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### స్థానికంగా ఉద్యోగావకాశాలు కల్పనకు ప్రభుత్వం కట్టుబాటు

**- ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య**

**- చీరాలలో మెగా జాబ్ మేళా**






**చీరాల, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
చీరాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య యాదవ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ మేళాలో మొత్తం 17 కంపెనీలు పాల్గొని వివిధ విభాగాల్లో నియామకాలకు అవకాశాలు అందించాయి. ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న 700 మందికి పైగా నిరుద్యోగ యువతీ, యువకులు ఇంటర్వ్యూలకు హాజరై భారీగా స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ యువతకు స్థానికంగా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని తెలిపారు. ఈ జాబ్ మేళా ద్వారా అనేక మందికి ఉపాధి అవకాశాలు దక్కుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అదే గతంలో నిర్వహించిన జాబ్ మేళా ద్వారా ఒక్క వెయ్యి ముప్పై ఏడు మంది నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగాలు సాధించారని ఎమ్మెల్యే కొండయ్య వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రషీద్, ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గుదంటి చంద్రమౌళి, చీరాల మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ సుబ్బయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### అశ్రు నయనాలతో మాజీ ఎమ్మెల్యేకు అంత్యక్రియలు



**గిద్దలూరు, డిసెంబరు 12, ప్రభాతవార్త**
గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే పిడతల రామభూపాల్ రెడ్డి అనారోగ్యంతో ఈనెల 11వ తేదీన హైదరాబాదులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ స్వర్గస్తులయ్యారు. అంత్యక్రియల కోసం రామభూపాల్‌రెడ్డి పార్థివ దేహాన్ని గిద్దలూరుకు తరలించారు. ఆయన కుమారుడు పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి వారి స్వగ్రామమైన రాచర్ల మండలం అనుమలవీడులో శుక్రవారం అంత్యక్రియలను నిర్వహించారు. ఈ అంతిమయాత్రలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జంకే వెంకట్ రెడ్డి, కుందూరు నాగార్జున రెడ్డి, పిడతల సాయి కల్పనారెడ్డి, అన్నా వెంకట రాంబాబు పలువురు ప్రముఖులు పిడతల రామభూపాల్ రెడ్డికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.



గిద్దలూరు నుంచి ర్యాలీగా రాచర్ల మండలం అనుమలవీడు గ్రామానికి మాజీ ఎమ్మెల్యే రామభూపాల్ రెడ్డి భౌతికకాయాన్ని తరలించారు. ఆయన అంతిమయాత్రలో పలువురు ప్రజా ప్రతినిధులు, ఆయన అభిమాను లు పాల్గొని అశ్రునాయనాలతో ఆయనకు వీడ్కోలు పలికారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**- విద్యుత్ ఏఈ మణికంఠ**

**హనుమంతునిపాడు, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
మండల పరిధిలోని సీతారాంపురం సబ్ స్టేషన్ మరమ్మత్తులు కారణంగా హాజీపురం, దొడ్డిచింతల, సీతారాంపురం, కూటా గుండ్ల, దాసల్లపల్లి, ముప్పళ్ళపాడు, రామయపల్లి గ్రామాలలో నేడు అనగా శనివారం ఉదయం 8గంటల నుండి ఉదయం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కావున ప్రజలందరూ సహకరించాలని విద్యుత్‌శాఖ ఏఈ మణికంఠ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

### పరిశపోగు వారి వివాహ వేడుకలో బలసాని కోటయ్య



**హనుమంతునిపాడు, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
మండల పరిధిలోని నందనవనం గ్రామంలో పరిశపోగు వారి వివాహ వేడుకలో కనిగిరి నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు బలసాని కోటయ్య, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు తాతపూడి బుజ్జి, నందనవనం గ్రామ టీడీపీ ఎస్సీ నాయకులు పరిశపోగు యేసు, పరిశపోగు ప్రభాకర్ వీర రామాపురం రాబర్ట్ తదితరులు పాల్గొని నూతన వధువును ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

# యువతిని నమ్మించి గర్భవతిని చేసిన

## కేసులో నిందితుడికి 10 ఏళ్లు జైలు శిక్ష

**- రూ.12000 జరిమాన విధించిన అదనపు జిల్లా సెషన్స్ జడ్జి**



**హనుమంతునిపాడు, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి మోసం చేసి గర్భవతిని చేసిన కేసులో నిందితుడికి పది సంవత్సరాలు జైలు శిక్ష, రూ.12 వేలు జరిమానను ఒంగోలు రెండవ అదనపు సెషన్స్ జడ్జి విధించినట్లు ఎస్సై కే.మాధవరావు తెలిపారు. హనుమంతునిపాడు మండలం లింగంగుంట గ్రామానికి చెందిన కొదముల రవి(27) అనే వ్యక్తి ఒక యువతిని(20) పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి నమ్మించి గర్భవతిని చేసి 2018 జూన్ 16న తిరస్కరించిన ఘటన జరిగింది. అప్పట్లో పోలీసు స్టేషన్ నందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా అప్పటి పామూరు సీఐ మధుబాబు(కనిగిరి ఇన్‌ఛార్జి) దర్యాప్తును చేపట్టి ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. పోలీసులు సమయానుసారం సాక్షులను కోర్టు నందు హాజరు పరచగా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యత్తపు కొండారెడ్డి, కేవీ రామేశ్వర్‌రెడ్డి ప్రాసిక్యూషన్ తరుపున వాదించారు. జిల్లా ఎస్పీ మార్గదర్శకత్వంలో ప్రత్యేక మానిటరింగ్ టీం ద్వారా సమర్థవంతంగా ట్రయల్ నడిపి సరైన సాక్ష్యాధారాలతో నిందితుడుపై పలు సెక్షన్‌ల కింద నేర నిరూపణ చేయడంతో శుక్రవారం ఒంగోలు 2వ అదనపు జిల్లా అండ్ సెషన్స్ జడ్జి పందిరి లలిత 10 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.12వేలు జరిమానా విధించారు. పై కేసులో ముద్దాయికి శిక్ష పడటంతో కృషి చేసిన పోలీసు అధికారులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్ట్ లైజన్ సిబ్బందిని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ప్రత్యేకంగా అభినందించారు.

## రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**- టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి**



**హనుమంతునిపాడు, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నందనవనం రైతు సేవ కేంద్రం నందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ధాన్యం కొనుగోలు కేంద్రాల అవగాహన సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గింపు అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయంతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు ఆకుపాటి వెంకటరావు, గ్రామ పార్టీ కమిటీ అధ్యక్షుడు పెంచికల రామకృష్ణ, రైతు సేవ కేంద్రం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## పీజీ ఓనర్స్ అసోసియేషన్ ఏర్పాటుతో మేలు



**సీఎస్‌పురం, డిసెంబర్ 12, ప్రభాతవార్త**
పీజీలు నిర్వహిస్తున్న ఓనర్లు అందరూ అసోసియేషన్ ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎంతో మేలు చేకూరుతుందని తమిళనాడు ఐటీ హాస్టల్స్, పీజీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తమిళనాడు రాష్ట్ర ప్రెసిడెంట్ లయన్ సీతారామిరెడ్డి అన్నారు. తమిళనాడు ఐటీ హాస్టల్స్, పీజీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రామాపురం జోన్ ఫ్రీ జనరల్ బాడీ సమావేశం చెన్నైలోని రామాపురం ప్రాంతంలోని సాయి ఉదయం మహల్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ ఏర్పాటు వల్ల పీజీల నిర్వహణలో ఏమైనా సమస్యలు వస్తే సులభంగా పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఓనర్లు ఎటువంటి సమస్యలు లేకుండా బిజినెస్ చేసుకోవచ్చన్నారు. ఈనెల 17న నిర్వహించే సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. చెన్నైలో పీజీలు నిర్వహించుకుంటున్న ప్రతి ఒక్కరూ ఈ సర్వసభ్య సమావేశంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు ఐటీ హాస్టల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లయన్ సీతారామన్, సెక్రటరీ ఆర్వీ సుబ్బయ్య, వైస్ ప్రెసిడెంట్ లాక శ్రీనివాస్, జోనల్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ట్రెజరీ కార్తీక్‌బాబు, జనరల్ సెక్రటరీ సుబ్బరాయణ్, జోన్ సెక్రటరీ చిన రాజా, రామాపురం ఎగ్జిక్యూటీవ్ నెంబర్ మహేష్, రామాపురం ప్రెసిడెంట్ రామచంద్రన్, రామాపురం ఆర్నరీ ప్రెసిడెంట్ ధన సింగ్, ఎగ్జిక్యూటీవ్ నెంబర్ యువరాజ్, షోలింగనూర్, ఎగ్జిక్యూట్ నెంబర్ పార్థసారధి పెరిముడి ఎగ్జిక్యూటి నెంబర్, మితికాల వరుణ్ కుమార్, కిషోర్, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పిన్నికి కృష్ణ పాల్గొన్నారు.

### గిద్దలూరు నగర పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సెమీ క్రిస్టమస్ వేడుకలు



**గిద్దలూరు, డిసెంబరు 12 ,ప్రభాతవార్త**
గిద్దలూరు పట్టణంలోని స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సెమీ క్రిస్టమస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసుకుని స్వీట్లు పంచుకున్నారు. క్రిస్టమస్ యొక్క ప్రాముఖ్యత గురించి దైవజనులు ఫిలిప్ ప్రతి ఒక్కరికి వివరించారు. సెమీక్రిస్టమస్ వేడుకలు నిర్వహించ డానికి సహకరించిన కమిషనర్ రమణ బాబుకు పలువురు దైవజనులు అభినందనలు తెలియజేశారు.

### నెమిలిదిన్నె చెన్నారెడ్డిని పరామర్శించిన వైఎస్ఆర్సిపి ఇన్చార్జి నాగార్జున రెడ్డి



**గిద్దలూరు, డిసెంబరు 12, ప్రభాతవార్త**
గిద్దలూరు సబ్ జైల్‌లో నిర్బంధంలో ఉన్న కంభం మండలం వైఎస్సార్సీపి కార్యకర్త నెమిలిదిన చెన్నారెడ్డిని గిద్దలూరు వైఎస్సార్సీపి ఇంచార్జ్ కుందూరునాగార్జునరెడ్డి శుక్రవారం పరామర్శించారు. నాయకత్వంపై నమ్మకంతో పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న చెన్నారెడ్డిపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసు బనాయించిందని నాగార్జున రెడ్డి ఆరోపించారు. రాజకీయ ప్రత్యర్థులను నిర్బంధించి భయపెట్టే ప్రయత్నం జరుగుతోందని తీవ్రంగా విమర్శించారు. పార్టీ కార్యకర్తలకు ఎలాంటి అన్యాయం జరిగినా పార్టీ అండగా ఉంటుందని చెన్నారెడ్డితో మాట్లాడిన సందర్భంగా పేర్కొన్నారు. చెన్నారెడ్డికి న్యాయం జరిగే వరకు పార్టీ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

13-12Pg 9_13-12Pg5.qxd 12/Dec/25 10:03 PM Page 1



## రష్యా-ఉక్రెయిన్ పోరు ముదిరితే..

# మూడో ప్రపంచ యుద్ధమే



## అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్, డిసెంబరు 12:** రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధాన్ని ఉద్దేశిస్తూ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందని హెచ్చరించారు. వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ గత నెల రోజుల్లో యుద్ధంలో దాదాపు 25 వేల మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. 'రక్తపాతం ఆగిపోవాలని నేను కోరుకుంటున్నా.. గత నెలలో 25 మంది ప్రాణాలు కోల్పోయారు. అందులో ఎక్కువమంది సైనికులే ఉన్నారు. బాంబుల వల్ల మరికొందరు చనిపోయారు. ఇది వెంటనే ఆగిపోవాలి. అందుకు మేము చాలా కష్టపడి పనిచేస్తున్నాం. ఇలాంటి పోరు మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీస్తుంది. ఇది చాలా ప్రమాదకరం. అందరూ ఆటలు ఆడుతున్నారని నేను అంతకుముందే చెప్పాను. అలా జరగాలని కోరుకోవడం లేదు' అని అన్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించేందుకు తమ ప్రభుత్వంలో ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు. ఇక నాలుగేళ్లుగా రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు జరుగుతున్న చర్చల్లో పురోగతి లేకపోవడంపై ట్రంప్ అసహనంతో ఉన్నారని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ అన్నారు. ట్రంప్ ఆయా దేశాల అధికారుల నుంచి మాటలు కాకుండా.. ఫలితాలు కోరుకుంటున్నారన్నారు. చర్చలతో విసిగిపోయిన అధ్యక్షుడు చర్యలకు సిద్ధమైనట్లుగా తెలిపారు. ఈ శాంతి ప్రణాళికను ముందుకు తీసుకెళ్లడంలో ట్రంప్ పరిపాలనా సిబ్బంది చురుకుగా ఉన్నారన్నారు. యూరోపియన్ నేతలతో చర్చించేందుకు అధ్యక్షుడు సిద్ధమైనట్లు వెల్లడించారు. పశ్చిమాసియా రాయబారి స్టీవ్ విట్కాఫ్ బృందం రష్యా-ఉక్రెయిన్‌లతో చర్చలు కొనసాగిస్తున్నారన్నారు. ఇక, ఉక్రెయిన్‌లో యుద్ధం ముగించేందుకు ట్రంప్ 28 సూత్రాలతో శాంతి ప్రణాళిక ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఈ ప్రతిపాదనపై అసంతృప్తిగా ఉన్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ 20 పాయింట్లతో కొత్త ప్రణాళికను ప్రతిపాదించారు. దీన్ని అగ్రరాజ్యం అమెరికాకు ఇప్పటికే అందించినట్లు తెలిపారు. డాన్‌బాస్ ప్రాంతాన్ని రష్యాకు అప్పగించేందుకు సిద్ధంగా లేమని స్పష్టం చేశారు. ఉక్రెయిన్ పునర్నిర్మాణం, ఆర్థికాభివృద్ధికి సంబంధించిన విస్తృత ప్రణాళికపై అమెరికాతో చర్చిస్తామన్నారు.

# నిధుల విడుదలకు కఠిన షరతులు

## పాకిస్థాన్‌కు చుక్కలు చూపిస్తోన్న ఐఎంఎఫ్




**ఇస్లామాబాద్, డిసెంబరు 12:** ఆర్థికంగా కునారిల్లుతున్న పాకిస్థాన్‌కు ప్రస్తుతం అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎం), ప్రపంచ బ్యాంకు ఇచ్చే అప్పులే దిక్కు. అయితే, నిధుల విడుదల కోసం ఐఎంఎఫ్ పెడుతున్న షరతులకు పాక్ ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. అవినీతి నిరోధక చర్యలు మొదలు మార్కెట్ సరళీకరణ వరకూ ఐఎంఎఫ్ విధిస్తున్న కండీషన్లను అమలు చేయలేక పాక్ పాలకులు ఇక్కట్ల పాలవుతున్నారు. డబ్బుల్లేక ఇబ్బంది పడుతున్న పాక్‌కు ఐఎంఎఫ్ మొత్తం 7 బిలియన్ డాలర్లను బెయిల్ అవుట్ ప్యాకేజీని ప్రకటించింది. విడతల వారీగా నిధుల విడుదలకు నిర్ణయించిన ఐఎంఎఫ్ పాక్‌పై దశలవారీగా షరతులు పెడుతోంది. తాజా విడత నిధుల విడుదలకు కొత్తగా మరో 11 షరతులు విధించింది. దీంతో, ఇప్పటివరకూ విధించిన మొత్తం షరతుల సంఖ్య 64కు చేరింది. ఐఎంఎఫ్ కండీషన్లు యథాతథంగా పాటించేందుకు పాక్ కేవలం 18 నెలల గడువు మాత్రమే లభించింది. తాజా నిబంధనల ప్రకారం.. పాక్ కేంద్ర ప్రభుత్వ అధికారులు తమ ఆస్తిపాస్తుల వివరాలను బహిరంగపరచాల్సి ఉంటుంది. త్వరలో ఈ నిబంధనను రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు విస్తరించనున్నారు. పాక్ సైన్యానికి వంత పాడుతూ అక్రమాలకు పాల్పడే పాక్ పాలకులకు ఈ నిబంధనతో నోట్లో వెలక్కాయ పడ్డట్టు అయ్యింది. ఈ యేడాది చివరినాటికి ఐఎంఎఫ్ డెడ్‌లైన్ విధించింది. షరతులకు తలొగ్గకపోతే నిధుల రాకడ నిలిచిపోతుంది. నిబంధనలను అమలు చేస్తే అవినీతి, అక్రమాలు బయటపడతాయి. దీంతో పాక్ పాలకులు ఈ పరిస్థితి నుంచి బయలపడేందుకు మల్లగుల్లాలు పడుతున్నారు. పరిపాలనలో ప్రభుత్వ వైఫల్యాలకు చెక్ పెట్టేందుకు ఐఎంఎఫ్ పలు ఇతర నిబంధనలు కూడా విధించింది. స్థానిక బాండ్ మార్కెట్‌లో సంస్కరణలు, విదేశీ నిధులకు సంబంధించి చెల్లింపులపై ఆంక్షల తొలగింపు వంటివి చేపట్టాలని పాక్‌కు స్పష్టం చేసింది. సైన్యం, అధికారులు కుమ్మక్కు అవుతున్న వైనానికి చెక్ పెట్టేందుకు జాతీయ చక్కెర మార్కెట్ సరళీకరణ విధానాన్ని కూడా సూచించింది. దీంతో పాటు రెవెన్యూ బోర్డు సంస్కరణలు, పన్ను విధానాల్లో మార్పులు, కార్పొరేట్ రంగ నిబంధనల్లో మార్పులు వంటివి పేర్కొంది. ప్రభుత్వ ఆదాయం వచ్చే యేడాది తగ్గిన పక్షంలో మినీబడ్జెట్‌ను కూడా ప్రవేశపట్టాలని స్పష్టం చేసింది. దీంతో, ఐఎంఎఫ్ దూకుడును తట్టుకోలేక పాక్ పాలకులు అల్లాడిపోతున్నారు.

# చైనా బిజినెస్ వీసాలకోసం భారత్ నిబంధనల సడలింపు


**న్యూఢిల్లీ, డిసెంబరు 12:** చైనాకు చెందిన వృత్తి నిపుణులకు బిజినెస్ వీసాలను వేగంగా జారీ చేసేందుకు భారత ప్రభుత్వం నిబంధనలను సడలింస్తోంది. ఇరు దేశాల మధ్య వ్యాపార, వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసే దిశగా ఇది ఒక కీలక ముందడుగుగా భావిస్తున్నారు. ఈ కొత్త సడలింపుల వల్ల వీసా జారీలో అనవసర జాప్యం తగ్గిపోతుందని, వ్యాపార సంస్థలకు నిపుణుల కొరత ఏర్పడకుండా ఉంటుందని అధికారులు వెల్లడించినట్లు తెలుస్తోంది. వీసా ఆమోద ప్రక్రియను నాలుగు వారాలలోపే పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నారని, గతంలో ఉన్న కొన్ని పరిశీలన స్థాయిలను కూడా తొలగించారని వారు వివరించారు. ఈ ఏడాది ఆగస్టులో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సమావేశమైన విషయం తెలిసిందే. సరిహద్దు వివాదాలను పక్కనపెట్టి, ప్రపంచ శాంతి కోసం అన్ని రంగాల్లో కలిసి పనిచేయాలని ఆ భేటీలో ఇరు నేతలు నిర్ణయించుకున్నారు. ఈ సమావేశం తర్వాతే తాజా పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. 2020లో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణల అనంతరం చైనా పౌరులకు ఇచ్చే వీసాలపై భారత్ కఠిన ఆంక్షలు విధించింది. ముఖ్యంగా బిజినెస్ వీసాల పరిశీలనను చాలా కఠినతరం చేసింది.

# వృద్ధురాలి హత్యకు కారణమైన చాట్‌జిపిటి

## కాలిఫోర్నియా కోర్టులో కేసుదాఖలు



**వాషింగ్టన్, డిసెంబర్ 12:** చాట్‌జీపీటీ ఒక వృద్ధురాలి హత్యకు కారణమైందన్న ఆరోపణలతో ఓపెన్‌ఏఐ, మైక్రోసాఫ్ట్ సంస్థలు భారీ దావాను ఎదుర్కొంటున్నాయి. అమెరికాలోని కనెక్టికట్‌కు చెందిన 83 ఏళ్ల వృద్ధురాలిని ఆమె కుమారుడు దారుణంగా హత్య చేశాడు. అయితే, తన కొడుకులోని మానసిక భ్రమలను, అనుమానాలను చాట్‌జీపీటీ మరింత పెంచి, ఈ దారుణానికి పురిగొల్పిందని మృతురాలి కుటుంబం ఆరోపిస్తూ గురువారం కోర్టును ఆశ్రయించింది. శాన్ ఫ్రాన్సిస్కోలోని కాలిఫోర్నియా సుపీరియర్ కోర్టులో దాఖలైన ఈ పిటిషన్‌లోసుజానే ఆడమ్స్ (83) అనే మహిళను ఆమె కుమారుడు స్టెయిన్‌ఎరిక్ సోల్‌బర్గ్ (56) ఆగస్టు 3న వారి ఇంట్లో తీవ్రంగా కొట్టి, గొంతు నులిమి చంపాడు. అతను కూడా కత్తితో పొడుచుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హత్యకు కొన్ని నెలల ముందు నుంచి సోల్‌బర్గ్ చాట్‌జీపీటీతో జరిపిన సంభాషణలే అతనిని ఈ దారుణానికి ప్రేరేపించాయని దావాలో పేర్కొన్నారు. సోల్‌బర్గ్‌లోని పిచ్చి ఆలోచనలను చాట్‌జీపీటీ ఖండించకుండా, వాటిని నిజమని నమ్మించిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. నువ్వు నన్ను చైతన్యవంతం చేశావని చాట్‌జీపీటీతనతో చెప్పినట్లు సోల్‌బర్గ్ సోషల్ మీడియాలో వీడియోలు కూడా పోస్ట్ చేశాడు.





# వాయుకాలుష్యంపై చర్చకు రెడీ

- లోక్‌సభలో కేంద్ర మంత్రి రిజిజు ప్రకటన - స్వాగతించిన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ
- రాజ్యసభలో విపక్ష సభ్యులు కాలుష్యం ప్రస్తావన - కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి వివరణ
- లోక్‌సభలో మళ్లీ సిగరెట్‌పై దుమారం - రాజ్యసభలో వైద్యులు, సిబ్బంది భద్రత బిల్లు

**న్యూఢిల్లీ, డిసెంబరు 12:** వాయు కాలుష్యంతోపాటు అన్ని అంశాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శుక్రవారం లోక్‌సభలో ప్రకటించారు. అంతకు ముందు ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ రాజధాని ఢిల్లీతోపాటు దేశంలోని ప్రధాన నగరాలన్నీ విషపూరిత గాలితో కమ్ముకున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందని అంటూ వాయుకాలుష్యంపై చర్చ జరగాలన్నారు. కోట్లాది మంది పిల్లల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోంది, ఈ సమస్య రాజకీయాలకతీతమైందని, ప్రభుత్వం ప్రతిపక్షం కలిసి చర్చించి ఒక వ్యవస్థాత్మక ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీ, ముంబై చెన్నై, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రధాన నగరాల్లో కాలుష్యం నిరంతరం పెరుగుతున్నందున, ఒక్కో నగరానికి విడి ప్రణాళిక అవసరమని చెప్పారు. ఊపిరితిత్తుల సమస్యలు, క్యాన్సర్ ప్రమాదం పెరుగుతోందని, ఇది జాతీయ ఆరోగ్య సంక్షోభమని రాహుల్ హెచ్చరించారు. ప్రభుత్వం-ప్రతిపక్షం కలిసి ఒకే వేదికపై చర్చించి, ప్రజలకు సానుకూల సందేశం ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో పెరుగుతున్న కాలుష్యంపై చర్చ నిర్వహించి, ప్రతి మెట్రో నగరానికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాలని ప్రధాని ముందుకు రావాలని రాహుల్ సూచించారు. "ఇదొక పెద్ద సమస్య. అందరూ కలిసి పనిచేసి, తగిన చర్యలు తీసుకునేలా పార్లమెంట్‌లో సవివర చర్చ నిర్వహించాలి. ఒకరినొకరు విమర్శించుకునే చర్చలు కాకుండా, దేశానికి ఉపయోగపడే చర్చ జరగాలి. వచ్చే ఐదేళ్లలో అయినా, పది సంవత్సరాల్లో అయినా, కాలుష్యాన్ని పూర్తిగా నిర్మూలించలేకపోయినా కనీసం సమస్య తగ్గించే దిశగా ప్రభుత్వం ఒక పద్ధతిగల ప్రణాళికను తీసుకురావాలి" అని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు ప్రతిస్పందించిన కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, ప్రభుత్వం చర్చకు పూర్తిగా సిద్ధంగా ఉందని తెలిపారు. "ప్రాధాన్యం గల అన్ని అంశాలపై చర్చించేందుకు తాము మొదటి రోజు నుంచే సిద్ధం. సభ్యులందరి సూచనలను వినడానికి, వాటిని తీసుకోవడానికి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుంది. నియమాలు, నిబంధనల ప్రకారం ఈ చర్చను ఎలా తీసుకెళ్లాలన్నదాన్ని పరిశీలిస్తాం" అని రిజిజు చెప్పారు. అటు రాజ్యసభలోనూ ఢిల్లీ వాయు కాలుష్యంపై విపక్ష సభ్యులు పలు ప్రశ్నలు లేవనెత్తారు. దీనిపై కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంనరతి కీర్తివర్ధన్ సింగ్ ప్రకటన చేశారు. ప్రపంచ దేశాల్లో గాలి నాణ్యతపై అంతర్జాతీయ సంస్థలు ఇచ్చే నివేదికలను భారత్ అధికారికంగా స్వీకరించదని స్పష్టం చేశారు. ఆ నివేదికల్లో సలహాపూర్వక సిఫార్సులు ఉంటాయే తప్ప, నిర్బంధంగా భారత్ అమలు చేయాల్సిన మార్గదర్శకాలు ఉండవని ఆయన తేల్చి చెప్పారు. ప్రపంచ దేశాలు తమతమ స్థానిక అవసరాలు, భౌగోళిక, పర్యావరణ పరిస్థితులకు అనుగుణంగా గాలి నాణ్యతా ప్రమాణాలకు రూపకల్పన చేసుకునేందుకు డబ్ల్యూహెచ్‌ఓ నివేదిక సహాయకారిగా ఉంటుందే తప్ప, అదే ప్రామాణికంగా మారదని వివరించారు. దేశంలో ప్రజారోగ్యం, పర్యావరణ నాణ్యతల పరిరక్షణ కోసం 12 కీలక కాలుష్య కారకాలను కట్టడి చేయాలనే అంశంపై ఇప్పటికే నేషనల్ ఆంబియెంట్ ఎయిర్ క్వాలిటీ స్టాండర్డ్స్ (ఎన్‌ఏఏక్యూఎస్) సంస్థకు మార్గదర్శకాలను జారీచేశామని పేర్కొన్నారు. పార్లమెంట్ పరిసరాల్లో టిఎంసి ఎంపి సౌగతా రాయ్ సిగరెట్ తాగారని బిజెపి సభ్యులు గురువారం లోక్‌షభలో స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు. శుక్రవారం రాతపూర్వకంగా ఓం బిర్లాకు అనురాగ్ ఠాకూర్ ఫిర్యాదు చేశారు. తాజా పరిణామాలపై పార్లమెంట్ వెలుపల సౌగతా రాయ్ స్పందిస్తూ, ఢిల్లీలో కాలుష్యాన్ని తగ్గించడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. కాలుష్య సమస్య నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. సభ లోపల సిగరెట్లు తాగడంపై నిషేధం ఉంది. కానీ, సభ వెలుపల బహిరంగ ప్రదేశంలో సిగరెట్లు తాగడానికి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ఒక్క సిగరెట్ తాగడం వల్ల కాలుష్యమేమీ పెరిగిపోదన్నారు. ఇక పార్లమెంట్‌లో ఇ-సిగరెట్ తాగడానికి సంబంధించిన రుజువులు ఏమున్నాయో బయటపెట్టాలన్నారు.


## మాజీ స్పీకర్ శివరాజ్‌పాటిల్ కన్నుమూత



**ముంబయి, డిసెంబరు 12:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి, లోక్‌సభ మాజీ స్పీకర్ శివరాజ్ పాటిల్ (90) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, మహారాష్ట్రలోని లాతూర్‌లో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో కీలక పదవులను అలంకరించిన శివరాజ్ పాటిల్, దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. శివరాజ్ పాటిల్ రాజకీయ ప్రస్థానం చూస్తే 1972లో లాతూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన శివరాజ్ పాటిల్, రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా కూడా పనిచేశారు. 1980లో తొలిసారి లాతూర్ నుంచి లోక్‌సభకు ఎన్నికై జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించారు. అప్పటి నుంచి 1999 వరకు వరుసగా ఏడుసార్లు అదే స్థానం నుంచి ఎంపీగా గెలుపొంది రికార్డు సృష్టించారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ప్రభుత్వాల్లో రక్షణ, వాణిజ్యం, శాస్త్ర సాంకేతికత, పౌర విమానయానం వంటి పలు కీలక శాఖలకు మంత్రిగా సేవలందించారు. 1991 నుంచి 1996 వరకు లోక్‌సభ స్పీకర్‌గా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు.

# మహారాష్ట్రలో 'మహాక్రైమ్‌ఓఎస్'ను ఆవిష్కరించిన మైక్రోసాఫ్ట్ ఛైర్మన్ సత్యనాదెళ్ల

**ముంబయి, డిసెంబర్ 12:** సైబర్ నేరాల దర్యాప్తును వేగవంతం చేసే లక్ష్యంతో రూపొందించిన 'మహాక్రైమ్‌ఓఎస్ఏఐ' ప్లాట్‌ఫామ్‌ను మైక్రోసాఫ్ట్ ఛైర్మన్, సిఇఒ సత్యనాదెళ్ల శుక్రవారం ఆవిష్కరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మైక్రోసాఫ్ట్ అజూర్ టెక్నాలజీతో పనిచేసే ఈ వ్యవస్థ, పోలీసు అధికారులకు దర్యాప్తులో సహాయపడనుంది. మానవ నైపుణ్యాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానించి, కేసులను వేగంగా, సమర్థవంతంగా పరిష్కరించడానికి ఇది దోహదపడుతుంది. భారత్‌లో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయి. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ప్రకారం, 2024లోనే దేశంలో 36 లక్షలకు పైగా సైబర్ నేరాలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో దర్యాప్తు సంస్థలకు అండగా నిలిచేందుకు సైబర్ఐ, మహారాష్ట్ర ప్రభుత్వ సంస్థ మార్వెల్, మైక్రోసాఫ్ట్ ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్ కలిసి ఈ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేశాయి. ప్రస్తుతం నాగ్‌పూర్‌లోని 23 పోలీస్ స్టేషన్లలో దీన్ని విజయవంతంగా అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ ఈ వ్యవస్థ పనితీరును ప్రశంసించారు. భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న



1,100 పోలీస్ స్టేషన్లకు మహాక్రైమ్‌ఓఎస్ ఏఐ సేవలను విస్తరించాలని ప్రతిపాదించారు. 'పరిపాలన విధానాలను మార్చే ఏఐ కాపిలట్‌లను అభివృద్ధి చేయడమే మా లక్ష్యం. సైబర్ నేరాల పరిష్కారంతో మైక్రోసాఫ్ట్‌తో మా భాగస్వామ్యం మొదలైంది. దీని సామర్థ్యం ఇంకా చాలా పెద్దది అని ఆయన తెలిపారు. మైక్రోసాఫ్ట్ అజూర్ ఓపెన్ఏఐ సర్వీస్ ఆధారంగా పనిచేసే ఈ ప్లాట్‌ఫామ్‌లో ఏఐ అసిస్టెంట్లు, ఆటోమేటెడ్ వర్క్‌ఫ్లోలు ఉంటాయి. ఇది డిజిటల్ సాక్ష్యాలను విశ్లేషించడానికి, కేసులను అనుసంధానించడానికి, నేర చట్టాలపై సమాచారాన్ని అందించడానికి ఉపయోగపడుతుంది.

# మద్రాసు హైకోర్టులో ఏదోతప్ప జరుగుతోంది!

## కరూర్ కేసు విచారణలో సుప్రీం ధర్మాసనం సీరియస్



**న్యూఢిల్లీ, డిసెంబరు 12:** మద్రాస్ హైకోర్టులో కేసుల లిస్టింగ్, విచారణకు సంబంధించి అనుసరిస్తున్న నిబంధనలపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. అక్కడ ఏదో తప్పు జరుగుతోందని వ్యాఖ్యానిస్తూ, దీనిపై పూర్తి వివరణ ఇవ్వాలని హైకోర్టును ఆదేశించింది. ఈ కేసులో మద్రాస్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ప్రతివాదిగా చేర్చి నోటీసులు జారీ చేసింది. నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి సంబంధించిన కరూర్ తొక్కిసలాట కేసు విచారణ సందర్భంగా జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. కరూర్ ఘటనపై మద్రాస్ హైకోర్టులోని రెండు వేర్వేరు బెంచ్‌లు పరస్పర విరుద్ధమైన తీర్పులు ఇవ్వడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఈ ఘటనపై సీబీఐ విచారణను మధురై బెంచ్ తిరస్కరించగా, కేవలం రోడ్‌షోలకు మార్గదర్శకాలు కోరుతూ దాఖలైన పిటిషన్‌పై చెన్నై బెంచ్ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో విచారణకు ఆదేశించడాన్ని అనుచితమని గతంలోనే సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. విచారణ సందర్భంగా జస్టిస్ జేకే మహేశ్వరి మాట్లాడుతూ, హైకోర్టులో ఏదో తప్పు జరుగుతోంది. మేం దీన్ని పరిశీలించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. తమిళనాడు ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ఎన్.కె. కౌల్ వాదనలు వినిపిస్తూ.. ఈ ఘటనపై తాము ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్‌పై స్టేను ఎత్తివేయాలని కోరారు. అయితే, ముందుగా హైకోర్టు పనితీరుకు సంబంధించిన అంశాన్ని తేలుస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. సెప్టెంబర్ 27న కరూర్‌లో జరిగిన ఈ తొక్కిసలాటలో 41 మంది మరణించగా, 60 మందికి పైగా గాయపడిన విషయం తెలిసిందే.

# 75వ పుట్టినరోజు జరుపుకున్న సూపర్‌స్టార్ రజనీకాంత్

**చెన్నై,డిసెంబరు 12:** సినీ ప్రపంచంలో "సూపర్ స్టార్" అంటే ముందుగా గుర్తొచ్చేది రజనీకాంత్ పేరే. పరిచయం అవసరం లేని ఈ మహా నటుడు తన స్టైల్ , మాట తీరు, వినయం, సరళమైన జీవనశైలి అతనిని ఉన్నత స్థాయికి చేర్చాయి. ఈ రోజు రజనీకాంత్ 75వ పుట్టినరోజు పురస్కరించుకొని, ఆయనకి అభిమానులు, పలువురు సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. 1950 డిసెంబర్ 12న బెంగళూరులోని మధ్యతరగతి మారాఠీ కుటుంబంలో శివాజీ రావు గైక్వాడ్ గా జన్మించిన రజనీ చిన్నతనంలోనే కష్టాలు ఎదుర్కొన్నారు. పోలీస్ కానిస్టేబుల్ అయిన తండ్రి రామోజీరావు, గృహిణి తల్లి జిజాబాయికి జన్మించిన రజనీకి చిన్న వయసులోనే తల్లి కోల్పోవడం పెద్ద దెబ్బేంది. కుటుంబ పరిస్థితులు క్షీణించడంతో చదువు పూర్తయ్యాక బెంగళూరు ట్రాన్స్‌పోర్ట్‌లో బస్ కండక్టర్‌గా ఉద్యోగం చేపట్టారు. అయితే నటనపై ఉన్న ఆయన ప్రేమ మాత్రం ఎప్పుడూ తగ్గలేదు. జీతం నుంచి సొమ్ము సేవ్ చేసి నటనా తరగతుల్లో చేరి తన కలను కొనసాగించారు. ఈ నటనాభిలాష ఆయనను చివరకు చెన్నై ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ వరకు తీసుకెళ్లింది. అక్కడే ఆయన జీవితంలో కీలక మలుపు. దర్శకుడు కే. బాలచందర్. రజనీ ఎనర్జీ, నటనను చూసి ఇక నుండి నీ పేరు రజనీకాంత్. నువ్వు స్టార్ అవుతావు అని చెప్పి సినీరంగంలోకి పరిచయం చేశారు. అలా 1975లో అపూర్వ రాగాలు ద్వారా తొలిసారి స్క్రీన్‌పై కనిపించిన రజనీ, చిన్న పాత్రలోనే ప్రేక్షకులను ఆకర్షించాడు. 1975-1978 మధ్య 50కి పైగా సినిమాల్లో నటిస్తూ నెగటివ్ రోల్స్ , గంభీర పాత్రలతో ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. 1978లో భైరవి విడుదలై రజనీకి హీరోగా మంచి పేరు తెచ్చింది.. అక్కడినుంచే సూపర్ స్టార్ బిరుదు పాపులర్ అయింది. తర్వాత అన్నామలై, ముళ్ల మలార్, మూండ్రు ముగం వంటి సినిమాలతో ఆయన నటనా పటిమని చూపించారు. 1980-1990 మధ్య రజనీ సౌత్ లో దేవుడి స్థాయిలో క్రేజ్ తెచ్చుకున్న కాలం. బాషా (1995) అయితే రజనీకాంత్‌కి కెరీర్‌లోనే ఒక మైలురాయి. ఒక్కసారి చెప్తే వంద సార్లు చెప్పినట్టే'వంటి డైలాగ్స్ ఆయన స్టార్‌డమ్‌ను ఆకాశానికెత్తాయి. తర్వాత శివాజీ (2007), ఎంథిరన్/రోబో (2010), 2.0 (2018) వంటి భారీ చిత్రాలతో రజనీ పాన్‌ఇండియా, అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు. హిందీ చిత్రాల్లోనూ నటించి దేశవ్యాప్తంగా ప్రజాదరణ పొందారు. ముత్తురామన్‌రజనీ కాంబో 20కి పైగా హిట్లు ఇచ్చి తమిళ సినీరంగంలో ఐకానిక్ జంటగా నిలిచింది. యాక్షన్ సీన్స్ విషయానికి వస్తే, రజనీ స్టంట్స్ చాలా వరకు స్వయంగా చేయడం ఆయన ప్రత్యేకత. 2011లో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చినా, సింగపూర్‌లో చికిత్స తర్వాత రజనీ మళ్లీ నిలబడటం ఆయన మనోబలానికి నిదర్శనం. 2014లో సోషల్ మీడియాలోకి వచ్చిన రోజే లక్షన్నర ఫాలోవర్లను సంపాదించడం రజనీ గ్లోబల్ పాపులారిటీని మరోసారి నిరూపించింది. జపాన్‌లో ముత్తు రికార్డులు, జైలర్ బ్లాక్‌బస్టర్‌గా 500 కోట్లు దాటింది.

# సంక్షిప్తంగా..

## సితామర్హి జిల్లాలో 7400 మందికి హెచ్‌ఐవి




**పాట్నా, డిసెంబరు 12:** ప్రభుత్వాలు ఎంతగా ప్రచారం చేస్తున్నా హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో సరైన అవగాహన కొరవడుతూనే ఉంది. ఫలితంగా ప్రమాదకరమైన ఈ వైరస్ వ్యాప్తి కొన్ని ప్రాంతాల్లో ఆందోళనకర స్థాయిలో కొనసాగుతోంది. బీహార్‌లోని సీతామర్హిజిల్లాలో హెచ్‌ఐవీ మహమ్మారి విజృంభిస్తోంది. జిల్లావ్యాప్తంగా ఏకంగా 7,400 మంది ఈ వైరస్ బారిన పడినట్లు అధికారిక నివేదిక వెల్లడించడం తీవ్ర కలకలం రేపుతోంది. మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, బాధితుల్లో 400 మంది చిన్నారులు కూడా ఉండటం. జిల్లా ఆసుపత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో నిర్వహించిన వైద్య పరీక్షల్లో ఈ షాకింగ్ వాస్తవాలు బయటపడ్డాయి. వైరస్ బారిన పడిన చిన్నారులకు వారి తల్లిదండ్రుల నుంచే ఈ వ్యాధి సంక్రమించినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లిదండ్రుల్లో ఎవరికి హెచ్‌ఐవీ ఉన్నా, పుట్టబోయే పిల్లలకు ఈ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని వారు వివరిస్తున్నారు.

## కర్ణాటకలో డికె విందు రాజకీయం



**బెంగళూరు, డిసెంబర్ 12:** కర్ణాటక రాజకీయాలు కొన్ని నెలలుగా చర్చనీయాంశమవుతున్నాయి. ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలు, బ్రేక్‌ఫాస్ట్ మీట్‌లు వార్తల్లో నిలుస్తున్నాయి. ఇప్పుడు డిప్యూటీ సిఎం డికె శివకుమార్ విందు రాజకీయం చేశారు. గురువారం రాత్రి 30 మందికి పైగా ఎమ్మెల్యేలతో కలిసి శివకుమార్ డిన్నర్ చేశారు. వారిలో కొందరు మంత్రులు కూడా ఉన్నారని, కాంగ్రెస్ నేత ప్రవీణ్ ఫామ్‌హౌస్‌లో ఈ మీటింగ్ జరిగిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. బిజెపి నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యేలు ఎస్‌టీ సోమశేఖర్, శివరామ్ హెబ్బర్ కూడా ఈ డిన్నర్‌కు వచ్చినట్లు పేర్కొన్నాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కొందరు మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఒకరోజు ముందు ఇలాంటి డిన్నర్‌లోనే పాల్గొనడం గమనార్హం. వారికి బెళగావి నార్త్ ఎమ్మెల్యే ఫిరోజ్ ఆతిథ్యం ఇచ్చారు.

## క్రిప్టో మొఘల్ డూ క్వాన్‌కు 15 యేళ్ల జైలుశిక్ష



**న్యూయార్క్, డిసెంబరు 12:** క్రిప్టో కరెన్సీ టైకూన్ డూ క్వాన్‌కు 15 యేళ్ల జైలుశిక్ష పడింది. అమెరికా కోర్టు ఈ శిక్ష ఖరారు చేసింది. డూ క్వాన్ కంపెనీ అవకతవకలకు పాల్పడింది. దీని వల్ల సుమారు 40 బిలియన్ డాలర్ల క్రిప్టో పెట్టుబడులు ఆవిరైపోయాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా క్రిప్టో మార్కెట్ పతనమైనట్లు ఆరోపణలు ఉన్నాయి. క్వాన్ రెండు రకాల డిజిటల్ కరెన్సీలను నడిపారు. న్యూయార్క్ కోర్టు అతనికి శిక్ష వేసింది. ఆగస్టులో జరిగిన విచారణ సమయంలో అతను తప్పు చేసినట్లు అంగీకరించాడు. డూ క్వాన్‌ను పట్టుకునేందుకు పోలీసులు ఆసియా, యూరోప్ దేశాల్లో అన్వేషించారు. క్రిప్టోకు చెందిన టెర్రా కంపెనీని అతడు స్థాపించాడు. శిక్షలో భాగంగా తొలుత అమెరికాలో ఆ తర్వాత దక్షిణకొరియాలో సగం శిక్షను అనుభవించనున్నారు. 40 బిలియన్ల డాలర్ల ఫ్రాడ్ వల్ల.. 2022లో స్టాక్ మార్కెట్‌లో ఎఫ్‌టిఎక్స్ కుప్పకూలింది.

## బ్రిటన్ మ్యూజియంలో భారీ చోరీ


**లండన్, డిసెంబర్12:** బ్రిటన్‌లోని బ్రిస్టల్ నగరంలో ఉన్న ఒక మ్యూజియంలో భారీ దొంగతనం జరిగింది. దుండగులు 600కు పైగా అత్యంత విలువైన వస్తువులను అపహరించారు. వాటిలో బ్రిటిష్ కాలంనాటి భారతీయ కళాఖండాలు కూడా ఉండటం గమనార్హం. ఈ ఘటనపై స్థానిక పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి, ప్రజల సహాయం కోరుతున్నారు. బ్రిస్టల్‌లోని బ్రిటిష్ ఎంపైర్ అండ్ కామన్వెల్త్ మ్యూజియంలో సెప్టెంబర్ 25న తెల్లవారుఝామున 1 నుంచి 2 గంటల మధ్య ఈ చోరీ జరిగింది. గల్లంతయిన వస్తువులలో ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారికి చెందిన నడుము పట్టీ బకిల్, దంతంతో చేసిన బుద్ధుడి విగ్రహంవంటి అమూల్యమూన భారతీయ వస్తువులు ఉన్నాయి. ఈ కళాఖండాలు బ్రిటిష్ చరిత్రకు సంబంధించిన కీలక ఆధారాలని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై ఎవాన్ అండ్ సోమర్‌సెట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నలుగురు అనుమానితులు ఉన్న ఒక సిసిటివి ఫుటేజ్‌ను విడుదల చేశారు.

13-12Pg6exHMNWJQEV 10_13-12Pg6exHMNWJQEV.qxd 12/Dec/25 11:51 PM Page 1



# ఎపి రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించండి

## ● కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ



విజయవాడ, డిసెంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పిస్తూ విభజన చట్టాన్ని సవరించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. ఈ లేఖలో ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా అమరావతిని 2024 జూన్ 2వ తేదీ నుంచి చేరుస్తూ విభజన చట్టంలోని సెక్షన్ 5(2)ను సవరించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. చట్టాన్ని సవరించాలని విజ్ఞప్తి చేసింది. ఎప్పటి నుంచి దాన్ని అమల్లోకి తేవాలో స్పష్టత ఇవ్వాలంటూ కేంద్ర హోం శాఖ ఈ నెల 1వ తేదీన రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆ అంశంపై స్పష్టత ఇస్తూ కేంద్ర హోం శాఖకు తాజాగా లేఖ పంపారు. అంతేకాకుండా 2024 జూన్ 2వ తేదీ నుంచి అమరావతి ఏపీ రాజధానిగా ఉంటుందని విభజన చట్టంలోని సెక్షన్ 5(2)లో చేర్చాలని కోరారు. విభజన చట్టంలో హైదరాబాద్ పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా ఉంటుందని చెప్పిన నేపథ్యంలో 2024 జూన్ 2 నుంచి అమరావతిని ఏపీ రాజధానిగా పేర్కొనడం సబబుగా ఉంటుందని కేంద్ర హోం శాఖ కార్యదర్శికి తెలిపారు.

అందుకు దీని ఆధారంగా కేంద్ర హోం శాఖ కేబినెట్ నోట్ తయారుచేసి, మంత్రివర్గం ముందుకు తీసుకెళ్లనున్నట్లు తెలిసింది. ఈ ప్రతిపాదనకు డిసెంబర్ చివరి వారానికల్లా కేబినెట్ ఇందుకు ఆమోదముద్ర వేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ చట్టసవరణ బిల్లు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సమావేశాల ముందుకు రావొచ్చునని సమాచారం. ఇక అమరావతికి రాజధాని హోదా 2014 నుంచి ఇవ్వాలా? 2024 నుంచి ఇవ్వాలా? అన్న సాంకేతిక అంశంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని స్పష్టత అడిగారు. ఈసారి కాకపోయినా వచ్చే సమావేశాల్లోనయినా పార్లమెంటులో పెట్టిస్తామని పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల అమరావతిలో 16 జాతీయ సంస్థల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. రూ.3,000 వేల కోట్లన వ్యయంతో కేంద్ర సచివాలయం, అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్, కాగ్ కార్యాలయం, పోస్టల్ శాఖ ప్రాంతీయ కార్యాలయం, కేంద్రీయ విద్యాలయాలు, రూ.2,500 కోట్లతో రైల్వే లైన్, ఔటర్ రింగ్‌రోడ్ ఇలా అన్నీ వస్తున్నాయి. దీంతో పాటు ఇప్పుడు కొన్ని వేల మంది కార్మికులు రాత్రింబవళ్లు పనిచేసి అమరావతిని నిర్మిస్తున్నారని పెమ్మసాని వివరించారు.

### సమన్వయంతోనే సాధ్యమన్న కేంద్ర మంత్రి

గుంటూరు లోక్‌సభ స్థానం పరిధిలో ఈఎస్ఐ ఆసుపత్రి కోసం మా కార్యాలయ సిబ్బంది 30సార్లు సంబంధిత విభాగాల వద్దకు, నేను ఐదుసార్లు ఆ మంత్రుల వద్దకు వెళ్లాల్సి వచ్చింది. ఒక చిన్న ఆసుపత్రికే ఇంత పని ఉంటే, మహా నగరాన్ని నిర్మించి, అందులోకి ఇన్ని సంస్థలను తీసుకు రావాలంటే కేంద్ర, రాష్ట్రాల మధ్య ఎంత సమన్వయం ఉండాలో అర్థం చేసుకోవాలని రాష్ట్ర ప్రజలను కోరుతున్నానని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఇవన్నీ చేయటం చేతకాకే జగన్ కేవలం బటన్ నొక్కుడుతోనే ఐదేళ్లూ గడిపేశారు. ఆయన కనీసం ఒక్క ప్రాజెక్టు పూర్తిచేసి ఉంటే అభివృద్ధి చేయడం ఎంత కష్టమో అర్థమయ్యేదని ఈ సందర్భంగా రాజధాని అమరావతిని ఉద్దేశించి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.






# రాజధాని ప్రాంత వినోద కేంద్రం మంగినపూడి బీచ్‌కు మహర్దశ

● రూ.150 కోట్లతో అభివృద్ధి
● రాష్ట్ర ప్రభుత్వం తాజా నిర్ణయం

విజయవాడ, డిసెంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: బందరు (మచిలీపట్నం) మంగినపూడి బీచ్‌కి రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎన్నో గాథలకు, చరిత్రకు ఇదో వేదిక, కవులను, రచయితలను, ప్రకృతి ప్రేమికులకు ఈ సముద్ర తీరం ఓ వస్తువు, నెలవు, విశాఖ బీచ్ తరువాత అంత గుర్తింపు ఉన్న ఈ బీచ్ ఎందుకో అనుకున్నంతగా అభివృద్ధి చెందలేదు. రాష్ట్ర రాజధాని అమరావతి, విజయవాడ, హైదరాబాద్ చుట్టు పక్కల ప్రాంతాలకు దగ్గరగా ఉన్న విస్తారమైన సముద్ర తీరం ఇదే. మంగినపూడి వద్ద మసులా బీచ్ ఫెస్టివల్ అంగరంగ వైభవంగా నిర్వహించారు. అదే విధంగా కార్తిక స్నానాల సమయంలో బీచ్ పర్యాటకులతో కిటకిటలాడుతుంది. లక్షల్లో జనం రావడంతో సందడి వాతావరణం నెలకొంది. బీచ్ వారాంతాల్లోనూ పెద్ద ఎత్తున పర్యాటకులు వచ్చి సందడి చేస్తారు. సరైన వసతులు లేకపోవడంతో కొద్ది సేపు ఉండి వెళ్లిపోతున్నారు. ప్రభుత్వం చొరవతో త్వరలో స్నానపు గదులు, విశ్రాంతి భవనాలు, హోటళ్లు వంటి వసతులు సమకూరనుంది. తాజాగా ఈ బీచ్ అభివృద్ధికి ప్రభుత్వం భారీగానే నిధులు కేటాయించింది. దాంతో బీచ్ అభ్రిద్ధి పనులు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా రూ.157.33 కోట్ల అంచనా వ్యయంతో మంగినపూడి తీరం వద్ద లార్జ్ అవ్యూజ్‌మెంట్ పార్కు కమ్ రిసార్టులు నిర్మించనున్నారు. ఇప్పటికే మైరా బే వ్యూ రిసార్ట్స్ సంస్థకు 20 ఎకరాల భూమి కేటాయించినట్లు పర్యాటక శాఖ తెలిపింది. రిసార్టుల ప్రాజెక్టులో 30 వేల చదరపు అడుగుల్లో అవ్యూజ్‌మెంట్ పార్కు, 25వేల చ.అ. వాటర్ పార్కు, రైడ్స్, 150 గదులు, 5 రెస్టారెంట్లు, బార్, కన్వెన్షన్ సెంటర్ 16 వేల చదరపు అడుగుల్లో, వెల్‌నెస్ స్పాలు, స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు కానున్నాయి. వీటి ద్వారా ప్రత్యక్షంగా 380, పరోక్షంగా 600 మందికి ఉపాధి లభించనుంది. దీంతో మంగినపూడి తీరం ఆతిథ్య, వినోద కేంద్రానికి నెలవుగా మారనుందని ఆశాభావం అందరిలో వ్యక్తం అవుతోంది. మంగినపూడి తీరంలో పర్యాటక అభివృద్ధికి 83 ఎకరాలు భూమి కేటాయించాలని మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టారు. ఇందులో రోడ్ల నిర్మాణానికి 16 ఎకరాలు పోను మిగిలిన 64 ఎకరాల్లో రిసార్టులు, రెస్టారెంట్లు, స్నానపు గదులు, పలు భవనాలు, హోటళ్ల తదితర ప్రైవేటు, ప్రభుత్వ సౌకర్యాల కల్పన కోసం భూమి కేటాయించేందుకు అనుమతించాలని కోరారు. ఈ ఏడాది మసూలా బీచ్ ఫెస్టివల్‌కు మంచి గుర్తింపు రావడంతో మంత్రి కొల్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. బీచ్ పర్యాటకానికి మంగినపూడి అనుకూలమైంది. పలు నిర్మాణాలు చేపట్టే విధంగా సౌకర్యాల కల్పనకు భూమి కేటాయింపు అనుమతులపై ప్రభుత్వానికి ప్రతిపాదన పెట్టాం. త్వరలో తీరంలో సౌకర్యాలు ఏర్పాటు కానున్నాయని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ తెలిపారు. బీచ్‌లో అనేక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. వీటి ద్వారా ప్రత్యక్షంగా 380, పరోక్షంగా 600 మందికి ఉపాధి లభించనుంది. దీంతో మంగినపూడి తీరం ఆతిథ్య, వినోద కేంద్రానికి నెలవుగా మారనుందని ఆశాభావం అందరిలో వ్యక్తం అవుతోంది.

# తేమ 18% వరకు ఉన్నా పత్తి కొనుగోలు చేయండి

### లోక్‌సభలో కేంద్రానికి ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు విజ్ఞప్తి



విజయవాడ, డిసెంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: పత్తి కొనుగోళ్ళ విషయంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) విధించిన కఠిన నిబంధనల కారణంగా రైతులు విధి లేని పరిస్థితుల్లో తమ పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని, అందువల్ల 18% తేమ ఉన్నా కొనుగోలు చేసేలా నిబంధనల నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయులు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఆయన లోక్‌సభలో నిన్నజీరో అవర్‌లో దీనిపై మాట్లాడారు. 'పత్తి కొనుగోలు చేయాలంటే అందులో తేమశాతం 8-12%కి మించకూడదన్న నిబంధన రైతులకు గుదిబండగా మారింది. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితుల కారణంగా తీర ప్రాంతంలో తేమశాతం దీనికంటే ఎక్కువగా ఉంటుంది. రైతులకు ఎల్1/ ఎల్2/ ఎల్3 జిన్నింగ్ మిల్లులు కేటాయించడం వల్ల వాళ్ళు తమ సమీపంలో ఉన్న మిల్లులను ఎంచుకొనే వీల్లేకుండా పోతోంది. దానివల్ల వారు తక్కువ ధరలకే దళారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. అందువల్ల ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సిసీఐ నిబంధనలను సడలించాలి. అదే సమయంలో అన్ని జిన్నింగ్ మిల్లులను తెరిచి 18% వరకు తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేసి ఆ నిష్పత్తి ప్రకారం కనీస మద్దతు ధర చెల్లించేలా నిర్దేశించాలి. వర్షం నీరు తాకిన, రంగుమారిన పత్తిన ప్రత్యేక కేటగిరీ కింద తగిన ధరకు కొనుగోలు చేయాలి. రాష్ట్ర రైతులు ఇప్పటికే పలు వైపరీత్యాలతో ఇబ్బందులు పడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో నిబంధనలతో వారి కష్టాలను రెట్టింపు చేయడం భావ్యం కాదు. వ్యవసాయదారుల జీవనోపాధిని రక్షించి, రాష్ట్రంలో పత్తి సాగును కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని రైతులను ఆదుకోవాలి. దేశంలో అత్యధికంగా పత్తి సాగుచేసే తొలి ఐదు రాష్ట్రాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ యేటా 20 లక్షల బేళ్ళు అందిస్తోంది. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో 5.39 లక్షల హెక్టార్లలో పంట సాగైంది. సుమారు 8 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. అయితే మొంథా తీవ్ర తుఫాను కారణంగా 1.08 లక్షల హెక్టార్లలో పంట దెబ్బతింది. సుమారు 1.25 లక్షల టన్నుల పత్తి రంగు మారింది. తీరప్రాంతంలోని ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని రైతులు తీవ్ర ప్రభావానికి గురయ్యారు' అని లావు శ్రీకృష్ణదేవరాయులు పేర్కొన్నారు.

# కొత్త ప్రాజెక్టులు నిర్మించకుండా తెలంగాణను నిలువరించాలి

### కేంద్ర జలశక్తి శాఖ, జల సంఘం, కృష్ణా బోర్డులకు ఎపి లేఖ

విజయవాడ, డిసెంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో కొత్త ప్రాజెక్టులను నిర్మించకుండా తెలంగాణను అడ్డుకోవాలని కేంద్రాన్ని, రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ కేంద్ర జలశక్తి కార్యదర్శికి తాజాగా లేఖ రాశారు. 'కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో 16 ప్రాజెక్టులకు సంబంధించి డీపీఆర్‌ల తయారీకి తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇది ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో నష్టం కల్గిస్తుంది. రాష్ట్ర విభజన చట్టానికి ఇది పూర్తిగా విరుద్ధం. పైగా ప్రస్తుతం ఈ అంశాలు ట్రిబ్యునల్ పరిధిలో ఉన్నాయి. కేంద్రం, ట్రిబ్యునల్‌కు అదనపు అంశాల కింద కొన్ని అంశాలు పరిశీలించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణ 16 కొత్త ప్రాజెక్టులకు డీపీఆర్ తయారీకి పూనుకోవడం కోర్టు ఉల్లంఘన కిందకు వస్తుంది' అని అందులో పేర్కొన్నారు.

కేంద్ర జలసంఘం ఛైర్మన్‌కు, కృష్ణానదీ యాజమాన్య బోర్డు ఛైర్మన్‌కు సైతం ఆ లేఖలు పంపారు. అందులో రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ఇప్పటికే 42 కొత్త ప్రాజెక్టులను చేపట్టింది. ఈ అంశంపై కృష్ణా బోర్డుకు ఫిర్యాదు చేశాం. కేంద్ర జల్ శక్తికి, కేంద్ర జలసంఘానికి కూడా ఫిర్యాదులు ఇచ్చాం. ఆ ప్రతులూ ఇక్కడ జత చేస్తున్నాం. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఏ రాష్ట్రమైనా కొత్త ప్రాజెక్టులు చేపట్టాలంటే కృష్ణా బోర్డు, కేంద్ర జల సంఘం ముందుంచిన తర్వాత ఎపెక్స్ కౌన్సిల్ ఆమోదం మేరకే వాటిని చేపట్టవలిసి ఉంటుంది. కేంద్ర జలసంఘం సాంకేతికంగా, ఆర్థికంగా మదింపు చేయని, కేంద్ర జలవనరుల శాఖ నుంచి సాంకేతిక సలహా కమిటీ ఆమోదం పొందని ఏ ప్రాజెక్ట్ అయినా కొత్త ప్రాజెక్టుగానే పరిగణిస్తామని రెండో ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం తీర్పు చెప్పింది. రాష్ట్ర విభజనకు ముందు చేపట్టినా, తర్వాత చేపట్టినా అలాంటి ప్రాజెక్టు కొత్త ప్రాజెక్టుగానే పరిగణిస్తామని ఎపెక్స్ కౌన్సిల్ పేర్కొంది. తెలంగాణ కొత్తగా నోటిపై చేసిన 16 సాగునీటి ప్రాజెక్టులు కొత్తవే. ఈ నేపథ్యంలో కొత్త ప్రాజెక్టులకు ఎలాంటి హైడ్రాలాజికల్ అనుమతులు ఇవ్వకుండా చూడాలి. ఎపెక్స్ కౌన్సిల్ ఆమోదం లేకుండా కొత్త ప్రాజెక్టులు చేపట్టవద్దని తెలంగాణ రాష్ట్రాన్ని కేంద్ర జల్‌శక్తి కార్యదర్శి ఆదేశించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరింది.

# విధుల్లో చేరిన గనుల శాఖ అధికారులకు పోస్టింగ్‌లు

విజయవాడ, డిసెంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: దాదాపు 13 నెలల పాటు సెలవులో ఉండి, ఇటీవలే విధుల్లో చేరిన గనుల శాఖ అధికారులకు పోస్టింగ్‌లిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఇద్దరు ఉపసంచాల కులు, నలుగురు సహాయ సంచాలకులకు గతంలో వారు పనిచేసిన స్థానాల్లో పోస్టింగ్‌లు ఇచ్చినప్పటికీ, వర్కింగ్ ఎరేంజ్‌మెంట్ కింద ఇతర చోట్ల విధులు అప్పగిస్తూ, మెమో జారీ చేసింది. మరికొందరికి స్థానచలనం కల్గింది. ఉప సాచాల కుల్లో బి.జగన్నాథరావుకు విశాఖపట్నం పోస్టింగ్ ఇచ్చినా, కాకినాడలో విధులు కేటా యించారు. ఇ.నర్సింహారెడ్డికి విశాఖపట్నంలో విధులు అప్ప గించారు. కర్నూలు డీడీగా ఉన్న రవిచంద్‌కు, సంచాలకుడి కార్యాలయంలో మెరిట్‌లో విధులు కేటాయించారు. ఇప్పటి వరకు మెరిట్‌లో డీడీగా ఉన్న జి.వెంకటేశ్వర్లుకు కర్నూలు డీడీగా విధులు అప్పగించారు. అన్నమయ్య జిల్లా గనుల శాఖ అధికారి (రాయ చోటి) ఆర్.రాజేష్, పల్నాడు జిల్లా గనుల శాఖ అధికారి (నర్స రావు పేట) బి.నాగిణిలకు సంచాలకుడి కార్యాలయం లో విదులు కేటాయించారు. సాయిరామ్‌సింగ్‌కు రాయచోటిలో ఏడీగా విధులు అప్పగించారు. ఏడీ రవిప్రసాద్‌కు మార్కాపురం డివిజనల్ గనుల శాఖ అధికారిగా విధులు కేటాయించారు.




# కూటమి ప్రభుత్వానిది అసమర్థ పాలన

### - ఆర్భాటాలు తప్ప ఆచరణలో హామీల అమలు శూన్యం: షర్మిల

విజయవాడ, డిసెంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై, ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఏపీలో కూటమి పాలన బాగుందని ప్రధాని చెప్పడం చూస్తుంటే, పచ్చకామెర్లు సోకిన వ్యక్తికి లోకమంతా పచ్చగా కనిపించినట్లుందని ఎద్దేవా చేశారు. రైతులు, విద్యార్థులు, రోగులు పడుతున్న కష్టాలు ప్రధాని మోదీకి కనిపించడం లేదా అని ఆమె ప్రశ్నించారు. ఈ మేరకు షర్మిల ఒక ప్రకటన విడుదల చేశారు. "గిట్టుబాటు ధర లేక రైతులు పంటలను తగలబెడుతున్నా, తుపానులతో సర్వం కోల్పోయినా ప్రభుత్వం ఆదుకోలేని నిరక్ష్యం ప్రధానికి కనిపించదు. వెల్ఫేర్ హాస్టళ్లలో విద్యార్థుల మరణాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక వారి కష్టాలు, ఆరోగ్యశ్రీ నిలిచిపోవడంతో రోగుల వేదన ఆయన దృష్టికి రావడం లేదు" అని ఆమె పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని, హామీల అమలులో కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల హక్కులను, విభజన హామీలను కూటమి పార్టీలు ప్రధాని కాళ్ల దగ్గర తాకట్టు పెట్టాయని దుయ్యబట్టారు. "వాళ్లు తల ఊపమంటే ఊపే గొర్రెల్లా మారారు కాబట్టే, మోదీకి కూటమి పాలన భేష్ అనిపిస్తోంది. ప్రధాని హోదాలో ఉండి అబద్ధాలు ప్రచారం చేసినంత మాత్రాన నిజాలు దాగవు" అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వా నిది అసమర్థ పాలన అని, ఆర్భాటాలు తప్ప ఆచరణలో హామీల అమలు శూన్యమని విమర్శించారు.

# వేతనాలు పెంచాలని అంగన్వాడీల ఆందోళన



రాయచోటి టౌన్, డిసెంబరు 12 ప్రభాతవార్త: వేతనాలు పెంచాలని శుక్రవారం కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు భాగ్య లక్ష్మి, శ్రీలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఓబుళమ్మ, ఎఐటియుసి తరుపున సరోజ మాట్లాడారు. అంగన్‌వాడీ వర్కర్స్‌ను నాల్గవ తర గతి ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.24,300 ఇవ్వాలని, హెల్పర్లను మూడవ తరగతి ఉద్యోగులుగా మార్చి రూ.20,400 జీతం ఇచ్చేవరకు నిరవధిక పోరాటాలు చేస్తామని తెలిపారు. గ్రాట్యూటీ అమలు చేయాలని కోరారు. షరతులు లేకుండా 1810 మంది మినీ వర్కర్స్‌ను మెయిన్ వర్కర్స్‌గా చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి యాప్‌ల పేరుతో పని భారం పెంచిందే కానీ వేతనం పెంచలేదని మండి పడ్డారు. ప్రమోషన్‌లు ఇవ్వాలని రిటైర్ట్ మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, జనాభా కానుగుణంగా కొత్త అంగన్వాడీ కేంద్రాలు తెచ్చి పేద బాలింతలకి గర్భవతులకి ఆహార, ఆరోగ్య సేవలు అందించాలని కోరారు. కనీస వేతనాలతో పాటు పెండింగ్ జీతాలు, బిల్లులు సకాలంలో ఇవ్వాలని కోరుతూ కలెక్టర్ ఆఫీస లోకి పెద్ద ఎత్తున అంగన్వాడీలు దూసుకు పోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. అర్బన్ సిఐ బీవీ చలపతి బందోబస్త్ చేసి అంగన్వాడీలను, కార్మిక నాయకుల నిలువరిం చారు. తర్వాత పీడీ హైమావతికి, ఆర్‌డిఓ మధుసూదన్ రావుకి వినతిపత్రం ఇచ్చారు. ఈ నెల 16వ తేదీ అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి ఐసీడీస్ అధికారులతో, యూనియన్ ప్రతినిధులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి కృషి చేస్తానని హామీఇచ్చినట్లు తెలిపారు. అంగన్వాడీలకు మద్దతుగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మహేష్ సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్ ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మండెం.సుధీర్ కుమార్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు యం.గంగాధర్ జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధిగాళ్ల. శ్రీనివాసులు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి రంగారెడ్డిలతో పాటు జిల్లా నలుమూలల నుండి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.




# రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ యోగాసనా టోర్నీ

అనంతపురం, డిసెంబరు 12 ప్రభాతవార్త బ్యూరో: యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 12 నుండి 14 వరకు అనంతపురం శివారులోని ఆలమూరు రోడ్‌లోని పీవీకేకే ఇంజనీరింగ్ కాలేజ్ ప్రాంగణంలో 6వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ యోగాసనా చాంపియన్‌షిప్ 2025-26 కార్యక్రమం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని అసోసియేషన్ ఆఫ్ యోగాసనా స్పోర్ట్స్ రాష్ట్ర అధ్యక్షులు రాధిక, జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, శ్రీ బాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ పల్లె వెంకట్‌కృష్ణ కిషోర్, ఇతర పలువురు ప్రముఖులు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ బాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ పల్లె వెంకట్ కృష్ణ కిషోర్ మాట్లాడుతూ శారీరక ఆరోగ్యంతో పాటు, దృఢ సంకల్పం, ఏకాగ్రత, మనశ్శాంతి ఇవన్నీ యోగానే ఇస్తుందన్నారు. అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ యోగాసనా స్పోర్ట్స్ రాష్ట్ర అధ్యక్షురాలు రాధిక సమావేశంలో మాట్లాడుతూ ఎపిలో యోగాసన క్రీడను గ్రామస్థాయికి చేర్చడమే మా లక్ష్యమన్నారు. యోగాసనం కేవలం కళ మాత్రమే కాదు ఇది అంతర్జాతీయ స్థాయిలో భవిష్యత్తు ఉన్న స్పోర్ట్. సరైన ప్రోత్సాహం లభిస్తే మన రాష్ట్ర పిల్లలు కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో, ఒలింపిక్స్ వేదికపై కూడా మెరిసే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో షాప్ అబ్జర్వర్ నాగేంద్ర, మీనాక్షి పౌండేషన్ ఛైర్మన్ రమణ, తేజ ఇనిస్టిట్యూట్ నుంచి ఆదర్శ్, ఎంజీ మొబైల్స్ డైరెక్టర్ డాక్టర్ సోమనాథ, యోగాసన భారత్ పరిశీలకుడు నంద కృపాకర్, జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ సెక్రటరీ మారుతీ ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ దివాకర్, ట్రెజరర్ అంజనేయులు, వైస్ ప్రెసిడెంట్ వెంకట్, సభ్యులు పుల్లయ్య, తారక్ తదితరులు పాల్గొన్నారు. ఈ చాంపియన్ షిప్‌లో వివిధ యోగాసన విభాగాల్లో పోటీలు మూడు రోజుల పాటు జరుగనున్నాయి.

# ఎస్సీ పారిశ్రామికవేత్తలకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలు విడుదల చేయాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

విజయవాడ, డిసెంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో ఎస్సి పారిశ్రామికవేత్తలకు ఇవ్వాల్సిన సబ్సిడీ నిధులను వెంటనే విడుదల చేయాలని, వారిపై వివక్ష తగదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. దళిత పారిశ్రామికవేత్తలకు గత మూడేళ్లుగా రావాల్సిన పారిశ్రామిక సబ్సిడీలను విడుదల చేయడం లేదని చెప్పారు. దీంతో విసిగిపోయిన వారందరూ మంగళగిరిలోని ఎపిఐఐసి ప్రధాన కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారని పేర్కొన్నారు. మహిళలు, పిల్లలు అందరూ వచ్చి అక్కడ ఆందోళనలో పాల్గొంటున్నారని వివరించారు. అయితే మహిళలు వాష్‌రూముకు వెళ్లేందుకు కూడా అక్కడ అనుమతి ఇవ్వడం లేదని, దీనికి కారణమైన ప్రభుత్వంపైనా, బాధ్యులపైనా ఎస్సి, ఎస్టి అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని అన్నారు. దీనిపై మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేయాల్సి ఉందన్నారు. వారికి ఇవ్వాల్సిన బకాయిలు విడుదల చేస్తే అక్కడ ఆందోళన చేయాల్సిన అవసరం ఉండదని చెప్పారు. మరోవైపు మూడేళ్లుగా వీరికి సబ్సిడీ విడుదల చేయడంలో వైసిపి, టిడిపి పాలకులు తీవ్ర నిరక్ష్యంగా ఉన్నారని అన్నారు. ఇంటికో పారిశ్రామివేత్త తయారవ్వాలని చెబుతున్న చంద్రబాబునాయుడు ఆచరణలో అటువంటిదేమీ చేయకపోగా పూర్తి నిరుత్సాహపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారికి పెండింగ్ ప్రోత్సాహకాల నిధులు ఇవ్వాలని కోరారు.

# డిసెంబర్ 31తో కార్మిక సంక్షేమ స్ప్రీ పథకం గడువు ముగింపు

### ఇఎస్ఐసి రీజనల్ డైరెక్టర్ మళ్ళ రామారావు

విజయవాడ, డిసెంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: వివిధ రకాల ఉపాధి కల్పనా సంస్థలతో పాటు అందులో పని చేసే కార్మికులను ప్రోత్సహించేందుకు ఈ.ఎస్.ఐ.సి. ప్రవేశపెట్టిన స్ప్రీ (స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ది ఎంప్లాయర్స్ అండ్ ఎంప్లాయిస్- 2025) పథకం గడువు ఈ నెల 31తో ముగియనున్నది, ఈఎస్ఐలో ఇప్పటి వరకు నమోదు చేసుకోని కంపెనీలు, సంస్థలు అర్హత కలిగిన ఉద్యోగులను స్వీయ నమోదుకు ప్రోత్సహించ దానికి ఈ ఏడాది జూలై 1వ తారీకు నుండి ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ లో 2,50,000 మంది కార్మికులను రిజిస్ట్రేషన్ చేయించి వారికి సామాజిక భద్రత కల్పించినట్లుగా ఆంధ్రప్రదేశ్ ఈఎస్ఐసీ రీజనల్ డైరెక్టర్ మళ్ళ రామారావు వివరించారు. వీరి రిజిస్ట్రేషన్ సమయంలో ఎటువంటి పాత రికార్డులను తనిఖీ చేయలేదని ఈ పథకం కింద సుమారుగా సుమారు 2000 కంపెనీలు/ యాజమాన్యాలు పాత బకాయిల నుంచి లబ్ధి పొందాయని ఆయన వివరించారు. ఈ పథకం 31 డిసెంబర్ 2025 తో ముగియనుండటంతో 10 లేదా అంతకంటే ఎక్కువ మంది కార్మికులను నియమించుకున్న కర్మాగారాలు, దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, సినిమా థియేటర్లు, రవాణా సంస్థలు, ప్రైవేట్ విద్యా సంస్థలు, మొదలైన వాటిని నిర్వహించేవారు ఎస్ఐసి పోర్టల్‌లో శ్రమసువిధ పోర్టల్ లేదా ఎంసీఏ పోర్టల్ ద్వారా తమ సంస్థలను ఆన్‌లైన్లో నమోదు చేసుకోవాలని, ఈ ప్రక్రియ పూర్తిగా డిజిటల్, సరళమైనదన్నారు. ఈ పథకం కింద యజమాని పేర్కొన్న తేదీ నుంచి కవరేజ్ ప్రారంభించబడుతుందని, దీనికి గత రికార్డులను సమర్పించవలసిన అవసరం లేదని ఆయన వివరించారు. ఈ పథకం కింద సుమారుగా సుమారు 2000 కంపెనీలు/ యాజమాన్యాలు పాత బకాయిల నుంచి లబ్ధి పొందాయని ఆయన వివరించారు. ఈ పథకం 31 డిసెంబర్ 2025తో ముగియనుండటంతో ఆయన కంపెనీ యాజమాన్యులు, కార్మికులు సామాజిక భద్రత కోసం స్వచ్ఛందంగా వచ్చి రిజిస్ట్రేషన్ పొంది ఈఎస్ఐసి. అందించే పథకాల ద్వారా సామాజిక ఆర్థిక, ఆరోగ్య భద్రతను పొందవలసిందిగా విజ్ఞప్తి చేశారు.



# శివరాత్రి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

### శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, డిసెంబరు 12 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వ రాలయంలో మహాశివరాత్రి అంటే 'బ్రాండ్ అభివృద్ధి' అని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజాదర్బార్ సందర్భంగా ఆయన పంచాయతీ రాజ్ అతిధిగృహంలో ప్రజా సమస్యలను స్వీకరించారు. అధికారులకు దిశానిర్దేశం చేసారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఫిబ్రవరి మాసంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయన్నారు. ఈ మేరకు ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి, ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఇఇ మురళీధర్‌రెడ్డిలు రూపొందించిన అంచనా ప్రతిపాదనలను ధర్మకర్తల మండలి సమావేశంలో చర్చించి ఆమోదించామని వివరించారు. శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఎంతో కీలకమని వివరించారు శివయ్య పండుగను జవాబుదారితనంతో పారదర్శకత్వంతో నిర్వహించాలని వచ్చిన భక్తులు ఉత్సవాలను మెచ్చుకోవాలని అలాగే మహాశివరాత్రి పర్వదినాన వచ్చిన భక్తులకు సుదర్శనం సత్వర దర్శనం ఏర్పాటు చేయాలని సూచించారు.




# పారిశుధ్య కార్మికులకు సేఫ్టీ పరికరాలు

అనంతపురము, డిసెంబరు 12 ప్రభాతవార్త బ్యూరో: అనంతపురం నగరపాలక సంస్థ ఆవరణలో డిస్కవరీ అనంతపురం స్వచ్ఛంద సంస్థ శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ భవాని రవికుమార్, తదితరులతో కలిసి పారిశుధ్య కార్మికులకు స్వచ్ఛంద సంస్థ ఉచితంగా అందిస్తున్న సేఫ్టీ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా డిస్కవరీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అనిల్‌ను చైర్మన్ అభినందించారు. అలాగే పర్యావరణహిత బట్ట సంచులను, షూ, కళ్ళ జోల్లు, మాస్కులు, గ్లోవ్స్ తదితర పరికరాలను పలువురు పారిశుధ్య కార్మికులకు అందజేశారు.

## గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల్లో

# సంస్కరణల దిశగా అడుగులు

**- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమాలోచనలు**

సచివాలయం, డిసెంబరు 12 ప్రభాతవార్త: పంచాయితీ రాజ్ పాలనలో వ్యవస్థాగతమైన సంస్కరణలు చేపట్టి గ్రామ స్వరాజ్య సాధన దిశగా స్థానిక సంస్థల పాలకులను, ఉద్యోగులను ముందుకు తీసుకెళ్తున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్.డబ్ల్యూఎస్ శాఖల మంత్రి పవన్ కల్యాణ్. ఈ క్రమంలోనే గ్రామీణాభివీద్ధి, ఆర్.డబ్ల్యూఎస్ శాఖలో క్షేత్రస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పరిపాలన ప్రక్రియలో సంస్కరణలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ శాఖల్లో ఉన్న ఉద్యోగుల ప్యాట్రన్, క్షేత్రస్థాయి నుంచి పైస్థాయి వరకు ఉన్న హోదాలపై చర్చించారు. గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన పనులు వేగవంతం కావడంతోపాటు, ప్రజల్లో సంతృప్తి స్థాయి పెంచే విధంగా మార్పులు చేపట్టాల్సిన అవసరం ఉందని పవన్ కళ్యాణ్ స్పష్టంచేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛ రథం, మ్యాజిక్ డ్రెయిన్ పైలెట్ ప్రాజెక్టుల గురించి ప్రస్తావిస్తూ ఇలాంటి నూతన ఆలోచనలతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ శాఖల్లో ఉన్న ఉద్యోగులకు ప్రోత్సాహకరమైన, భరోసా ఇచ్చే పరిస్థితులు తీసుకురావాలని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రోడ్లతోపాటు స్వచ్ఛమైన జలాన్ని అందించడం కూటమి ప్రభుత్వ లక్ష్యం, ఇందులో భాగంగా గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ బలోపేతం కావాలన్నారు. జల్ జీవన్ మిషన్ పనులపై నిరంతర పర్యవేక్షణ చేసేలా సాంకేతికపరంగా శాఖలో మార్పులు అవసరమని చెప్పారు. పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి,




ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల్లో తీసుకొచ్చే ప్రతి సంస్కరణ అంతిమంగా ప్రజలకు మేలు కలిగించేలా ఉండాలని దిశానిర్దేశం చేశారు. గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల్లో చేపట్టాల్సిన సంస్కరణలు, బెస్ట్ ప్రాక్టీసెస్‌పై సత్వరమే నివేదిక ఇవ్వాలని పేషీ అధికారులను ఆదేశించారు. ఈ విషయమై వారం రోజుల్లో సమీక్ష చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్ శ్రీకృష్ణతేజ, ఓఎస్డి శ్రీవేంకట కృష్ణ పాల్గొన్నారు.



## భక్తి శ్రద్ధలతో భవానీ దీక్షల

# విరమణ ఉత్సవాలు

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 12 ప్రభాతవార్త: రెండోరోజు భవానీ దీక్షలు విరమణ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శుక్రవారం దీక్షధారులు భక్తుల సంఖ్య పెరిగింది. భక్తిశ్రద్ధలతో ఇరుముడులను శిరస్సున ధరించి దుర్గమ్మవారి ఆలయానికి జై దుర్గా... జైజై దుర్గా నామస్మరణతో చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి ఇరుముడులు భక్తితో సమర్పించుకున్నారు. శ్రీ అమ్మవారు దీక్షల సందర్భంగా అమ్మవారి ప్రత్యేక పూల అలంకరణతో భక్తులను అనుగ్రహించారు.





# కలువాయమ్మ! కాపాడమ్మా!!

కలువాయి (నెల్లూరు), డిసెంబరు 12 ప్రభాతవార్త: కలువాయి మండలాన్ని ఆత్మకూరు రెవిన్యూ డివిజన్ పరిధి నుండి గూడూరు రెవిన్యూ డివిజన్ పరిదిలోని తిరుపతి జిల్లాకు మార్పు విషయమై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కలువాయి మండల ప్రజలు ఇందుకు వ్యతిరేఖంగా నిరసనలు ర్యాలీలు కలువాయి సేవ్ నిరసన సెగలు ఉధృతమౌతున్నాయి. కలువాయి సేవ్, తిరుపతి వద్దు నెల్లూరు ముద్దు అంటూ స్థానిక బస్టాండ్ కూడలి నందు 4 వ రోజు శుక్రవారం రిలే నిరాహారదీక్షకు నిరసనకారులు మండలంలోని చింతలాత్మకూరు సర్పంచ్ ప్రభావతమ్మ తోపాటు తిరుమలపాడులోని మహిళలు పెద్దఎత్తున నిరాహారదీక్షలలో పాల్గొన్నారు. అన్ని ఉపాధ్యాయ యూనియన్ సంఘాల నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు పెద్దఎత్తున రిలే దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

# తిరుపతి జిల్లా వద్దు, నెల్లూరు కావాలి

రాపూరు (నెల్లూరు), డిసెంబరు 12 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా మాకు వద్దు కన్నతల్లి లాంటి నెల్లూరు జిల్లానే మాకు కావాలి అంటూ రాపూరు మండలంలో శుక్రవారం రాత్రి పెద్ద ఎత్తున కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సాయంత్రం 6 గంటల సమయంలో రాపూరు మండల వాసులమైన తమకు తల్లి లాంటి నెల్లూరు కావాలి తిరుపతి వద్దు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. రాపూరు పాత బస్టాండ్ నుండి బాలాజీ కాంప్లెక్స్ కూడలి వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. సైదాదుపల్లి, సిద్ధవరం, అకిలివలస, పంగిలి గ్రామాలలో ఆయా గ్రామ సర్పంచ్‌లు, ప్రజలు, యువకులు పెద్ద ఎత్తున ఈ ర్యాలీలో పాల్గొని కొవ్వొత్తులు వెలిగించి వారి నిరసన వ్యక్తం చేశారు.




# కోవూరు లేడీ డాన్ అరుణపై పిడి యాక్ట్

కోవూరు (నెల్లూరు), డిసెంబరు 12 ప్రభాతవార్త: నెల్లూరుజిల్లాలో దొంగతనం, దాడులు, బెదిరింపులు, మోసాలు, గంజాయి కేసులతో పలుమార్లు వివాదాల్లో నిలిచిన లేడీ డాన్ నిడిగుంట అరుణపై అధికారులు పీడీ యాక్ట్ అమలు చేశారు. కోవూరు మండలం పడుగపాడు గ్రామానికి చెందిన అరుణపై మూడు స్టేషన్లలో పలు కేసులు నమోద య్యాయి. పోలీసుల వివరాల ప్రకారం కోవూరు పోలీస్ స్టేషన్లో దాడి, చీటింగ్ కేసులు, నవాబ్ పేటలో ఓ వ్యక్తిని చంపుతామని బెదిరించిన కేసు, వేదయపాలెంలో గంజాయి కేసుతో పాటు విజయవాడలో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురిని మోసం చేసిన ఘటనలు ఆమెపై నమోదయ్యాయి. వరుస కేసులతో ప్రజల్లో భయం నెలకొంది. పరిస్థితులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు అరుణపై పీడీ యాక్ట్ అమలు చేశారు. ప్రస్తుతం నెల్లూరు సెంట్రల్ జైలులో ఉన్న అరుణను భద్రతా కారణాల దృష్ట్యా కోవూరు పోలీసులు కడప సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు. అరుణ అరాచకాలపై పీడీ యాక్ట్ విధించడం ద్వారా చట్టవ్యతిరేక చర్యలకు చెక్ పడుతుందని పోలీసులు పేర్కొన్నారు.

# చింతలపూడిని సత్వరమే పూర్తి చేయాలి

**ముఖ్యమంత్రి చంద్రబాబుకు దేవినేని ఉమా విజ్ఞప్తి**



విజయవాడ, డిసెంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: చింతల పూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలంటూ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు మంగళగిరిలోని తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్య మంత్రిని శుక్రవారం దేవినేని ఉమా కలిశారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ ప్రాంత రైతుల చిరకాల స్వప్నమైన చింతలపూడి ఆవశ్యకత గురించి సీఎంకు వివరించారు. గోదావరి జలాలు ఈ ప్రాంతానికి వస్తే రైతులు ఇక్కట్లు తీరి సిరుల పంటలు పండుతాయని చెప్పుకొచ్చారు. ఉమ్మడి కృష్ణ, ఉభయ గోదావరి జిల్లాల్లోని 4.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. 35 మండలాల్లోని 25 లక్షల మందికి పైగా ప్రజలకు తాగునీరు అందిస్తోందని వెల్లడించారు. ఈ బృహత్తర పథకానికి గత తెలుగుదేశం హయాంలో శంకుస్థాపన చేసి శరవేగంగా పనులు జరిగాయని వివరించారు. ఇప్పటికే ఈ పథకానికి రూ.4,170 కోట్లు వ్యయం చేశారని తెలిపారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారని చెప్పుకొచ్చారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ అసమర్థ, అవినీతి పాలనలో ఆగిపోయిన ఈ ప్రాజెక్టుకు ఉన్న అడ్డంకులను అధిగమించి పూర్తి చేస్తామని దేవినేని ఉమా మహేశ్వరరావు పేర్కొన్నారు.



# విజయవాడలో సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం

విజయవాడ (గన్నవరం), డిసెంబర్ 12, ప్రభాతవార్త : దేశంలోని వివిధ ప్రాంతాల్లో తయారైన పట్టువస్త్రాలను ఒకచోటకు చేర్చి వినియోగదారులకు అందించటం సంతోష కరమని కేశినేని జానకీలక్ష్మి పేర్కొన్నారు. కేంద్ర చేనేత జౌళిశాఖ సహకారంతో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో ఆధ్వర్యంలో విజయవాడలోని ఎ.కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం ఉదయం సిల్క్ ఎక్స్‌పోను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా జానకీలక్ష్మి మాట్లాడుతూ దేశంలోని విభిన్న ప్రాంతాల్లో కళాకారులు విభిన్న రకాల పట్టువస్త్రాలను తయారు చేస్తున్నారని ఈప్రదర్శన ద్వారా వాటన్నిటిని ఒకేచోటకు చేర్చి వినియోగదారులకు అందుబాటులోకి తేవటం శుభపరిణామంగా పేరొ క్నారు. బెనారస్, పశ్చిమబెంగాల్ బోటిక్ ఐటమ్స్, టస్సార్ కాంత, చందేరి, కోటా, రాజ్‌కోట్ పటోలా, గద్వాల్, కలంకారీ, ఉప్పాడ, వెంకటగిరి, కాంచీపురం, జాంధాని తదితర కళాత్మక వస్త్రాలను ఒకే చోట అందుబాటులో ఉంచిన నిర్వాహకులను అభినందించారు. నిర్వాహకులు సెంట్రల్ సిల్క్‌బోర్డు మాజీ డిప్యూటి డైరెక్టర్ వై.శ్రీనివాస రావు మాట్లాడుతూ ఈప్రదర్శనకు పెద్దఎత్తున వస్త్రప్రియు లు వస్తారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. 64స్టాళ్ళతో వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత పట్టువస్త్రాలతో ఏర్పాటు చేసిన ఈప్రదర్శన ఈనెల 17 వరకు ఉంటుందన్నారు.

## త్వరలో టిడిపి జిల్లా కమిటీ నియామకాలు


# ఎమ్మెల్యేలకే పార్టీ పగ్గాలు?

**- శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా ఎంఎస్.రాజు**

**- అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా కాలవ శ్రీనివాసులు?**

అనంతపురం, డిసెంబర్ 12 ప్రభాతవార్త బ్యూరో: స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్న నేపథ్యంలో తెలుగుదేశం పార్టీని సంస్థాగతంగా ఇంకా బలోపేతం చేసేందుకు జిల్లా కమిటీలను త్వరలో ప్రకటించేందుకు టిడిపి అధిష్టాన వర్గం సన్నాహాలు చేస్తోంది. కూర్పులు, చేర్పులతో జిల్లా కమిటీ బాధ్యతలను సమర్ధవంతమైన నాయకత్వానికి అందించేందుకు ఆ పార్టీ ముఖ్యులు జోరుగా ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి జిల్లా అధ్యక్షునిగా మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజుకు పగ్గాలు అప్పగిస్తున్నారు. పగ్గాలు అప్పగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎంఎస్.రాజు పేరు దాదాపు ఖరారైనట్లేనని పార్టీ వర్గాల బోగట్ట. యువకుడు, ఉత్సాహ వంతుడైన ఎంఎస్.రాజుకు పార్టీ జిల్లా బాధ్యతలు అప్పగించడం ద్వారా ఒకవైపు జిల్లా ఎమ్మెల్యేలు, ఇతర నేతలతో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యకర్తలతో మమేకమై పార్టీని, పార్టీ కార్యక్రమాలను, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తాడన్న అభిప్రాయం పార్టీ నాయకత్వంలో ఉన్నట్లు తెలియవచ్చింది. ఇందులో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్ష పదవికి ఇప్పటి వరకు అధ్యక్షునిగా ఉన్న అంజినప్ప మరికొందరి పేర్లు పరిశీలనకు వచ్చినప్పటికీ ఎంఎస్.రాజు పేరునే ఖరారు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలో హిందూపురం శాసన సభ్యులు సినీ నటుడు బాలకృష్ణ పార్టీ అధిష్టాన వర్గానికి అంజినప్పను మళ్లీ కొనసాగించాలని ప్రతిపాదించినట్లు సమాచారం. అయినప్పటికీ అన్ని కోణాల్లో పరిశీలించి ఎంఎస్.రాజు పేరును పరిగణలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇక అనంతపురం జిల్లా టిడిపి అధ్యక్షులుగా సీనియర్ నేత, రాయదుర్గం శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులుకు అప్పగించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. పార్టీ రాష్ట్ర శాఖ ముఖ్యులు కాలవ శ్రీనివాసులు పేరునే పార్టీ అధినేత వద్ద ప్రతిపాదించినట్లు సమాచారం. గతంలో పార్లమెంట్ సభ్యునిగా పని చేయడం, టిడిపి జిల్లా అధ్యక్షునిగా, పొలిట్‌బ్యూరో సభ్యులు, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం తదితర కారణాల వల్ల ప్రస్తుత పరిస్థితుల్లో కాలవ శ్రీనివాసులుకు పార్టీ బాధ్యతలు అప్పగించాలని పార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అయితే అనంతపురం జిల్లా అధ్యక్ష పదవి విషయంలో ఇంకా ఫైనల్‌గా ఓ నిర్ణయానికి రాలేదని మొదటి పేరు మాత్రం కాలవ శ్రీనివాసులు పేరు బలంగా వినిపిస్తోందని టిడిపి వర్గాల బోగట్ట. ఇదే సమయంలో కమ్మ సామాజిక వర్గానికి చెంది,

పార్టీ కోసం ఎంతో సేవలు అందించిన కొందరు నాయకులు పేర్లు కూడా పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి పరిశీలిస్తున్నట్లు తెలియవచ్చింది. అందులో భాగంగా అనంతపురం మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నరసనాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు గడ్డం సుబ్రహ్మణ్యం, టిడిపి జిల్లా నాయకులు రామ్మోహన్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. గడ్డం సుబ్రహ్మణ్యం ఎన్నో ఏళ్లుగా పార్టీలో ఉన్నారు. దివంగత నేత నందమూరి తారక రామారావు పార్టీ ఆవిర్భావం నుంచి ప్రత్యక్షంగా, పరోక్షంగా క్రియాశీలకంగా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చాడు. ప్రస్తుతం పార్టీ అధ్యక్ష పదవికి గడ్డం సుబ్రహ్మణ్యం ఉన్నారు. అదే విధంగా శింగనమల నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యునిగా, టిడిపి



తరుపున గతంలో నరసానాయుడు కీలకంగా పని చేశారు. గత ఎన్నికల్లో పార్టీ పరిశీలకునిగా వివిధ ప్రాంతాల్లో పని చేసి పార్టీలో గుర్తింపు తెచ్చుకున్నారు. అదే విధంగా నార్పల మండలానికి చెందిన రామ్మోహన్‌చౌదరి ఎన్నో ఏళ్లుగా పార్టీలో క్రియాశీలంకంగా ఉంటూ ఒకవైపు రైతు సమస్యలపై పోరాడుతూ మరోవైపు పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తూ వచ్చాడు. గత ఎన్నికల్లో ఎంపి అంబికా లక్ష్మినారాయణ విజయం కోసం అన్ని ప్రాంతాల్లో పర్యటించారు. ఈ నేపథ్యంలో అనంతపురంజిల్లా టిడిపి అధ్యక్షులుగా కాలవ శ్రీనివాసులు పేరు ప్రముఖంగా వినిపిస్తున్నప్పటికీ నరసనాయుడు, రామ్మోహన్ చౌదరి, గడ్డం సుబ్రహ్మణ్యం పేర్లు కూడా పార్టీ అధిష్టానం వద్ద పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు, ఇతర పార్టీ ముఖ్యులు త్వరలో వేసే జిల్లా కమిటీల కూర్పు చేర్పులు ఎలా ఉంటాయో అన్నది పార్టీలో ఆసక్తి కరంగా చర్చ సాగుతోంది. టిడిపి జిల్లా అధ్యక్ష పదవితోపాటు ప్రధాన కార్యదర్శి పదవులు కూడా కీలకంగా ఉండటంతో ఆ పదవులు ఎవరికి దక్కుతాయన్నది వేచి చూడాలి.



## ఆర్టీసి కార్మికుల సంక్షేమానికి

# ప్రభుత్వం కృషి

విజయవాడ(గన్నవరం), డిసెంబర్ 12, ప్రభాతవార్త: ప్రజా రవాణా వ్యవస్థ (ఆర్టీసి) కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్దితో కృషిచేస్తుందని ఆర్టీసి చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు కార్మికులకు హామీ ఇచ్చారు. విజయవాడ లోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ద్వితీయ మహాసభలు శుక్రవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన కొనకళ్ళ జ్యోతి ప్రజ్వలన చేసి మహాసభలను ప్రారంభించారు. ఈసందర్భంగా కొనకళ్ళ మాట్లాడుతూ ప్రజారవాణా వ్యవస్థలోని కార్మికుల ప్రతి సమస్యను దశలవారీగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఆర్టీసి మనుగడ కార్మికులపైనే ఆధారపడి ఉందని, ఆర్టీసిని పరిరక్షించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్న ఆయన కార్మికుల సలహాలు, సూచనలతో ఆర్టీసిని బలోపేతం చేస్తామని ధీమా వ్యక ్తం చేసారు. ఈకార్యక్రమంలో ఎన్‌యంయూ రాష్ట్రఅధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వరుసగా పివి.రమణారెడ్డి, వై.శ్రీనివాస రావు, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన రావు, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, ఏపిఎన్‌జిఓ రాష్ట్రప్రధానకార్యదర్శి డివి.రమణ, ఆర్టీసి జోన్‌చైర్మన్‌లు రెడ్డి అప్పలనాయుడు, ఎస్.సురేష్‌రెడ్డి, పి.నాగరాజు, డి.దొర, కార్మికులు పాల్గొన్నారు.

# విద్య, వైద్య శాఖలు సమన్వయంతో పనిచేయాలి

**- 20 సూత్రాల పథక చైర్మన్ లంకా దినకర్**




నెల్లూరు కలెక్టరేట్, డిసెంబరు 12 ప్రభాతవార్త: విద్య, వైద్య రంగాల్లో అధికారులంతా సమన్వయంతో పనిచేసి, నెల్లూరు జిల్లాను అగ్రభాగంలో నిలపాలని 20సూత్రాల పథకం చైర్మన్ లంకా దినకర్ సూచించారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణములో 20 పాయింట్ ప్రోగ్రాం అమలులో భాగంగా విద్య, వైద్య అనుబంధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, శాసన మండలి సభ్యులు బీదా రావిచంద్ర, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డిలతో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. విద్యా రంగంలో చేస్తున్న సంస్కరణలు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తనతో ప్రస్తావించారని, తద్వారా ఇతర రాష్ట్రాలలో అమలు చేయాలని అన్నారన్నారు. పలు విషయాలలో ఆంధ్రప్రదేశ్ ఒక మోడల్ కావాలని లంకా దినకరన్ అన్నారు. పలు పథకాల అమలుపై గ్రామీణ నీటి సరఫరా, మునిసిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో విపులంగా సమీక్షించామన్నారు. అనీమియా ముక్త భారత్‌కు అందరూ కృషి చేయాలన్నారు. జిల్లాలో 100 శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రులలో జరుగుతున్నాయని, ఏప్రిల్ నుండి అక్టోబర్ వరకు 3153 ప్రసవాలు జరిగాయన్నారు. జిల్లాలో 497 ఆయుష్ మందిరాలు సేవలు అందిస్తున్నయన్నారు. సేవలు అందించడంలో మరింత తొందరగా సేవలు అందించేలా చూడాలని సూచించామన్నారు.

# యూమిడి వక్ఫ్ పోర్టల్ జూన్ వరకు గడువు పొడిగింపు

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ప్రధాన కార్యనిర్వాహక అధికారి షేక్ మొహమ్మద్ అలీ**




విజయవాడ, డిసెంబరు 12, ప్రభాతవార్తప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ ట్రైబ్యునల్ (ఓఏ 7/2025) ఆదేశాల మేరకు రాష్ట్రంలో యుఎంఇఇడి వక్ఫ్ పోర్టల్ వివరాల అప్లోడ్ గడువును మరో ఆరు నెలలు పొడిగించారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ప్రధాన కార్యనిర్వాహక అధికారి షేక్ మొహమ్మద్ అలీ తెలిపారు. సీఈఓ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సూచనల ప్రకారం రాష్ట్రంలోని అన్ని వక్ఫ్ సంస్థలు, వాటికి చెందిన అనుబంధ ఆస్తుల వివరాలను యుఎంఇఇడి పోర్టల్లో అప్లోడ్ చేసే ప్రక్రియను 6జూన్ 2026నుంచి ప్రారంభించామని చెప్పారు. దీనికి చివరి తేదీగా 05-12-2025 నిర్ణయించామని తెలిపారు. కానీ సాంకేతిక సమస్యలు మరియు కొంత వక్ఫ్ ఆస్తుల రికార్డులు తెలంగాణ వక్ఫ్ బోర్డు నుంచి వివిధ కారణాల వల్ల అందకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదురయ్యాయని చెప్పారు. సుప్రీం కోర్టు సూచనల ప్రకారం ముతవల్లీలు, మేనేజింగ్ కమిటీలు రాష్ట్ర వక్ఫ్ ట్రైబ్యునల్లో ఒ.ఎ. దాఖలు చేయవచ్చని చెప్పగా ఆ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు వారు ఒఎ దాఖలు చేశారు. వక్ఫ్ బోర్డు వారు దాఖలు చేసిన పిటిషన్‌ను ట్రిబ్యునల్ పరిశీలించిన సమస్యలను పరిగణనలోకి తీసుకుని గడువు పొడిగింపు ఆదేశాలు జారీ చేసిందని ఆయన తెలిపారు. దాంతో యుఎంఇఇడి పోర్టల్లో వక్ఫ్ సంస్థల వివరాలను అప్లోడ్ చేసుకునే గడువు 06-06- 2026 వరకు పొడిగించబడిందన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని రాష్ట్రంలోని అన్ని వక్ఫ్ సంస్థల మేనేజింగ్ కమిటీలు, ముతవల్లీలు, సంబంధిత బాధ్యులు తమ సంస్థలకు సంబంధించిన పూర్తి వివరాలను సమయానికి యుఎంఇఇడి పోర్టల్లో తప్పనిసరిగా అప్లోడ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి షేక్ మొహమ్మద్ అలీ ఆ ప్రకటనలో కోరారు.

13-12pg12 ONG_13-12pg10.qxd 12/Dec/25 10:07 PM Page 1



# ఐపిఎల్ వేలంలో ఫస్ట్ ఆరుగురి ఆక్షన్

## కోట్లకు చేరనున్న బిడ్లు



డెవాన్ కాన్వే



కామెరాన్ గ్రీన్



డేవిడ్ మిల్లర్



జేక్‌ఫ్రేజర్ మెక్‌గుర్క్



పృథ్వీ షా



సర్ఫరాజ్ ఖాన్

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్ వేలం తేదీ దగ్గర పడుతోంది. ఈ మెగా ఈవెంట్ ఈ నెల 16న అబుదాబిలోని ఎతిహాద్ అరీనాలో జరుగుతుంది, ఇక్కడ మొత్తం 350 మంది ఆటగాళ్ల భవితవ్యం కోట్లలో ఉంటుంది. వేలం సెట్ 1తో ప్రారంభమవుతుంది, ఇందులో ముందుగా వేలం వేయబడే ఆరుగురు పెద్ద పేర్లు ఉన్నాయి. సెట్ 1లో చేర్చబడిన ఆటగాళ్లు మరియు వారి బేస్ ధర చూస్తే నోరెళ్లక తప్పదు. వేలం ప్రారంభమయ్యే సెట్ 1లోని ఆరుగురు ఆటగాళ్లలో న్యూజిలాండ్‌కు చెందిన డెవాన్ కాన్వే (ప్రాథమిక ధర రూ.2 కోట్లు), ఆస్ట్రేలియా యువ ఓపెనర్ జేక్‌ఫ్రేజర్ మెక్‌గుర్క్ (రూ.2 కోట్లు), స్టార్ ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ కామెరాన్ గ్రీన్ (రూ.2 కోట్లు), భారత బ్యాట్స్‌మన్ సర్ఫరాజ్ ఖాన్ (రూ.75 లక్షలు), దక్షిణాఫ్రికా అనుభవజ్ఞుడైన డేవిడ్ మిల్లర్ (రూ.2 కోట్లు), మరియు విధ్వంసక భారత ఓపెనర్ పృథ్వీ షా (రూ.75 లక్షలు) ఉన్నారు. ఈ ఆటగాళ్లు అత్యధిక ధరలకు ఆకర్షితులవుతారని భావిస్తున్నారు. కామెరాన్ గ్రీన్‌కు భారీ బిడ్లు వస్తాయని అంచనా. సెట్ 1లో, ఈ సీజన్‌లో బ్యాట్స్‌మన్‌గా మాత్రమే నమోదు చేసుకున్న ఆస్ట్రేలియా స్టార్ ఆల్ రౌండర్ కామెరాన్ గ్రీన్‌పై దృష్టి ఉంటుంది. గాయం కారణంగా గత సీజన్ మెగా వేలానికి దూరమైన గ్రీన్, ఈ సీజన్‌లో రూ.2 కోట్ల బేస్ ధరతో అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిరూపించ బడవచ్చు. మరోవైపు, భారత ఓపెనర్ పృథ్వీ షా మరియు బ్యాట్స్‌మన్ సర్ఫరాజ్ ఖాన్ ఇద్దరూ రూ.75 లక్షల బేస్ ధరతో వేలంలోకి అడుగుపెడుతున్నారు. గత మెగా వేలంలో అమ్ముడుపోని షా ఈసారి కొనుగోలు చేయబడే అవకాశం ఎక్కువగా ఉంది. అయితే డెవాన్ కాన్వే పేలవమైన ఫామ్ కారణంగా బిడ్డింగ్ కొంత అనిశ్చితంగా ఉంది. డేవిడ్ మిల్లర్ ఒక ప్రధాన కొనుగోలుదారుని కనుగొంటారని భావిస్తున్నారు. ఈ వేలం అనేక విధాలుగా ప్రత్యేకంగా ఉంటుంది. సెట్ 1 నుండి ఈ ఆరుగురు ఆటగాళ్లపై బిడ్‌లు వేసిన తర్వాతే వేలం కొనసాగుతుంది.



## ఒడిశా మాస్టర్స్ 2025 టోర్నీలో క్వార్టర్ ఫైనల్స్‌కు ఉన్నతి, తన్వీ

### దూసుకుపోతున్న అనుపమ, తరుణ్, కిరణ్

**న్యూఢిల్లీ:** ఒడిశా మాస్టర్స్ 2025 టోర్నీలో భారత్ షట్లర్లు దూసుకుపోతున్నారు. టాప్ సీడ్లు ఉన్నతి హుడా, తన్వీ శర్మ, మన్నెపల్లి తరుణ్, కిరణ్ జార్జ్, అనుపమ ఉపాధ్యాయ సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ హుడా థాయిలాండ్‌కు చెందిన టిడాప్రాన్ క్లీబైసున్‌పై కేవలం 25 నిమిషాల్లోనే 21-7, 21-14 తేడాతో ఆధిపత్యం సంపాదించింది. ఆమెతో పాటు తన్వి కూడా 33 నిమిషాల పాటు జరిగిన పోరులో అదితి భట్‌ను 21-18, 22-20 తేడాతో ఓడించింది. జపాన్‌కు చెందిన షియోరి ఎబిహారాపై అన్మోల్ ఖార్బ్ అద్భుతమైన పునరాగమనం చేశాడు. ప్రారంభ గేమ్‌లో 6-21 తేడాతో ఓటమి పాలైన తర్వాత కోలుకుని 46 నిమిషాల్లో 21-8, 21-13 తేడాతో తదుపరి రెండు గేమ్‌లను కైవసం చేసుకున్నాడు. మూడవ గేమ్‌లో తన ప్రత్యర్థి రిటైర్ కావడంతో ఉపాధ్యాయ కూడా ముందుకు సాగింది. నిన్న భారీ ఓటమిని ఎదుర్కొన్న తస్నిమ్ మీర్ 66 నిమిషాల పోటీలో ఆకర్షి కశ్యప్‌ను 11-21, 21-8, 21-18 తేడాతో ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో, టాప్ సీడ్ తరుణ్ 48 నిమిషాల్లో గోవింద్ కృష్ణపై 21-16, 12-21, 21-11 తేడాతో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. ఇండోనేషియా ఆటగాడు రిచీ దుటా రిచర్డో 21-12, 21-10తో నాలుగో సీడ్ ప్రియాంషు రజావత్‌పై విజయం సాధించాడు. జార్జ్ 21-12, 21-18 తేడాతో డెండి ట్రియాన్సియాపై విజయం సాధించగా, రౌనక్ చౌహాన్ మరియు ఎస్. శంకర్ ముత్తుసామి కూడా చివరి ఎనిమిది స్థానాలకు చేరుకున్నారు.

## హాకీ మహిళల ప్రపంచ కప్‌లో స్పెయిన్ విక్టరీ



### 1-2 తేడాతో భారత్ చిత్తు

**న్యూఢిల్లీ:** హాకీ జూనియర్ మహిళల ప్రపంచ కప్-2025లో స్పెయిన్ చేతిలో భారత్ ఓటమి పాలయింది. ఎస్టాడియో నేషనల్‌లోని సెంట్రో డిపోర్టివో డి హాకీ సెస్పెడ్‌లో శుక్రవారం 9వ/10వ స్థానం కోసం జరిగిన ప్లేఆఫ్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు స్పెయిన్‌తో 1-2 తేడాతో ఓడిపోయి టోర్నమెంట్ మొత్తం స్టాండింగ్స్‌లో 10వ స్థానంలో నిలిచింది. భారత్ తరపున కనికా సివాచ్ (41 నిముషంలో) గోల్స్ చేయగా, స్పెయిన్ తరపున నటాలియా విలనోవా (16) మరియు ఎస్తేర్ కెనాల్స్ (36) తలా ఒక గోల్ చేశారు. 14వ నిమిషంలో, స్పెయిన్‌కు మ్యాచ్‌లో తొలి పెనాల్టీ కార్నర్ లభించినా దాన్ని భారత్ ప్లేయర్ నిధి తిరస్కరించాడు. రెండవ క్వార్టర్‌లో స్పెయిన్ ఎదురుదాడిని ప్రారంభించింది. సారా కార్మోనా రామోస్ సర్కిల్ చుట్టూ నైపుణ్యంగా డ్రిబుల్ చేసి లోపలికి పాస్ ఆడింది, నటాలియా విలనోవా (16 ) నెట్‌లోకి విజయవంతంగా మళ్లించి ఆధిక్యాన్ని సాధించింది. తదుపరి భారత్‌కు రెండు అవకాశాలు లభించినా, స్పెయిన్ ఎటువంటి పెనాల్టీ కార్నర్‌లను ఇవ్వలేదు. 36వ నిమిషంలో, సోనమ్ పాస్‌ను అడ్డగించి గోల్ చేయడంతో దాన్ని రద్దు చేశారు. ఎస్తేర్ కెనాల్స్ (36) చేసిన ఫ్లిక్ ద్వారా పెనాల్టీ కార్నర్‌ను మలచడం ద్వారా స్పెయిన్ తమ ఆధిక్యతను 2 గోల్స్‌కు పెంచుకుంది. 41వ నిమిషంలో, కనికా సివాచ్ (41) భారత్ తరపున ఒక గోల్ చేయడంతో రెండు పెనాల్టీ కార్నర్‌లను గెలుచుకుని లోటును తగ్గించింది.

## వరల్డ్ టేబుల్ టెన్నిస్.. సెమీస్ నుండి దియా, షా ఔట్



**న్యూఢిల్లీ:** వరల్డ్ టేబులన టెన్నిస్ సెమీ ఫైనల్స్‌కు చేరకుండానే భారత్ మిక్స్‌డ్ ద్వయం దియా చిటాలే-మనుష్ షా విజయం లేకుండా ఓడిపోయారు. శుక్రవారం వరుసగా మూడో ఓటమి తర్వాత హాంకాంగ్‌లో జరిగిన 2025 డబ్ల్యూటిటి ఫైనల్స్ నుంచి భారత టేబుల్ టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్ జోడీ మనుష్ షా మరియు దియా చిటాలే నిష్క్రమించింది. ప్రపంచ ర్యాంక్‌లో 9వ స్థానంలో ఉన్న షా-చిటాలే, చైనాకు చెందిన లిన్ షిడాంగ్-కుయ్ మాన్ చేతిలో 28 నిమిషాల కంటే తక్కువ వ్యవధిలో 5-11, 11-7, 6-11, 6-11 తేడాతో ఓడిపోయారు. సెమీ ఫైనల్ స్థానానికి పోటీలో నిలవాలంటే తప్పక గెలవాల్సిన పోటీలో, భారత ద్వయం ప్రపంచ నంబర్ 1 లిన్, కుయ్‌చేతిలో ఓడిపోయింది. ఈ ఓటమి వల్ల సీజన్ ముగింపు డబ్ల్యూటిటి ఫైనల్స్‌కు అర్హత సాధించిన తొలి భారతీయులు షా మరియు చిటాలే, టోర్నమెంట్‌ను విజయం లేకుండా ముగించారు. అంతకు ముందు జరిగిన గ్రూప్ 1 పోరులో చైనాకు చెందిన వాంగ్ చుకిన్, సన్ యింగ్షా చేతిలో 0-3 తేడాతో వారు తమ ప్రచారాన్ని ప్రారంభించారు. షా-చిటాలే ప్రపంచ 5వ ర్యాంక్ వాంగ్ చున్ టింగ్-డూ హోయ్ కెమ్‌లపై మెరుగైన పోరాటం ప్రదర్శించారు. కానీ చివరికి వారి రెండవ మ్యాచ్‌లో 2-3 తేడాతో ఓడిపోయారు.

## ఆసియా కప్‌లో భారత్ ఘన విజయం



**న్యూఢిల్లీ:** అండర్19 ఆసియా కప్-2025 టోర్నీలో భారత్ శుభారంభం చేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యుఎఇ)తో దుబాయ్ వేదికగా శుక్రవారంజరిగిన మ్యాచ్‌లో ఏకంగా 234పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన యుఎఇ సూచనతో భారత్ బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 50 ఓవర్లలో కేవలం 6 వికెట్లు నష్టపోయి ఏకంగా 433 పరుగుల రికార్డు స్కోరు సాధించింది. ఇందులో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ కేవలం 95 బంతుల్లో 171 పరుగుల (9 ఫోర్లు, 14 సిక్స్‌లు) తో దుమ్మురేపాడు. ఇక వన్‌డౌన్ బ్యాటర్ అరోన్ జార్జ్ (69), విహాన్ మల్హోత్రా (69) అర్ధ శతకాలతో సత్తా చాటగా, వేదాంత్ త్రివేది (38), అభిజ్ఞాన్ కుందు (32 నాటౌట్), కనిష్క్ చౌహాన్ (28) రాణించగా, కెప్టెన్ ఆయుష్ మాత్రే (4) నిరాశపరిచాడు. యుఎఇ బౌలర్లలో యుగ్‌శర్మ, ఉద్దీశ్ సూరి చెరో రెండువికెట్లు తీయగా, షాలోమ్ డిసౌజా, కెప్టెన్ యాయిన్ రాయ్ తలా ఒక వికెట్ దక్కించుకున్నారు. ఇక భారత్ విధించిన భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన యుఎఇ ఆది నుండి తడబడింది. ఓపెనర్లు కెప్టెన్ రాయ్ (17), డిసౌజా, అయాన్ మిస్బా (3), ముహమ్మద్ రేయాన్ ఖాన్ (19) నిరాశపరచగా, అహ్మద్ హుదాదాద్ డకౌట్ అయ్యాడు. మిగిలిన వారిలో నూరుల్లా అయోబి 3 పరుగులకే పెవిలియన్ చేరగా, పృథ్వీ మధు (50), ఉద్దీశ్ సూరి (78) గట్టి పోరాటం చేశారు. అయితే భారత్ బౌలర్ల ధాటికి 50 ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 199 పరుగులక యుఎఇ పరిమితమైంది.

# లాభాల్లోనే ముగిసిన స్టాక్ మార్కెట్లు




### మోడీ ట్రంప్ చర్చల మద్దతు


**ముంబయి, డిసెంబరు 12:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు కూడా లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు, ముఖ్యంగా మెటల్ స్టాక్స్‌లో భారీ కొనుగోళ్ల మద్దతుతో సూచీలు లాభ పడ్డాయి. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 449.53 పాయింట్లు పెరిగి 85,267.66 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 148.40 పాయింట్లు లాభపడి 26,046.95 వద్ద ముగిసింది. ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంపై ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య గురువారం జరిగిన చర్చలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచాయి. ఇరు దేశాలు వాణిజ్య ఒప్పందం దిశగా ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ పరిణామం సానుకూల ప్రభావం చూపింది. నిఫ్టీలో టాటా స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎల్ టీ, మారుతీ సుజుకీ, భారతీ ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ వంటి షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అయితే, లాభాల స్వీకరణతో హెచ్‌యూఎల్, సన్ ఫార్మా, ఏషియన్ పెయింట్స్, ఐటీసీ, పవర్ గ్రిడ్, హెచ్‌సీఎల్ టెక్ వంటివి నష్టపోయాయి. సెక్టార్ల వారీగా చూస్తే, నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 2.63 శాతం పెరిగి ర్యాలీకి నాయకత్వం వహించింది. రియల్టీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాలు కూడా లాభపడగా.. ఎఫ్‌ఎంసీజీ, మీడియా రంగాలు నష్టాల్లో ముగిశాయి. విస్తృత మార్కెట్లలో నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.18 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.94శాతం చొప్పున లాభపడ్డాయి. నిఫ్టీ 25,900 స్థాయిని కీలక మద్దతుగా నిలుపుకున్నంత కాలం సమీప భవిష్యత్తులో సానుకూల ధోరణి కొనసాగవచ్చని, స్వల్పకాలంలో 26,300 స్థాయికి చేరే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు, దేశీయ మార్కెట్లో వెండి ధరల జోరు కొనసాగుతోంది. శుక్రవారం వెండి ఫ్యూచర్స్ చరిత్రలో తొలిసారిగా కేజీ రూ.2 లక్షల మార్కును దాటి సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు వెండి ధర దాదాపు 130 శాతం పెరగడం గమనార్హం.

# రూపాయిపై పెరుగుతున్న ఒత్తిడి

### మరింత పెరిగే అవకాశం ఉందంటున్న నిపుణులు

**ముంబయి, డిసెంబరు 12:** అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ సరికొత్త రికార్డు కనిష్టానికి పడిపోయింది. ట్రేడింగ్‌లో రూపాయి విలువ తొలిసారిగా 90.42 స్థాయికి చేరింది. వారాంతంలో 90.28కి చేరినా ఈ ఒత్తిడి మరింత పెరిగే అవకాశం ఉందని కరెన్సీ ట్రేడింగ్‌నిపుణుల అంచనా. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించడంతో వచ్చిన సానుకూలతను దేశీయ కార్పొరేట్లు, బ్యాంకుల నుంచి డాలర్లకు వెల్లువెత్తిన డిమాండ్ తోసిపుచ్చింది. దీంతో రూపాయిపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. విదేశీ, ప్రైవేట్ బ్యాంకులు తమ మర్చంట్, కార్పొరేట్ చెల్లింపుల కోసం పెద్ద ఎత్తున డాలర్లను కొనుగోలు చేస్తున్నాయని ట్రేడర్లు చెబుతున్నారు. ప్రపంచ పరిణామాలు సానుకూలంగా ఉన్నప్పటికీ, దేశం నుంచి డాలర్ల అవుట్‌ఫ్లో ఒత్తిడి ఎక్కువగా ఉందని ఓ బ్యాంకర్ తెలిపారు. ఈ కారణంగానే రూపాయి కోలుకోలేకపోతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. 2022 తర్వాత రూపాయికి ఇది అత్యంత నిరాశాజనకమైన సంవత్సరం అవుతోంది. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల్లో అనిశ్చితి, భారత ఎగుమతులపై అమెరికా టారిఫ్‌లు వంటి అంశాలు ఈ ఏడాది రూపాయి పతనానికి కారణమయ్యాయి. వాషింగ్టన్‌తో వాణిజ్య ఒప్పందం కుదరకపోతే రూపాయి మరింత బలహీనపడవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మార్కెట్ వర్గాల దృష్టి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వైపు మళ్లింది. వచ్చే వారం ఆర్‌బీఐ 5 బిలియన్ డాలర్ల డాలర్‌రూపీ బై/సెల్ స్వాప్ నిర్వహించనుంది. దీనివల్ల బ్యాంకింగ్ వ్యవస్థలోకి నగదు లభ్యత పెరిగి, స్వల్పకాలిక ఒత్తిడి తగ్గుతుందని భావిస్తున్నారు. ఈ పరిణామాలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. రూపాయి దాని స్థాయిని అదే కనుగొంటుందని ఆమె వ్యాఖ్యానించారు. రూపాయి బలహీనతను రాజకీయం చేయవద్దని కోరారు. గతంలో తమ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధిక ద్రవ్యోల్బణం, బలహీనమైన ఆర్థిక వ్యవస్థ కారణంగా రూపాయి పతనం మరింత ఆందోళన కలిగించిందని, ప్రస్తుత ఆర్థిక మూలాలు బలంగా ఉన్నాయని ఆమె గుర్తుచేశారు.

## విదేశీ కరెన్సీ ఖజానా కళకళ: 687.26 బిలియన్ డాలర్లకు వృద్ధి



**న్యూఢిల్లీ, డిసెంబరు 12:** భారత్ విదేశీ కరెన్సీ ఖజానా కళకళలాడింది. ఐదవ తేదీతో ముగిసిన వారంలో విదేశీ కరెన్సీ నిల్వలు 1.03 బిలియన్ డాలర్లుపెరిగి 687.26 బిలియన్ డాలర్లకు పెరిగాయి. అలాగే బంగారం నిల్వల విలువలు కూడా 1.188 బిలియన్ డాలర్లుపెరిగి 106.984 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఆర్బీఐ ప్రకటించింది. ఇక ఐఎంఎఫ్‌వద్ద స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ ఎస్‌డీఆర్‌లు 93 మిలియన్ డాలర్లుపెరిగి 18.721 బిలియన్ డాలర్లకు చేరాయి. విదేశీ కరెన్సీ ఆస్తుల విలువలుకూడా పెరిగాయి యూరో, పౌండ్, యెన్ వంటి విదేశీ కరెన్సీలు డాలర్ విలువల్లో సరిచూసి నపుడు వచ్చే కరెన్సీ విలువలనే విదేశీ కరెన్సీ ఆస్తులుగా పేర్కొంటారు. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో రూపాయి భారీ పతనం చెందినప్పుడల్లా ఆర్బీఐ జోక్యం అనివార్యం అవుతుంది. డాలర్ల విక్రయాలకు కౌంటర్లు తెరిచి రూపాయికి కొంత మద్దతును చేకూరుస్తుంది. అయితే డాలర్ పెట్టుబడులు భారత్‌లోకి గణనీయంగా పెరగడంతోరూపాయికి సమతుల్యత వచ్చిందని ఆర్‌బిఐ అంచనా. 2012-13 లో 34 బిలియన్ డాలర్లు వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 2024-25లో 80 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోకూడా ఎఫ్‌డిఐలు 18శాతంపెరిగి 35.18 బిలియన్ డాలరర్లకు చేరినట్లు కేంద్ర మంత్రి స్వయంగా ప్రకటించారు. పెట్టుబడుల ఉపసంహరణ, ఓవరీస్స్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ వంటి వాటిద్వారాకూడా కొంత ఊతం ఇచ్చి నట్లవుతుంది. 2022లో ఒడిఐ నిబంధనలను సరళీకృతం చేసినప్పటినుంచి భారత్‌కు పెట్టుబడులు వెల్లువలా పెరిగాయి.



## పిఎల్ఐ స్కీంతో పెట్టుబడుల వెల్లువ

### ఆరునెలల్లోనే రూ.2లక్షల కోట్ల పెట్టుబడులు

**న్యూఢిల్లీ, డిసెంబరు 12:** ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం ప్రవేశపెట్టిన తర్వాత మంచి మార్పులు వస్తోందని, సుమారు 14 రంగాల్లో ఈ పిఎల్ఐ స్కీంనుప్రవేశపెట్టడం వల్ల లక్షలకోట్ల పెట్టుబడులువ స్తున్నట్లు కేంద్ర మంత్రి జితిన్‌ప్రసాద వెల్లడించారు. ఈ ఏడాదిలోనే సెప్టెంబరు వరకూ రెండులక్షలకోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయన్నారు. రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చిన మంత్రి ఎగుమతి ఆధారిత రంగాల్లో ఈ పిఎల్ఐ స్కీం మంచి ఫలితాలిచ్చిందని 14 రంగాల్లో ఉత్పత్తి లేదా అమ్మకాలు సుమారు రూ.18.7 లక్షలకోట్ల వరకూ ఉన్నాయని, అలాగే 12.6 లక్షలమందికి ప్రత్యక్ష పరోక్ష ఉపాధికల్పించినట్లు ఆయన వివరించారు. అంతేకాకుండా దేశీయంగా ఉత్పత్తి సామర్థ్యాలను కూడా పెంచుతున్నదని, భారీ స్థాయిలో ఎగుమతి ఆధారిత రంగాలకు పెట్టుబడులు పెరుగుతున్నట్లు తెలిపారు. పిఎల్ఐస్కీం వైద్యపరికరాలకు, 21 ప్రాజెక్టులకు సంబంధించి ప్రవేశపెట్టామని, లీనియర్ యాక్సిలరేటర్ లీనాక్, ఎంఆర్ఐ, సిటిస్కాన్; హార్ట్ వాల్వ్, స్టెంట్, డయాలైజర్ మెషిన్, సీఆర్మ్, క్యాత్ ల్యాబ్, మామ్మోగ్రాఫ్, ఎంఆర్ఐ కాయిల్స్ వంటి వాటి ఉత్పత్తికి పిఎల్ఐసి స్కీం ఎంతో మద్దతు ఇస్తోందన్నారు. ప్రపంచ ఫార్మా మార్కెట్‌లో భారత్ మూడో అతిపెద్ద దేశంగా నిలిచిందని, విలువలపరంగాను, సంఖ్యాపరంగాను ఎగుమతులు 50శాతంపెరిగాయన్నారు. పెన్సిలిన్‌జి వంటివాటికోసం విదేశాలపై ఆధారపడకుండా సొంతంగా ఉత్పత్తి చేయగలుగుతున్నామన్నారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపరంగా 41.94శాతం పెరిగిందని, భారత్ స్మార్ట్‌ఫోన్లు, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్‌కు బ్రిటన్,చైనా, అమెరికాల్లో మంచి మార్కెట్ ఉందన్నారు. పండ్లు, బియ్యం, కాఫీ, మషాలాలు, మెరైన్ ఉత్పత్తులు 6.46శాతం పెరిగినట్లు వివరించారు. నైజీరియా, అమెరికాల నుంచి కూడా భారీ స్థాయిలో ఆర్డర్లు వస్తున్నట్లు వివరించారు. ఇంజినీరింగ్ ఉత్పత్తులపరంగా 5.35శాతంపెరిగాయని, ఎక్కువగా జర్మనీ, యుకె, దక్షిణాఫ్రికాలకు మన ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నట్లు మంత్రి తెలిపారు.

## స్వల్పంగా పెరిగిన రిటైల్ ద్రవ్యోల్బణం

### ఆహారోత్పత్తుల ధరల పెరుగుదలే మూలం

**న్యూఢిల్లీ, డిసెంబరు 12:** భారత రిటైల్ ద్రవ్యోల్బణం నవంబరునెలలో 0.71శాతం స్వల్పంగాపెరిగింది. అక్టోబరులో 025శాతం నమోదునుంచి 46 బేసిస్ పాయింట్లుపెరిగినట్లు కేంద్ర అర్థగణాంక శాఖప్రకటించింది. పట్టణ, గ్రామీణప్రాంతాల్లోకూడా ద్రవ్యోల్బణం పెరిగింది. పట్టణప్రాంతాల్లో0.88 నుంచి 1.40శాతానికి నవంబరునెలలోపెరగడం గమనార్హం. అలాగేగ్రామీణ ప్రాంతాల్లోకూడా మైనస్ 0.25శాతంనుంచి 0.10శాతానికి చేరింది. ఆహారోత్పత్తుల్లోధరలు పెరగడం వల్లనే రిటైల్‌ద్రవ్యోల్బణం



పెరుగుతున్నట్లు కేంద్రం అంచనావేసింది. మొత్తం ఆహారద్రవ్యోల్బణం వార్షికద్దతిలోచూస్తే సమిష్టిసూచీలో మైనస్ 3.91శాతంగా ఉంది. మొత్తం 111 బేసిస్‌పాయింట్లుపెరిగింది. గ్రామీణ ఆహారద్రవ్యోల్బణం మైనస్ 4.05శాతంగా ఉంది. పట్టణ ప్రపాంతాల్లో ఆహారద్రవ్యోల్బణం నవంబరులో మైనస్ 3.60శాతంగా నిలవడంతో ఉత్పత్తులధరలు భారీగా పెరిగినట్లే భావించాలి. ఇక ఇతరత్రా ఫ్యూల్ లైట్ కేటగిరీలో ద్రవ్యోల్బణం 2.32 శాతం పెరిగింది. అక్టోబరులో 1.98శాతం ఉన్న ఈ ద్రవ్యోల్బణం పెరిగింది.హౌసింగ్ ద్రవ్యోల్బణం పట్టణ ప్రాంతాల్లో 2.95శాతంగా ఉంది. ఇక విద్య, హెల్త్‌కేర్‌రంగాల్లో 3.38శాతం, 3.60శాతంగా నమోదయింది. కేరళలో సమిష్టి ద్రవ్యోల్బణం 8.27 శాతంగా ఉంది. ఇతర మేజర్‌రాష్ట్రాలు కర్నాటకలో 2.64శాతం, జమ్ముకాశ్మీర్‌లో 2.31శాతం, తమిళనాడులో 2.08శాతం, పంజాబ్‌లో 1.65శాతంగా ఉంది. డిసెంబరు ద్రవ్యోల్బణం వచ్చే ఏడాది జనవరి 12వ తేదీ విడుదలచేస్తారు.

## బీమారంగంలో 100% విదేశీ పెట్టుబడులు




### కేంద్రకేబినెట్ ఆమోదం

**న్యూఢిల్లీ, డిసెంబరు 12:** బీమారంగంలోకి 100శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతులిస్తూ కేంద్రకేబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పటివరకూ ఈ విదేశీ పెట్టుబడులకు కేవలం 74శాతం వరకూ మాత్రమే అనుమతి ఉంది. ఇపుడు బీమారంగ చట్టాలు సవరణల బిల్లు 2025తో విదేశీ మూలధనం, పెట్టు బడులు పెరుగుతునాననయి. ఇందుకోసం బిల్లును కూడా పార్లమెంటులో సత్వరమే తీసుకురావాలని చూస్తున్నారు. బీమాకంపెనీల్లో పూర్తి విదేశీ యాజమాన్యాన్ని ఈ నూరుశాతం ఎఫ్‌డిఐ అనుమతిస్తుంది. బీమా చట్టాలు సవరణ బిల్లు 2025 ప్రకారం కొన్ని మార్పులు వస్తునాననయి. తక్కువ మూలధన అవసరాలను సరిచేస్తుంది. బీమా కంపెనీలకు కాంపోజిట్ లైసెన్స్ ఇచ్చేందుకు వెసులుబాటు ఇస్తోంది. మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకుగాను ఉత్పత్తులను మరింత సమర్థవంతంగా అమలుకు, దేశవ్యాప్తంగా 2047 నాటికి బీమా కవరేజిని పెంచేందుకు ఈ బిల్లు దోహదంచేస్తుంది. ఈనెల 19వ తేదీ పార్లమెంటు శీతాకాల సమావేశాల్లోనే ఈ బిల్లునుప్రవేశపెడుతున్నారు. ఇందుకోసం ఎల్ఐసి చట్టం 1956, ఐఆర్‌డిఎఐ చట్టం 1999 లను సవరించాల్సి ఉంది. పాలసీదారులకు రక్షణను కూడా మరింత పెంచుతుందని అంచనా. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఈ ఏడాది బడ్జెట్‌లోనే విదేశీ పె ట్టుబడుల పరిమితిని పెంచనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆర్థికరంగ సంస్కరణల్లో ఇదొక భాగంగా ప్రకటించారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps